ఆదివారం
07-12-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 10, సంచిక : 76
పేజీలు : 8, వెల: రూ.6.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Karimnagar, Khammam

www.visalaandhra.com
విశాలాంధ్ర
స్థాపితం : 1952
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ద.కొరియాకు అమెరికా ఆయుధాల విక్రయం

వాషింగ్టన్: దక్షిణ కొరియాకు ఆయుధాలు విక్రయించేందుకు అమెరికా సిద్ధమైంది. 111.8 మిలియన్ డాలర్లు విలువ చేసే 'జీబీయూ-39/బి స్మాల్ డయామీటర్ బాంబ్స్-ఇంక్రిమెంట్ 1' (బాంబ్ అస్త్రవ్యవస్థ)ను విక్రయించేందుకు అమెరికా స్టేట్ డిపార్ట్‌మెంట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు పెంటగాన్ ఓ ప్రకటన చేసింది. విక్రయించే ఆయుధాలలో 624 అదనపు జీబీయూ-39/బి బాంబులు, 250 పౌండ్ల శాటిలైట్ -గైడెడ్ అస్త్రం (ట్యాంకులు, బంకర్లు, ఎయిర్‌క్రాఫ్ట్ షెల్టర్లపై దాడికి వినియోగించేది) ఉన్నట్లు తెలిపింది. బోయింగ్ కార్పొరేషన్ ప్రాథమిక కాంట్రాక్టర్‌గా ఉంటుందని పెంటగాన్ వెల్లడించింది.

నటి ప్రగతి ప్రతిభ

విశాలాంధ్ర-విజయవాడ: టర్కీలో జరిగిన ఏషియన్ ఓపెన్ అండ్ మాస్టర్స్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్‌లో నాలుగు పతకాలు సాధించి నటి ప్రగతి (49) తన ప్రతిభ కనబర్చారు. క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్న ఆమె దేశంలోనే కాకుండా అంతర్జాతీయ స్థాయి పోటీల్లో మెరుస్తున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ పెట్టారు. ఏషియన్ గేమ్స్‌లో సిల్వర్ మెడల్ సాధించగా, డెడ్ లిఫ్టకు గోల్డ్ మెడల్ దక్కిందని తెలిపారు. బెంచ్, స్వాడ్ లిఫ్టింగ్‌లో మరో రెండు సిల్వర్ మెడల్స్ సాధించినట్లు ప్రగతి వెల్లడించారు. సంబంధిత వీడియో వైరలైంది. ఆమెకు శుభాకాంక్షలు

- మిగతా 2 లో

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

10 నుంచి చర్చలు

న్యూఢిల్లీ: భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద చర్చలు డిసెంబర్ 10 నుంచి ప్రారంభం కానున్నట్లు కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ చర్చల్లో మొదటి విడత ఒప్పందంపై దృష్టి సారించనున్నారు. ఢిల్లీలో జరగబోయే ఈ చర్చలకు అమెరికా తరఫున హాజరవుతున్న బృందంలో డిప్యూటీ ట్రేడ్ రిప్రజెంటేటివ్ రిక్ స్విట్జర్ పాల్గొననున్నారు. భారత ఎగుమతులపై అమెరికా 50 శాతం సుంకాలు విధించిన సంగతి

- మిగతా 2 లో

తొలి 'ఎస్ఐఆర్' కేసు నమోదు

లక్నో: ఓటర్ల జాబితా సవరణకు చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)లో భాగంగా తప్పుడు సమాచారం ఇచ్చిన కుటుంబంపై కేసు నమోదైంది. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 31 కింద సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు కేసు పెట్టారు. అయితే ఎస్ఐఆర్‌కు సంబంధించిన మొదటి కేసుగా ఇది నిలిచింది. ఉత్తరప్రదేశ్‌లోని రాంపూర్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. నూర్జహాన్ కుటుంబం రాంపూర్‌లో నివసిస్తున్నది. ఆమె కుమారులు అమీర్ ఖాన్, దానిష్ ఖాన్ చాలా కాలంగా దుబాయ్, కువైట్‌లో ఉంటున్నారు. ఎస్ఐఆర్ దరఖాస్తులో నూర్జహాన్ తన

- మిగతా 2 లో

ఇదీ లోకం!



'కాషాయ' భారతం కోసం కుట్ర

రాజ్యాంగంలో 'సెక్యులర్, సోషలిస్ట్' పదాలు తొలగించాలి
రాజ్యసభకు బీజేపీ ప్రైవేటు బిల్లు

న్యూఢిల్లీ: 'కాషాయ' భారతానికి కమనాథులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. లౌకిక దేశాన్ని ఏకమత రాజ్యంగా మార్చి... మనువాద సిద్ధాంతం అమలు చేసేందుకు బీజేపీ-ఆర్ఎస్ఎస్ తీవ్ర కసరత్తు చేస్తున్నాయి. చేతిలో అధికారం ఉండటంతో కాషాయ అజెండా అమలు కోసం రాజ్యాంగాన్ని మార్చేందుకు నిరంతరం కుట్ర చేస్తున్నాయి. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా నిలుస్తూ ప్రజాస్వామ్యానికి చిహ్నమైన భారతదేశ లౌకిక-సామ్యవాద స్ఫూర్తికి విఘాతం కలిగించే నిర్ణయాలు తీసుకుంటున్నాయి. అందులో భాగంగా రాజ్యాంగ పీఠిక నుంచి సామ్యవాదం (సోషలిస్ట్), లౌకికవాదం (సెక్యులర్) పదాలు తొలగించేందుకు అధికార బీజేపీ పావులు కదిపింది. 1976లో ఎమర్జెన్సీ కాలంలో ఎలాంటి చర్చ లేకుండా జరిగిన 42వ సవరణ ద్వారా ఈ రెండు పదాలను రాజ్యాంగ పీఠికలో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చేర్చారని, 1950 నుంచి ఇవి ఆచరణలోకి వచ్చాయని, 1949 నుంచి రాజ్యాంగం అమల్లో ఉన్నదని కమలనాథులు వాదిస్తున్నారు. ఇప్పుడు అధికారికంగా ఈ రెండు పదాలు తొలగింపు కోసం పార్లమెంటులో చట్టం తెచ్చేందుకు బీజేపీ ఎంపీలు ప్రయత్నిస్తున్నారు.

రాజ్యాంగ పీఠిక నుంచి సామ్యవాదం (సోషలిస్ట్), లౌకికవాదం(సెక్యులర్) పదాలు తొలగించాలని కోరుతూ బీజేపీ ఎంపీ భీమ్ సింగ్ శనివారం రాజ్యసభలో ప్రైవేటు మెంబర్స్ బిల్లు ప్రవేశపెట్టారు. 'నాడు ప్రతిపక్ష నాయకులు అతల్ బిహారి వాజ్‌పేయి, లాల్ కృష్ణ అద్వానీ, జార్జ్ ఫెర్నాండెజ్ జైల్లో ఉండి... ప్రజాస్వామ్యం ఖూనీ అయిన అత్యవసర పరిస్థితుల్లో (ఎమర్జెన్సీ) అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ సెక్యులర్, సోషలిస్ట్ పదాలను పరిచయం చేశారు. వీటిని ఆ తర్వాత రాజ్యాంగంలో చేర్చారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడు ఇవి అందులో లేవు' అని

- మిగతా 2 లో

గ్లోబల్ సమ్మిట్ ఓ రోల్ మోడల్

ప్రపంచ దేశాలతో పోటీ పడేలా తెలంగాణ ప్రగతి
దేశ విదేశాల నుంచి దిగ్గజాల రాక: పొంగులేటి

విశాలాంధ్ర - హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈనెల ఎనిమిది, తొమ్మిది తేదీల్లో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్ ప్రపంచంలోనే రోల్ మోడల్‌గా నిలుస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఫ్యూచర్ సిటీలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను మంత్రి శనివారం పరిశీలించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. ఈ సమ్మిట్‌కు దేశవిదేశాల నుంచి అనేక రంగాల దిగ్గజాలను ఆహ్వానించినట్టు చెప్పారు. గడచిన రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతోపాటు విజన్-2037 , విజన్ -2047కు సంబంధించిన ప్రభుత్వ లక్ష్యాలు, ఆలోచనలను వివరించబోతున్నామని తెలిపారు. తెలంగాణ ప్రగతి... ప్రపంచంలో అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఇందిరమ్మ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోందని వివరించారు. రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు తెలంగాణ రైజింగ్ - 2047 విజన్‌తో ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. 2035 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీగా వృద్ధి సాధించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని చెప్పారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల లక్ష్యం సాధించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. సమ్మిట్‌పై ఇండిగో విమానాల రద్దు ప్రభావం ఏమాత్రం చూపదని చెప్పారు.

ఇందిరా మహిళా శక్తి స్టాల్ ప్రధాన ఆకర్షణ

గ్లోబల్ సమిట్‌లో మహిళా సాధికారతకు ప్రతీకగా ఇందిరా మహిళా శక్తి స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ప్రజాప్రభుత్వం మహిళల ఆర్థిక, సామాజిక అభ్యున్నతిని ప్రధాన లక్ష్యంగా తీసుకుని అమలు చేస్తున్న విధానాలకు ఈ స్టాల్ అద్దం పడుతోంది. మహిళా స్వయం సహాయక సంఘాల శక్తి, సాధికారత, వ్యాపార నైపుణ్యాలను జాతీయ, అంతర్జాతీయ ప్రతినిధుల ముందు సమగ్రంగా ప్రదర్శించే వేదికగా ఇందిరా మహిళా శక్తి స్టాల్ నిలుస్తోంది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్), తెలంగాణ మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ స్టాల్‌లో, ఇందిరా మహిళా శక్తి ద్వారా మహిళల ఆర్థిక బలోపేతానికి ప్రభుత్వం చేపట్టిన అనేక వినూత్న కార్యక్రమాల నమూనాలు ప్రదర్శిస్తున్నారు. ఇందిరా మహిళా శక్తి పెట్రోలు బంకు, హైటెక్ సిటీలో ఇందిరా మహిళా శక్తి బజార్, జిల్లాల్లో నిర్మితమైన ఇందిరా మహిళా శక్తి భవనాలు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, ఆర్టీసీ అద్దె బస్సుల నిర్వహణ వంటి విభిన్న వ్యాపారాల్లో మహిళా స్వయం సహాయక సంఘాలు సాధించిన విజయాలు ఈ స్టాల్‌లో ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. మహిళా సాధికారతకు ఇస్తున్న ప్రాధాన్యత ఈ స్టాల్‌లో ప్రతిఫలిస్తోంది. బ్యాంకింగ్ లింకేజ్ రుణాల ద్వారా మహిళా సంఘాలకు ఆర్థిక బలాన్ని అందించడం, వందల కోట్ల రూపాయల వడ్డీ చెల్లింపులతో మహిళలపై రుణభారాన్ని తగ్గించడం, మహిళా సభ్యులకు రూ.10 లక్షల లోన్ బీమా, రూ.రెండు లక్షల ప్రమాద బీమా వంటి భద్రతా చర్యలు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా పాలన... మంత్రి సీతక్క మార్గదర్శకత్వంలో... మహిళలపై ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఇప్పటికే 20కు పైగా విభిన్న వ్యాపార రంగాల్లో మహిళా

- మిగతా 2 లో

రాష్ట్ర ప్రయోజనాలకే 'గ్లోబల్ సమ్మిట్'

3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థే లక్ష్యం
44 దేశాల నుంచి 150 మంది ప్రతినిధులు: భట్టి

విశాలాంధ్ర - హైదరాబాద్ : భారత్ ఫ్యూచర్ సిటీలో ఈ నెల ఎనిమిది, తొమ్మిది తేదీల్లో నిర్వహించే తెలంగాణ గ్లోబెల్ రైజింగ్ సమ్మిట్- 2025 అని, ఇది పూర్తిగా ఎకనమిక్ సమ్మిట్ అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. 2047 నాటికి తెలంగాణ 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థను సాధించడమే లక్ష్యంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నీతి అయోగ్, ఐఎస్బీ - హైదరాబాద్ సలహాలు సూచనలతో విజన్ డాక్యుమెంట్ రూపొందించినట్టు చెప్పారు. ఎనిమిదో తేదీ మధ్యాహ్నం సమ్మిట్‌ను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభిస్తారని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కేబినెట్ కలిసికట్టుగా ఆలోచనలు చేసి విజన్ డాక్యుమెంట్ రూపొందించినట్లు పేర్కొన్నారు. అంతర్జాయ స్థాయిలో పేరొందిన ఆర్థికవేత్తలు ప్రసంగిస్తారని వివరించారు. తొలిరోజు అభిజిత్ బెనర్జీ, ట్రంప్-మీడియా అండ్ టెక్నాలజీస్ నుంచి ఎరిక్ స్వేడర్, శ్రీధర్ బాబు, కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివ కుమార్, నోబెల్ బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి, కిరణ్ మజుందార్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ప్రసంగిస్తారని తెలిపారు. సీఎం కీలక ప్రసంగం చేస్తారని చెప్పారు. అనంతరం సెషన్ లు ప్రారంభం అవుతాయన్నారు. సమ్మిట్ లో ఆరు ఖండాల్లోని 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు పాల్గొంటున్నట్లు వివరించారు. ఒక్క అమెరికా నుంచే 46 మంది హాజరవుతున్నాట్లు చెప్పారు. పెట్టుబడిదారులు రాష్ట్రానికి రావాలన్న సదుద్దేశంతో సమ్మిట్ ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు ఇది ఎతంగానో దోహదపడుతుందన్నారు.

వెంటిలేటర్‌పై 'ఇండియా' : ఒమర్ అబ్దుల్లా

2లో

ట్రంప్‌కు ఫిఫా శాంతి పురస్కారం

2లో

తనను తాను శాంతి దూతగా ప్రచారం చేసుకునే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నోబెల్ దక్కలేదు కానీ మరొక ప్రతిష్ఠాత్మక శాంతి పురస్కారం లభించింది.

సీపీఐ అభ్యర్థుల విజయకేతనం

దారేడు, పల్లెగూడెం పంచాయతీలు ఏకగ్రీవం

విశాలాంధ్ర-ఖమ్మం రూరల్ : మండలంలో సీపీఐ తన సత్తా చాటింది. తమ కంచుకోటలైన దారేడు, పల్లెగూడెం పంచాయతీలను పోలింగ్‌కు ముందే కైవసం చేసుకుంది. దారేడు సర్పంచ్‌గా భక్తుల వెంకటేశ్వర్లు, పల్లెగూడెం సర్పంచ్‌గా చుండూరు సుజన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పార్టీ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్ ... అగ్రస్థాయి నాయకత్వం చూపిన చొరవతో విజయం సాకారమైంది.

ఏకగ్రీవాలతో శ్రేణులలో జోష్ పెంచింది. పంచాయతీలలో సీపీఐ అభ్యర్థుల గెలుపునకు కార్యకర్తలు కృషి చేస్తున్నారు.

500కి.మీ వరకు రూ.7500

విమాన టికెట్ ధరలు నిర్ణయించిన కేంద్రం

న్యూఢిల్లీ: దేశీయ విమానయాన సంస్థ ఇండిగో సేవల్లో అంతరాయం వల్ల ప్రయాణికులు గమ్యస్థానాలు చేరుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ పరిస్థితిని కొన్ని విమానయాన సంస్థలు ఆసరాగా తీసుకోవడంతో టికెట్ ధరలు ఆకాశన్నంటుతున్నాయి. తాము టికెట్ల కోసం అధిక ధరలు చెల్లించినట్లు కొంతమంది ఎక్స్ వేదికగా పోస్టులు పెడుతున్నారు. ఈ అవకాశవాద ధరల పెంపు విషయం తన దృష్టికి రావడంతో శనివారం కేంద్రం రంగంలోకి దిగింది. ప్రయాణికులను అధిక చార్జీల భారం నుంచి రక్షించేందుకు చర్యలు చేపట్టింది. ధరల నియంత్రణను తీసుకువచ్చామని, వాటిని పాటించాలని ఆదేశించినట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

ఎకానమీ క్లాస్‌లో కి.మీ.వారీగా గరిష్ఠ చార్జీలు
500కి.మీ వరకు - రూ.7,500
500-1000కి.మీ - రూ.12,000
1000-1500కి.మీ - రూ.15,000
1500కి.మీ.దాటితే - రూ.18,000

'అంతరాయాల సమయంలో అసాధారణంగా చార్జీలు పెంచడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఈ తరహా అవకాశవాద ప్రవర్తన నుంచి ప్రయాణికులను

- మిగతా 2 లో

గుమ్మడి... ఆదర్శ కమ్యూనిస్టు

- నేటి తరం నేతలకు మార్గదర్శి
- కూనంనేని సాంబశివరావు, మంత్రి కోమటిరెడ్డి
- మాజీ ఎమ్మెల్యే బయోపిక్ చిత్రీకరణ ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-కొత్తగూడెం: సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య వర్తమాన రాజకీయల్లో ఆదర్శ కమ్యూనిస్టు, ఆయన జీవితం మార్గదర్శకమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. ఐదుసార్లు ఎమ్మెల్యే అయినా సాదాసీదాగా జీవించారని, ఆయనపై సినిమా తీయడం అభినందనీయమన్నారు. గుమ్మడి నరసయ్య బయోపిక్ నేటితరం నాయకులకు స్ఫూర్తినిస్తుందని ఆకాంక్షించారు. పాల్వంచలోని పెద్దమ్మ గుడి వద్ద ప్రవల్లిక ఆర్ట్స్ క్రియేషన్ బ్యానర్‌పై గుమ్మడి నరసయ్య సినిమా చిత్రీకరణ శనివారం ప్రారంభమైంది. కార్యక్రమలో సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి

- మిగతా 2 లో

రాష్ట్రాన్ని నంబర్-1గా నిలబెడతా

ధాన్యం కొనుగోళ్లు, గంజాయి నియంత్రణలో అగ్రస్థానం
అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రపంచానికి చాటిచెబుతా
దేవరకొండను తీర్చిదిద్దుతా: రేవంత్

విశాలాంధ్ర బ్యూరో-నల్లగొండ: రాబోయే రోజుల్లో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో నంబర్‌వన్‌గా నిలబెడతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. 'ప్రజాపాలన - ప్రజా విజయోత్సవాలు' కార్యక్రమాన్ని శనివారం నల్లగొండ జిల్లా దేవరకొండలో నిర్వహించారు. మున్సిపాలిటీలో రూ. 20 కోట్ల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. మెప్మా మహిళా సంఘాలకు రూ.11.33 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలను అందజేశారు. అనంతరం రేవంత్ మాట్లాడుతూ... ధాన్యం కొనుగోళ్లు, గంజాయి నియంత్రణ, విద్య, వైద్యం వంటి రంగాల్లో తెలంగాణ ఇప్పటికే దేశంలో అగ్రస్థానంలో ఉందన్నారు. ఈ నెల ఎనిమిది, తొమ్మిది తేదీల్లో మహేశ్వరంలో జరగనున్న 'తెలంగాణ రైజింగ్ సమ్మిట్' ద్వారా రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమాలను ప్రపంచానికి చాటిచెప్పనున్నట్టు తెలిపారు. దేవరకొండ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. నర్సింగ్ కళాశాలకు అంచనాలు సిద్ధం చేసి పంపాలని కలెక్టర్‌ను ఆదేశించారు. తాండాల నుంచి మండలాలకు... జిల్లా కేంద్రాలకు... హైదరాబాద్‌కు మెరుగైన రహదారుల నిర్మాణానికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామన్నారు. గిరిజన ప్రాంతమైన దేవరకొండ, అచ్చంపేటలోని మద్దిమడుగును పుణ్యక్షేత్రంగా

- మిగతా 2 లో

ఇండిగో ప్రహసనమే!

ఐదవ రోజూ 400కు పైగా విమానాల రద్దు
విమానాశ్రయాల్లో సహనం కోల్పోతున్న ప్రయాణికులు

5 లో

ట్రంప్‌కు ఫిఫా శాంతి పురస్కారం

వాషింగ్టన్: తనను తాను శాంతి దూతగా ప్రచారం చేసుకునే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు నోబెల్ దక్కలేదు కానీ మరొక ప్రతిష్ఠాత్మక శాంతి పురస్కారం లభించింది. 2026 సంవత్సరానికిగాను ఫిఫా శాంతి పురస్కారం ఆయనను వరించింది. రాజధాని వాషింగ్టన్‌లోని కెన్నడీ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ట్రంప్‌కు ఫిఫా శాంతి పురస్కారాన్ని ప్రకటించారు. ఇదే సందర్భంగా ప్రపంచకప్ ట్రోఫీని ఆవిష్కరించారు. సంగీత కచేరీలు, నృత్యాలు, ఆటపాటలతో కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. సెలబ్రిటీలు సందడి చేశారు. అనేక దేశాల మధ్య శాంతి కుదిర్చినందుకుగాను ట్రంప్‌కు ఫిఫా శాంతి పురస్కారం ప్రకటించినట్లు ఫిఫా అధ్యక్షుడు గియాని ఇన్‌ఫాంటినో పే తెలిపారు. ఈ అవార్డు ప్రకటించడంతో సంబర పడిన ట్రంప్ 'తన జీవితంలో అత్యుత్తమ గౌరవం లభించింది' అని చెప్పుకున్నారు. అవార్డు అందుకున్న సమయంలో తన భార్య మెలనియాకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. శాంతి పురస్కారాన్ని ప్రారంభిస్తున్నట్లు ప్రపంచ సాకర్ గవర్నింగ్ బాడీ ఈ ఏడాది నవంబరులో ప్రకటించింది. ప్రపంచ దేశాల మధ్య సఖ్యత, శాంతిని పెంపొందించేందుకు అత్యుత్తమ సేవలు అందిస్తూ అసాధారణ రీతిలో తోడ్పడిన వారికి ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారంతో సన్మానిస్తామని వెల్లడించింది. ఇదిలావుంటే, 500 కోట్ల మంది ఫుట్‌బాల్ క్రీడాభిమానుల తరపున ఈ అవార్డు అందజేస్తామని అధ్యక్షుడు గియాని తెలిపారు. డ్రా ద్వారా ఫిఫా శాంతి పురస్కారాన్ని ట్రంప్‌నకు ప్రకటించారు. అవార్డు రూపేణ ఆయనకు బంగారు పతకాన్ని అందజేశారు. ప్రపంచ దౌత్యంలో ట్రంప్ పాత్ర ఎనలేనిదనిగా గియాని అభివర్ణించారు. అయితే ట్రంప్‌కు ఫిఫా తొలి శాంతి పురస్కారం అందించడం రాజకీయంగా దుమారం రేపింది. అనేక విమర్శలు వినవస్తున్నాయి. ఈ చర్యకుగాను ఫిఫాను మానవ హక్కుల సంస్థ తప్పుపట్టింది. అవార్డుల ఎంపిక ఎప్పుడు పారదర్శకంగా జరగాలని, ఎంపికయ్యే వ్యక్తులు, న్యాయనిర్ణేతలు లేకుండా పురస్కారం ఎలా ప్రకటించారని ప్రశ్నించింది.

ఇది నాకు దక్కిన అత్యున్నత గౌరవం: ట్రంప్

అవార్డు అందుకున్న తర్వాత ట్రంప్ మాట్లాడుతూ 'ఇది నా జీవితంలో అందుకున్న అత్యున్నత గౌరవం. శాంతి పురస్కారం వరించడం ఎంతో గర్వకారణం. ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా దౌత్యానికి ప్రయత్నిస్తాను తప్ప అవార్డుల కోసం కాదు. అనేక దేశాల మధ్య యుద్ధాలు ఆపాను. మరికొన్ని దేశాల్లో శాంతికి ప్రయత్నిస్తున్నాను' అని ట్రంప్ చెప్పుకున్నారు. కాగా, 2026, జూన్ 11 నుంచి ప్రపంచ కప్ సాకర్ పోటీలు ప్రారంభం కానున్నాయి. మెక్సికో, కెనడా, అమెరికా దేశాలు ఆతిథ్యమిస్తున్నాయి. ఫిఫా చరిత్రలోనే తొలిసారి 48 జట్లు గ్రూప్ స్టేజీ మ్యాచ్‌లు ఆడబోతున్నాయి. ఒక్కో గ్రూపులో నాలుగు చొప్పున దేశాలతో 12 గ్రూపులు ఉంటాయి. గ్రూప్ స్టేజీ మ్యాచ్‌లకు 42 జట్లు అర్హత సాధించగా, మిగతా ఆరు స్థానాల కోసం 22 జట్లు పోటీపడుతున్నాయి.

ఉగ్ర జాబితా నుంచి సిరియా తొలగింపు: కెనడా

ఒట్టావా: కెనడా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఉగ్రవాదానికి మద్దతిచ్చే విదేశాల జాబితా నుంచి సిరియాను తొలగించింది. సిరియా అధ్యక్షుడు బషర్ అల్ అసద్‌ను గద్దె దించేందుకు రెబల్ కూటమికి మద్దతిచ్చిన సంస్థ హయాత్ తెహ్రీర్ అల్ షామ్ పేరును ఉగ్రవాద సంస్థల జాబితా నుంచి మినహాయించింది. అమెరికా, బ్రిటన్ సహా మిత్రదేశాలు ఇటీవల సిరియా సుస్థిరతకు మద్దతిచ్చేందుకు అంగీకరించడం, ఆ క్రమంలో నిర్ణయాలు తీసుకున్న దృష్ట్యా తాజా చర్యలు తీసుకున్నట్లు కెనడా ప్రభుత్వ అధికారిక ప్రకటన వెల్లడించింది.

శాంతి కుదిరినా పుతిన్ తప్పించుకోలేరు: ఐసీసీ

ది హేగ్: అమెరికా నాయకత్వంలో శాంతి నెలకొల్పే విషయంలో ఉక్రెయిన్‌తో రాజీ కుదిరినాగానీ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అరెస్టు నుంచి తప్పించుకోలేదరని అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) ప్రాసిక్యూటర్లు తెలిపారు. శాంతి ఒప్పందం తర్వాత కూడా ఆయన అరెస్టు కోసం జారీ చేసిన వారెంటు చెల్లుబాటు అవుతుందని డిప్యూటీ ప్రాసిక్యూటర్లు మమే మండియాయే నియంగ్ (సెంగల్), నజ్రత్ షమీమ్ ఖాన్ (ఫిజీ) తేల్చిచెప్పారు. చీఫ్ ప్రాసిక్యూటర్ సెలవుపై వెళ్లినప్పటి నుంచి కోర్టు విచారణల బాధ్యతను నియంగ్, ఖాన్ చేపట్టారు. కోర్టు జారీ చేసిన వారెంట్లు రద్దు కావాలంటే ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానం చేయాల్సి ఉంటుందని తెలిపారు. కాగా, 2022లో ఉక్రెయిన్‌పై సైనిక చర్యలను రష్యా మొదలు పెట్టింటి. అప్పటి నుంచి జరిగిన దురాగతాలపై ఆరోపణలను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలోనే పుతిన్, మరో ఐదుగురి అరెస్టునకు ఐసీసీ వారెంటు జారీచేసింది. యుద్ధ నేరాల ఆరోపణలను ఇప్పటికే చాలా సార్లు రష్యా తిరస్కరించింది.

ఫ్రాన్స్ క్రిస్మస్ వేడుకల్లో విషాదం

జనంపైకి దూసుకెళ్లిన కారు

10 మంది దుర్మరణం

పారిస్: క్రిస్మస్ సందర్భంగా ఫ్రాన్స్‌లో నిర్వహించిన వేడుకల్లో విషాదం చోటు చేసుకుంది. గ్వాడెలోప్‌లోని సెయింట్-ఆన్ వద్ద వేడుకల్లో పాల్గొన్న జపంపైకి ఓ కారు దూసుకెళ్లింది. దీంతో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 9 మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఘటన గురించి తెలిసిన వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, వైద్య బృందాలు అక్కడకు స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. గతేడాది జర్మనీలోనూ క్రిస్మస్‌కు కొన్ని రోజుల ముందు ఇలాంటి ఘటనే జరిగింది. మాగ్డెబర్గ్ నగరంలోని క్రిస్మస్ మార్కెట్‌లోకి కారు దూసుకెళ్లడంతో ఇద్దరు మరణించగా, 68 మంది గాయపడ్డారు.

బయల్దేరుతుండగా విమానంలో మంటలు

ప్రయాణికులంతా సురక్షితం

బ్రసిలియా: బ్రెజిల్‌లోని గ్వారుల్హోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఘోర ప్రమాదం జరిగింది. లాటమ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన ఎయిర్‌బస్ ఏ320 విమానం 180 మంది ప్రయాణికులతో బయల్దేరే సమయానికి ఒక్కసారిగా క్యాబిన్‌లో మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే ప్రయాణికులను కిందకు దించేశారు. దీంతో పెద్దఎత్తున ప్రాణ నష్టం తప్పింది. మంటలు ఎగిసిపడటంతో ఆ ప్రాంతాన్ని పొగ కమ్మేసింది. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు.

ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో అధికారులంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనను విమానయాన సంస్థ, విమానాశ్రయ అధికారులు ధ్రువీకరించారు. లగేజీ లోడర్‌లో అగ్ని ప్రమాదం జరిగి మంటలు వ్యాపించినట్లు తేల్చారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి.

అఫ్గాన్-పాక్ మధ్య కాల్పులు: నలుగురి మృతి

కాబూల్: అఫ్గానిస్థాన్‌కు, పాకిస్థాన్‌కు మధ్య ఉద్రిక్తతలు మళ్లీ పెరిగాయి. కాందహార్ సమీపంలో రెండు దేశాల సైనికుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. దీంతో నలుగురు చనిపోగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. ఈ మేరకు అఫ్గాన్ అధికారులు శనివారం తెలిపారు. మజల్ గాలి, లుక్మాన్ గ్రామ ప్రాంతాల్లో కాల్పులు జరిగాయని, గాయపడిన వారికి ఐనో మినా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు వెల్లడించారు. కాందహార్ ప్రావిన్స్‌లోని స్పిన్ బోల్డాక్ జిల్లా గవర్నర్ ఈ మరణాలను ధృవీకరించారు. సౌదీ అరేబియాలో శాంతి చర్చలు విఫలమైన తర్వాత ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో పాకిస్తాన్ భారీ ఫిరంగులతో స్పిన్ బోల్డాన్ జిల్లాపై విరుచుకుపడగా, తమ దళాలు ప్రతిఘటించినట్లు అఫ్గాన్ ప్రభుత్వ ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ ఎక్స్‌లో పేర్కొన్నారు. కాల్పులు ఆగినట్లు కాందహార్ సమాచార విభాగాధిపతి అలీ మమమ్మద్ హక్మల్ చెప్పారు. అయితే పాకిస్థాన్‌లోని బదానీ ప్రాంతంలో భారీ ఫిరంగులతో అఫ్గాన్ దాడి చేసినట్లు పాక్ అధికారులు వెల్లడించారు.

జస్టిన్ ట్రుడోకు జపాన్ మాజీ ప్రధాని ఆతిథ్యం

టోక్యో: కెనడా మాజీ ప్రధాని జస్టిన్ ట్రుడో తన ప్రియురాలు క్యాటీ పెర్రీతో కలిసి జపాన్‌లో పర్యటించారు. ఆ దేశ మాజీ ప్రధాని ఫుమియో కిషిదా దంపతులు వీరికి ఆతిథ్యమిచ్చారు. విందులో పాల్గొన్న తమ ఫోటోలను కిషిదా, ట్రుడో 'ఎక్స్'లో జపాన్ ఈ భేటీ కావడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కెనడా ప్రధానిగా దాదాపు పదేళ్ల కొనసాగిన ట్రుడో ఈ ఏడాది ప్రారంభంలో తన పదవికి రాజీనామా చేయడం తెలిసిందే.

500 కి.మీ వరకు రూ.7500

(మొదటిపేజీ తరువాయి)

రక్షించేందుకు చర్యలు చేపడుతున్నాం. ప్రభావిత మార్గాల్లో న్యాయబద్ధమైన చార్జీలను నిర్ధారించేందుకు మంత్రిత్వశాఖ తన నియంత్రణ అధికారాలను ఉపయోగించుకుంది. కార్యకలాపాలు సాధారణ స్థితికి చేరుకునేవరకు కొత్తగా సూచించిన పరిమితులను కచ్చితంగా పాటించాలి. వందల సంఖ్యలో విమాన సర్వీసులు రద్దయిన నేపథ్యంలో వృద్ధులు, విద్యార్థులు, వైద్యసహాయం అందాల్సిన ప్రయాణికులు సీట్లు దొరక్క ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ధరలపై నియంత్రణ ఉండేలా, దోపిడీని నిరోధించాల్సిన అవసరం ఉంది' అని మంత్రిత్వశాఖ వెల్లడించింది. ఆర్‌సీఎస్-యూడీఏఎన్ విమానాలు, బిజినెస్ క్లాస్‌కు ఈ చార్జీలు వర్తించవని కేంద్రం వెల్లడించింది. ధరల స్థిరీకరణ జరిగేవరకు లేక తదుపరి సమీక్ష జరిగేవరకు ఈ పరిమితులు అమల్లో ఉంటాయని వెల్లడించింది. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని పేర్కొంది. కేంద్ర విమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు అధికారులతో సమీక్ష జరిపిన అనంతరం ఈ ప్రకటన వెలువడింది. ఎయిర్‌లైన్స్, ట్రావెల్ ప్లాట్‌ఫామ్స్‌పై ప్రభుత్వం పూర్తిస్థాయిలో దృష్టిపెట్టడంతో ఎప్పటికప్పుడు ధరలపై పర్యవేక్షణ ఉంటుందని అధికారులు వెల్లడించారు. కరోనా సమయంలోనూ కేంద్రం ఇలా ధరల పరిమితి విధించింది.

పెండింగ్ రీఫండ్స్ వెంటనే చెల్లించాలి

ఎలాంటి జాప్యం లేకుండా పెండింగ్‌లో ఉన్న రీఫండ్‌లను వెంటనే చెల్లించాలని మంత్రిత్వ శాఖ ఆదేశించింది. రద్దయిన, ఆలస్యమవుతోన్న విమాన సర్వీసులకు సంబంధించి రీఫండ్ ప్రక్రియను ఆదివారం రాత్రి 8 గంటల కల్లా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. రద్దు కారణంగా ఇప్పటికే ప్రభావితమైన ప్రయాణికులపై రీ షెడ్యూలింగ్ చార్జీలు విధించకూడదని తన ఆదేశాల్లో పేర్కొంది. ప్రయాణికుల లగేజీలను 48 గంటల్లో ఎవరివి వారికి అప్పగించాలని వెల్లడించింది. ఈ రీఫండ్ ప్రక్రియలో జాప్యం చేసినా లేక ఆదేశాలను బేఖాతరు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించింది.

తొలి 'ఎస్ఐఆర్' కేసు నమోదు

(మొదటిపేజీ తరువాయి)

కుమారులు రాంపూర్‌లో ఉన్నట్లు పేర్కొన్నారు. ఫోర్జరీ సంతకాలతో పత్రాలను బూత్ స్థాయి అధికారికి సమర్పించారు. వివరాలు డిజిటలైజేషన్ సమయంలోనూ తప్పుడు సమాచారమే ఇచ్చారని తేలింది. దీంతో బీఎన్ఎస్‌తోపాటు ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 31 కింద అధికారి ఫిర్యాదు చేయడంతో నూర్జహాన్ కుటుంబంపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పుడు సమాచారం ఇచ్చినందుకు కేసు నమోదు కావడం ఇది తొలిసారి.

భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం

(మొదటిపేజీ తరువాయి)

తెలిసిందే. ఆ తర్వాత వాణిజ్య ఒప్పందంపై చర్చలు జరగడం ఇది రెండోసారి. చివరిసారి అమెరికా ప్రతినిధులు సెప్టెంబరు 16న భారత్‌కు వచ్చారు. అనంతరం సెప్టెంబరు 22న వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ నేతృత్వంలోని బృందం అమెరికా వెళ్లింది. ఈ క్యాలండర్ ఏడాదిలోనే అమెరికాతో తొలి దశ వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉందని ఇటీవల వాణిజ్య శాఖ కార్యదర్శి రాజేశ్ అగర్వాల్ వెల్లడించారు. అందులో భారత ఎగుమతిదారులకు లబ్ధిచేకూరేలా సుంకాల అంశాన్ని ప్రస్తావిస్తామని తెలిపారు. టారిఫ్‌ల సమస్య పరిష్కారానికి ఓ దఫా... పూర్తిస్థాయి వాణిజ్య ఒప్పందం దిశగా మరో విడత చర్చలు జరుపుతామని చెప్పారు. 2025 డిసెంబరు నాటికి వాణిజ్య చర్చలు పూర్తి కావాలని రెండు దేశాలు నిర్దేశించుకున్నాయి. ఆ దిశగా ఇప్పటి వరకు ఆరు విడతలు సమావేశమయ్యారు. ప్రస్తుతం భారత్-అమెరికా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం విలువ 191 బిలియన్ డాలర్లుగా ఉంది. 2030 నాటికి దీన్ని 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

గ్లోబల్ సమ్మిట్ ఓ రోల్ మోడల్

(మొదటిపేజీ తరువాయి)

స్వయం సహాయక సంఘాలను ప్రోత్సహిస్తూ, మహిళలను యజమానులుగా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం ఉంది.

రెండు రోజుల పాటు 27 ప్రత్యేక ప్యానెల్ చర్చలు

గ్లోబల్ సమ్మిట్-2025 కు దేశ విదేశాల నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల నిపుణులు, విద్యావేత్తలు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు తరలిరానున్నారు. రాష్ట్ర భవిష్యత్తును ఆవిష్కరించే దిశగా జరిగే ఈ గ్లోబల్ సమ్మిట్‌లో రెండు రోజులపాటు మొత్తం 27 ప్రత్యేక ప్యానెల్ చర్చలు జరుగుతాయి. ఎనర్జీ, గ్రీన్ మొబిలిటీ, ఐటీ-సెమీకండక్టర్లు, హెల్త్, ఎడ్యుకేషన్, టూరిజం, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వ్యవసాయం, పరిశ్రమలు, మహిళా వ్యాపారవేత్తల ప్రోత్సాహం, గిగ్ ఎకానమీ, సామాజిక సంక్షేమం, స్టార్టప్‌లు వంటి విభిన్న రంగాలపై చర్చలు జరుగుతాయి. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్, వరల్డ్ బ్యాంక్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, యూనిసెఫ్ ప్రతినిధులతో పాటు టీఈఆర్ఐ, బీసీజీ, మైక్రాన్ ఇండియా, హిటాచీ ఎనర్జీ, ఓ2 పవర్, గ్రీన్‌కో, అపోలో ఆసుపత్రులు, ఐబీటీ హైదరాబాద్, ఎన్ఏఎస్ఎస్‌సీఓఎం, సఫ్రాన్, డీఆర్‌డీవో, స్కై రూట్, ధృవా స్పేస్, అమూల్, లౌరస్ లాబ్స్, జీఎంఆర్, టాటా రియాలిటీ, కొటక్ బ్యాంక్, గోల్డ్‌మాన్ సాఛస్, బ్లాక్ స్టోన్, డిలాయిట్, కేపిటల్ లాండ్, స్విగ్గీ, ఏడబ్ల్యుఎస్, ఆర్ఈడీ హెల్త్, పీవీఆర్ ఐనాక్స్, సిఖ్య ఎంటర్‌టైన్‌మెంట్, తాజ్ హోటల్స్ వంటి ప్రముఖ సంస్థల ప్రతినిధులు పాల్గొంటారు. పివి సింధు, అనిల్ కుంబ్లే, పుల్లెల గోపీచంద్, గగన్ నారంగ్, జ్వాలా గుత్తా వంటి క్రీడా ప్రముఖులు, ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్' సెషన్‌లో పాల్గొంటారు. రాజమౌళి, రితేష్ దేశ్‌ముఖ్, సుకుమార్, గునీత్ మోంగా, అనుపమా చోప్రా వంటి సినీ ప్రముఖులు, 'క్రియేటివ్ సెంచరీ-సాఫ్ట్ పవర్... ఎంటర్‌టైన్‌మెంట్' చర్చలో పాల్గొంటారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్వర్యంలో మంత్రులు, అన్ని విభాగాల ఉన్నతాధికారులు ఈ సమ్మిట్ నిర్వహణ ఏర్పాట్లతో పాటు సదస్సుకు తరలివచ్చే ప్రతినిధులను సమన్వయం చేస్తున్నారు. ఈ సదస్సులో రెండో రోజైన 9న రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆవిష్కరిస్తుంది. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దే రోడ్ మ్యాప్‌ను దీనిలో పొందుపరిచారు. సదస్సులో అన్ని రంగాల్లో భవిష్యత్తు తెలంగాణ అభివృద్ధికి అవసరమైన పెట్టుబడులు, టెక్నాలజీ భాగస్వామ్యాలు, నూతన ఆవిష్కరణల దిశగా సమగ్ర ప్రణాళికలను పొందుపరిచారు.

రాష్ట్రాన్ని నంబర్-1గా నిలబెడతా

(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి చేసి సేవాలాల్ మహారాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. దేవరకొండ వెంకటేశ్వరస్వామి ఆలయంలో పెండింగ్ పనులు పూర్తి చేస్తామని, జూనియర్ కళాశాల అభివృద్ధికి రూ.ఆరు కోట్లు ఇస్తామని ప్రకటించారు. పెండ్లిపాకలతో పాటు అన్ని లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను , ఎస్ఎల్‌బీసీ, డిండి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రెండేళ్లలో 61 వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని, 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని సీఎం వివరించారు. 25.35 లక్షల రైతు కుటుంబాలకు రూ.25,614 కోట్ల రుణమాఫీ చేశామని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించి, రాష్ట్రవ్యాప్తంగా రూ.22,500 కోట్లతో 4.5 లక్షల ఇళ్లు నిర్మిస్తున్నామని వెల్లడించారు. ఐటీడీఏ, చెంచు ప్రాంతాల్లో అదనంగా 25 వేల ఇళ్లకు ప్రత్యేక జీఓ జారీ చేసినట్లు తెలిపారు. మూడు కోట్ల 10 లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తుతో ఐదు లక్షల కుటుంబాలు లాభపడుతున్నాయని అన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు ఇచ్చామన్నారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ... ఉమ్మడి జిల్లాలో 3.77 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను మూడేళ్లలో పూర్తి చేస్తామని, డిండి ప్రాజెక్టుకు రూ.1,800 కోట్లు విడుదల చేసి పనులు ప్రారంభించినట్లు చెప్పారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ...రాష్ట్రవ్యాప్తంగా రూ.11 వేల కోట్లతో రోడ్ల పనులకు టెండర్లు పిలిచామని చెప్పారు. ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ... ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయి పెంపు, ఐటీఐ, ఉర్దూ పాఠశాల మంజూరు, తహసిల్దాం, ఎంపీడీవో భవనాలు, మిషన్ భగీరథ ద్వారా డిండి-చందంపేటకు తాగునీటి సరఫరా చేయాలని కోరారు. తొలుత రూ.13 కోట్లతో సీసీ రోడ్లు, ఏడు, తొమ్మిది, 10 వార్డుల్లో రూ.2.5 కోట్లతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, అన్ని వార్డుల్లో రూ.50 లక్షలతో సీసీ డ్రెయిన్లు, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ట్రాక్‌తో స్టేడియం అభివృద్ధికి రూ.2 కోట్లు, 19వ వార్డులో బీఎస్ఆర్ పార్కు అభివృద్ధికి మరో రూ.2 కోట్ల పనులకు సీఎం శంకుస్థాపనలు చేశారు. మహిళా సంఘాలకు రూ.11.33 కోట్ల బ్యాంకు లింకేజీ రుణాలు అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డిని... బాలు నాయక్ శాలువాతో సత్కరించారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జై వీర్‌రెడ్డి, డాక్టర్ వంశీక ృష్ణ, మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పాల్గొన్నారు.

గుమ్మడి... ఆదర్శ కమ్యూనిస్టు

(మొదటిపేజీ తరువాయి)

వెంకటరెడ్డి పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ గుమ్మడి నరసయ్య రాజకీయ జీవితం గురించి చెప్పారు. సీపీఐ(ఎంఎల్) పార్టీలో దశబ్దాలుగా కొనసాగుతూ ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని అసాధారణ ప్రజా జీవితాన్ని గడపటం అందరికీ సాధ్యం కాదన్నారు. ప్రజల్లో ఉండే నిజమైన విప్లవకారుడు గుమ్మడి అని కొనియాడారు. ప్రజల కోసం రాజీలేని పోరాటాలు చేసిన యోధుడని కూనంనేని శ్లాఘించారు. గుమ్మడి నరసయ్య ఆదర్శ ఎమ్మెల్యే అని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. ప్రజల మధ్య ఉంటూ నిజమైన రాజకీయాలు ఎలా చేయాలో ఆయనను చూసి నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో చిత్ర నిర్మాత నల్లా సురేష్ రెడ్డి, కథానాయకుడు కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, గుమ్మడి నరసయ్య హాజరయ్యారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పట్టణ ప్రజల కలిసి భారీ ర్యాలీగా పెద్దమ్మ తల్లి గుడికి వెళ్లి ప్రత్యేక పూజ చేశారు. నిర్మాత సురేష్ రెడ్డి మాట్లాడుతూ తమ బ్యానర్‌పై నిర్మించే తొలి చిత్రానికి ప్రేక్షకుల ఆదరణ లభిస్తుందని ఆకాంక్షించారు. గుమ్మడి నరసయ్య జీవితాన్ని కథగా మలిచి తెరకెక్కిస్తున్నట్లు తెలిపారు. సినిమా చిత్రీకరణలో భాగంగా తొలి సన్నివేశానికి కన్నడ నటుడు శివ రాజ్ కుమార్ సతీమణి గీత క్లాప్ కొట్టగా... మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. షూటింగ్ షెడ్యూలు త్వరలో ప్రకటిస్తామని నిర్మాత చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, గుమ్మడి నరసయ్య కుమార్తె, సీపీఐ జిల్లా అధ్యక్షులు సాబీర్ పాషా, ఎస్ఎస్ఆర్ ఆర్గనైజర్లు రామకృష్ణారెడ్డి, సందుబట్ల శ్రీనివాస్ రెడ్డి, డాక్టర్ యుగేందర్ రెడ్డి, పట్టణ ప్రముఖులు, ప్రజలు పాల్గొన్నారు.

'గ్లోబల్ సమ్మిట్' రాష్ట్ర ఆర్థిక పురోగతికి వేదిక కావాలి: మమతా బెనర్జీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : "తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్"కు తనను ఆహ్వానించినందుకు సీఎం రేవంత్ రెడ్డికి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఆహ్వానం అందుకోవడం ఎంతో గౌరవప్రదమైనదని పేర్కొన్నారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్న ఎనిమిది, తొమ్మిది తేదీల్లో తనకు ముందుగానే నిర్ణయించిన పర్యటనలు ఉండటం వల్ల... హాజరుకా లేకపోతున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడే విధంగా ఈ గ్లోబల్ సమ్మిట్ సార్థక చర్చలకు వేదికగా నిలిచి, రాష్ట్ర ఆర్థిక పురోగతికి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశంగా మారాలని ఆమె ఆకాంక్షించారు. గ్లోబల్ సమ్మిట్ కు ఆహ్వానించే బాధ్యతను సీతక్కకు అప్పగించారు. ఆహ్వాన పత్రికను ఇ-మెయిల్ ద్వారా పంపించారు. ఆహ్వాన పత్రిక అందుకున్న వెంటనే.. మమతా బెనర్జీ తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ లేఖ పంపారు.

ప్రపంచానికి భారత్ చోదక శక్తి: మోదీ

న్యూఢిల్లీ: భారత్ ఆర్థిక వృద్ధిలో దూసుకెళుతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో నమోదైన 8.2 శాతం వృద్ధి ప్రపంచానికి చోదక శక్తిగా నిలుస్తోందని ఆయన శనివారం హిందుస్థాన్ టైమ్స్ నిర్వహించిన లీడర్‌షిప్ సమిట్‌లో తెలిపారు. '21వ శతాబ్దంలో నాలుగోవంతు గడిచింది. ప్రపంచం ఆర్థికంగా, సాంకేతికంగా అవాంతరాలు ఎదుర్కొంటోంది. యుద్ధాలు సవాళ్లు విసురుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచమంతా మందగమనం గురించి మాట్లాడుతుంటే... మనం వృద్ధిలో కొత్త అధ్యాయాలు లిఖిస్తున్నాం' అని మోదీ అన్నారు. ప్రపంచం విచ్ఛిన్నమవుతుంటే భారత్ ఐక్యతకు వారధిగా పనిచేస్తోందన్నారు. 8.2 శాతం జీడీపీ మన బలమైన స్థూల ఆర్థిక వ్యవస్థకు సూచిక అని తెలిపారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ 3 శాతం, జీ7 ఆర్థిక వ్యవస్థలు 1.5 శాతం చొప్పున సగటు వృద్ధిని నమోదు చేస్తోందన్నారు. ఈ సమయంలో అధిక వృద్ధికి, తక్కువ ద్రవ్యోల్బణంతో భారత్ దూసుకెళుతోందన్నారు. ఒకప్పుడు అధిక ద్రవ్యోల్బణం గురించి ఆందోళన చెందిన వారే ఇప్పుడు తక్కువ ద్రవ్యోల్బణం ఉందని చెబుతున్నారని మోదీ అన్నారు.

'కాషాయ' భారతం కోసం కుట్ర

(మొదటిపేజీ తరువాయి)

బీజేపీ ఎంపీ చెప్పుకొచ్చారు. నాటి రాజ్యాంగ సభలో వీటిపై చర్చ వేళ ముసాయిదా కమిటీ చైర్మన్ బీఆర్ అంబేద్కర్ సమాధానం చెబుతూ సెక్యులర్ పదాన్ని చేర్చాల్సిన అవసరం లేదని, భారత్‌ను లౌకిక దేశంగా మలిచేలా రాజ్యాంగం రూపొందినట్లు చెప్పారని భీమ్ సింగ్ వెల్లడించారు. సోషలిస్ట్ పదం చేర్చే అంశంపైనా చర్చించారని, ఒకే రకమైన రాజ్యాంగ, ఆర్థిక విధానాన్ని భావితరాలపై రాజ్యాంగ కమిటీ రుద్దలేదని, భవిష్యత్‌లో కొత్త ఆర్థిక విధానాన్ని కొందరు కోరవచ్చని అంబేద్కర్ చెప్పినట్లు బీజేపీ ఎంపీ చెప్పుకొచ్చారు. సోషలిజం అనేది ప్రజల సంక్షేమానికి సంబంధించినదిగా బదులిచ్చారని గుర్తుచేశారు. ప్రజా సంక్షేమానికి హామీ ఎలా ఇవ్వాలి, పేదరికాన్ని ఎలా నిర్మూలించాలి, సంపదను ఎలా పంచాలి వంటివన్నీ రాజ్యాంగంలో పొందుపరిచారని తెలిపారు. మెప్పు రాజకీయాల కోసమే సెక్యులర్, సోషలిస్ట్ పదాలను రాజ్యాంగంలో చేర్చారని ఎంపీ అన్నారు. 'సెక్యులర్ పదాన్ని ముస్లింలను మెప్పించడం కోసం, సోషలిస్ట్ పదాన్ని సోవియట్ రష్యా మెప్పు కోసం చేర్చారు తప్ప వీటి అవసరం లేదు... అవి కేవలం గందరగోళం సృష్టిస్తాయి' అని సమర్థించుకున్నారు. గత దశాబ్దాల్లో ప్రైవేటు మెంబర్స్ బిల్లులు కొన్ని ఆమోదం పొందిన క్రమంలో తాజా బిల్లు ఉద్దేశం ఏమిటన్న ప్రశ్నకు 'బిల్లు ఆమోదించాల్సిన అవసరం లేదని అర్థం చేసుకోగలం. కానీ ఈ చర్య వల్ల ఇది ప్రభుత్వం, ప్రజల దృష్టికి వస్తుంది' అని భీమ్ సింగ్ వివరణ ఇచ్చారు. ప్రతిపక్షాలు బుజ్జగింపు రాజకీయం చేస్తున్నట్లు ఆరోపించారు. ఈ బిల్లును రాజ్యాంగంపై దాడిగా కొన్ని విపక్షాలు ఆరోపిస్తాయని, కానీ వాస్తవానికి ఇది రాజ్యాంగానికి వాస్తవ రూపం ఇచ్చే ప్రయత్నమేనని ఆయన సమర్థించుకున్నారు. 1976కి ముందు భారత్ లౌకిక దేశం కాదా? నెహ్రూ, శాస్త్రి, ఇందిర మత ప్రభుత్వాలు నడిపారా? ఈ పదాల అవసరం ఏమిటి? అంటూ బీజేపీ ఎంపీ ప్రశ్నించారు. ఈ పదాలను రాజ్యాంగం నుంచి తొలగించడంతో అందులోని ఇతర నిబంధనలపైగానీ, ప్రాథమిక హక్కులపైగానీ ఎటువంటి ప్రభావం ఉండదని బిల్లు పేర్కొంది.

నటి ప్రగతి ప్రతిభ

(మొదటిపేజీ తరువాయి)

వెల్లువెత్తాయి. ప్రగతి వెండితెరపై ఎన్నో వైవిధ్యమైన పాత్రలు పోషించారు. సహాయ పాత్రల్లో మెప్పించారు. ఏపీలోని నెల్లూరు జిల్లా ఉలవపాడులో జన్మించిన ఆమె డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ ప్రారంభించారు. తమిళ దర్శకుడు కె.భాగ్యరాజా 'వీట్ల విశేషంగా' చిత్రంలో హీరోయిన్ అయ్యారు. ఆ తర్వాత తమిళ, మలయాళ చిత్రాల్లో నటించారు. తెలుగు సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా రాణించారు. నటనతో పాటు జిమ్‌లో కసరత్తులు చేయడం మొదలు పెట్టిన ఆమె పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభ కనబరుస్తున్నారు. ఈ ఏడాది హైదరాబాద్ జిల్లా స్థాయి, తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్ గెల్చుకున్నారు. కేరళలో జరిగిన నేషనల్ లెవెల్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లోనూ స్వర్ణం సాధించారు. 2023లో మొదటిసారి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో పవర్ లిఫ్టింగ్‌లో వరుసగా స్వర్ణాలు గెల్చుకున్న ఆమె ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలోనూ పతకాలు సాధించారు.

వెంటిలేటర్‌పై 'ఇండియా' : ఒమర్ అబ్దుల్లా

కశ్మీర్: బీహార్ సీఎం నితీశ్ కుమార్‌ను ఎన్డీయే వైపు తామే నెట్టేసినట్లు అనిపిస్తోందని జమ్మూకశ్మీర్ సీఎం, ఎన్‌సీ నేత ఒమర్ అబ్దుల్లా అన్నారు. 'ఇండియా' ఐక్యసంఘటన పరిస్థితి వెంటిలేటర్‌పై ఉన్నట్లుందని వ్యాఖ్యానించారు. బీహార్ ఎన్నికల అనంతరం పరిస్థితి మరింత దిగజారిందన్నారు. ఓ వార్తాసంస్థ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో బీజేపీ పోరాడే తీరుపై ప్రశంసలు కురిపించారు. అయితే, తనకు ఆ పార్టీతో ప్రత్యక్ష సంబంధం లేదని, బీజేపీ రాజకీయాలను వ్యతిరేకిస్తూనే ఉంటానని స్పష్టం చేశారు. 'ఇండియా' కోసం గతంలో నితీశ్ కుమార్ చేసిన ప్రయత్నాలను ఒమర్ అబ్దుల్లా ప్రస్తావించారు. తామే ఆయనను మళ్లీ ఎన్డీయేలోకి వెళ్లేలా చేసినట్లు భావిస్తున్నామన్నారు. ప్రతిపక్ష కూటమి కథ ముగిసిందనే వాదనలపై స్పందిస్తూ... ప్రస్తుతం ఒకవిధంగా వెంటిలేటర్‌పై ఉందన్నారు. కోలుకుంటున్నామని భావించే సమయానికి బీహార్ వంటి ఫలితాలతో పరిస్థితి మళ్లీ దిగజారుతోందని చెప్పారు. బీహార్ విషయానికొస్తే జేఎంఎం పార్టీని ఇండియా ఐక్యసంఘటన, మహాగట్‌బంధన్‌లో చేర్చలేదనే విషయాన్ని గుర్తుచేశారు. తమను తాము ఒక కూటమిగా చెప్పుకొంటున్నామంటే... మరింత సమగ్రంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. బీహార్‌లో ఎన్డీయే ఘన విజయంపై స్పందిస్తూ... 'ఎన్నికలపైనే తమ జీవితాలు ఆధారపడి ఉన్నట్లు బీజేపీ పోరాడింది. మరోవైపు... ఇండియా ఐక్యసంఘటన పట్టింపు లేనట్లుగా వ్యవహరించింది' అని అన్నారు. ఎన్నికల ఫలితాల తారుమారు విషయంలో ఈవీఎంలపై అనుమానాలు లేనప్పటికీ... ఓటరు జాబితాలు మార్చడం, నియోజకవర్గాల పునర్విభజన వంటి చర్యలతో ఇది సాధ్యమేనన్నారు. కేంద్రంతో సత్సంబంధాలు ఉన్నంత మాత్రాన తాను బీజేపీతో పొత్తు పెట్టుకున్నట్లు అర్థం కాదన్నారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి

విశాలాంధ్ర బ్యూరో నిర్మల్ జిల్లా : గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొనబోయే పీవో, ఏపీఓలు తమ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శనివారం మామడ మండల కేంద్రంలోని రైతువేదికలో ఎన్నికల విధుల్లో పాల్గొనబోయే పిఓ, ఏపిఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. శిక్షణ సరళిని ఆమె పరిశీలించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణలో పిఓల పాత్ర కీలకమని తెలిపారు. మండలాలవారిగా పీఓలకు, ఏపిఓలకు ఎన్నికల విధులపై శిక్షణ ఇస్తున్నామని వివరించారు. పీఓలు బాధ్యతాయుతంగా తమ విధులు పూర్తిచేయాలన్నారు. పీఓలకు ఎన్నికల నిర్వహణపై పలు కీలక సూచనలు చేశారు. అధికారులకు సమయపాలన, క్రమశిక్షణ అత్యంత కీలకమని చెప్పారు. ఎన్నికల విధులు పారదర్శకంగా, జవాబుదారీతనంతో, ఖచ్చితత్వంతో నిర్వర్తించాలని వివరించారు. ఎన్నికల నియమావళిని అనుసరించి అధికారులకు అప్పజెప్పిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి, ఎన్నికలను ప్రశాంతంగా పూర్తి చేయాలని అన్నారు. ఎటువంటి సందేహాలు ఉన్నా పైఅధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఎన్నికల విధులపై పీఓలకు పలు ప్రశ్నలు అడిగారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు అధికారులు జవాబులు యిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, డిపిఓ శ్రీనివాస్, డీఈఓ భోజన్న, తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ సుశీల్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డ్‌ల వ్యవస్థ పోలీసుశాఖలో అంతర్ భాగమే : ఎస్పీ

విశాలాంధ్ర జిల్లా బ్యూరో మహ బూబబాద్ : హెూంగార్డ్ వ్యవస్థ పోలీసు శాఖలో అంతర్ భాగమేనని జిల్లా డా.ఎస్పీ శబరీష్ అన్నారు. 63వ హెూంగార్డ్స్ రైసింగ్ డేను పురస్కరించుకొని, జిల్లా పోలీసు కార్యాలయం నందు రైసింగ్ పరేడ్ నిర్వహించడం జరిగింది. హెూంగార్డ్స్ గౌరవ వందనం స్వీకరించి, పరేడ్ ఇన్స్పెక్ట్ చేసినారు. ఈ సందర్భంగా ఎస్పీ డా.శబరీష్ మాట్లాడుతూ ప్రజల రక్షణ, అంతర్గత భద్రతలో పోలీస్ శాఖకు తోడ్పాటు అందించాలనే లక్ష్యంతో 1946 డిసెంబర్ 6న స్వచ్ఛంద ఏర్పాటైనదే హెూంగార్డ్ వ్యవస్థ అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో, శాంతి-భద్రతల పరిరక్షణలో, ట్రాఫిక్ సమస్యల పరిష్కారంలో పోలీసు శాఖ చేస్తున్న కృషికి అదనపు బలం అందించేందుకు స్వచ్ఛంద సేవా భావంతో పనిచేసే, శిక్షణ పొందిన సిబ్బందే హెూంగార్డ్స్ అని తెలిపారు. హెూంగార్డ్స్ సిబ్బంది రోజువారీ వేతనాన్ని 921 నుండి 1000కి పెంచడం, పరేడ్ అలవెన్స్‌ను 100 నుండి 200కు పెంచడం జరిగిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సాధారణ, అసాధారణ మరణం పొందిన 23-మంది హెూంగార్డ్ కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయబడం జరుగుతుందన్నారు. పోలీస్ సేలరీ ప్యాకేజ్‌లో భాగంగా యాక్సిడెంటల్ డెత్‌కు రూ.30 లక్షలు, ఇద్దరు పిల్లల చదువుకోసం ఒక్కొక్కరికి రూ.2 లక్షలు ఆర్థిక ప్రయోజనం కల్పించడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన హెూంగార్డ్ సిబ్బందిని రివార్డ్స్, విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డిఎస్పీ గంగ్రతి మోహన్,టౌన్ డిఎస్పీ తిరుపతి రావు, ఏ.అర్ డిఎస్పీ శ్రీనివాస్, విజయ్ ప్రతాప్, అర్.ఐలు భాస్కర్, సోములు అనిల్, నాగేశ్వరరావు, అర్.ఎస్.ఐ శేఖర్ హెూమ్ గార్డ్ ఆఫీసర్స్ పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ వర్ధంతి

విశాలాంధ్ర- నేరెడుచర్ల : లయన్స్ క్లబ్ నేరెడుచర్ల ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వర్ధంతి దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు లయన్ కీత కనకయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా చైర్పర్సన్ చల్లా ప్రభాకర్ రెడ్డి, ఎడవెల్లి సత్యనారాయణ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గారు భారత రాజ్యాంగ రూపకర్తగా మాత్రమే కాకుండా, సామాజిక న్యాయం, సమానత్వం, విద్య హక్కుల కోసం అహర్నిశలు పోరాడిన మహెూన్నత నాయకుడని కొనియాడారు. అంబేద్కర్ చూపిన మార్గం ప్రతి భారతీయుడు అనుసరించాల్సిన దివ్యదీపమని పేర్కొంటూ, ఆయన ఆశయాల సాధనలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి షేక్ యూసుఫ్, పూర్వ అధ్యక్షులు కందిబండ శ్రీనివాసరావు, సీనియర్ సభ్యులు కర్రీ సూర్యనారాయణ రెడ్డి, గుండా సత్యనారాయణ, కొనతం ఆదిరెడ్డి, అడ్వకేట్ విశ్వనాథ్, చిలక రాజుశ్రీను, బసవ కోటేశ్వరరావు, మూలగుడ్ల వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల అక్రమ వేట కేసు నిందితుల అరెస్టు

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : ఇటీవల సత్తుపల్లి అర్బన్ పార్క్ పరిధిలో జరిగిన వన్యప్రాణుల అక్రమ వేట కేసుకు సంబంధించి ప్రధాన నిందితులను అరెస్టు చేసినట్లు ఖమ్మం జిల్లా డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్ చెప్పారు. ఈ కేసు పురోగతిపై ఆయన కీలక వివరాలను వెల్లడించారు. ఆపరేషన్ వివరాలు,అరెస్టులు సుదీర్ఘ గాలింపు చర్యలు, నిరంతర నిఘా, ప్రత్యేక బృందాల సమన్వయంతో ఈ కేసులో ప్రధాన నిందితులైన మెచ్చ రాఘు, కుంజా భారత్‌లను అటవీశాఖ-జిల్లా టాస్క్ ఫోర్స్ సంయుక్తంగా అరెస్ట్ , చేసిందన్నారు. శనివారం అటవీ శాఖ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అరెస్టు అనంతరం నిందితులను సత్తుపల్లి న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయస్థానం వారిని ఈనెల 16 వరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. నిందితులపై తెలంగాణ ఫారెస్ట్ యాక్ట్, 1967 వైల్డ్ లైఫ్ యాక్ట్ 1972 , ఆయుధాల చట్టం 1959లలోని సంబంధిత నిబంధనల కింద కఠిన కేసులు నమోదు చేయబడ్డాయని చెప్పారు. అడవి జంతువుల వేట, వన్యప్రాణుల హానీ, అక్రమ ఆయుధ వినియోగంపై శూన్య సహన విధానంతో కొన సాగుతున్నామని ఆయన వివరించారు. భవిష్యత్తు కార్యాచరణ ఇలాంటి అక్రమ వేట ఘటనలను నిరోధించడానికి జిల్లాలో పహారా వ్యవస్థను బలోపేతం చేయడం, రహస్య సమాచార సేకరణను విస్తరించడం, సున్నిత ప్రాంతాల్లో లక్ష్యిత ప్రత్యేక దాడులు నిర్వహించడం వంటి చర్యలను మరింత దృఢంగా అమలు చేయనున్నట్టు అటవీశాఖ ప్రకటించింది. ఈ సందర్భంగా మీడియాకు ఆయన ధన్యవాదాలు తెలిపారు వన్యప్రాణి సంరక్షణ, అటవీ రక్షణ, ప్రజలలో అవగాహన పెంపు కోసం, ఖమ్మం అటవీ విభాగం చేపడుతున్న చర్యలను సమాజానికి చేరివేయడంలో మీడియా భూమిక అత్యంత ముఖ్యమైనది అన్నారు . ఖచ్చితమైన సమాచారం, బాధ్యతాయుతమైన ప్రచారం ద్వారా మీడియా అందిస్తున్న సహకారం గొప్పది , అన్నారు.

పథకాల లక్ష్యసాధనకు బ్యాంకర్లు సహకరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం : జిల్లాలో అమలు చేస్తున్న వివిధ ఆర్థిక మద్దతు పథకాల లక్ష్యాలు పూర్తిచేయడంలో బ్యాంకర్లు మరింత సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సూచించారు. శనివారం ఐడిఓసీ లో డి.సి.సి, డి.ఎల్.ఆర్.సి సమీక్షా సమావేశంలో ఆయన బ్యాంకర్లు, జిల్లా శాఖాధికారులతో రుణాల పురోగతిని సమీక్షించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్--సెప్టెంబర్ మధ్య వివిధ రంగాల్లో రుణాల విడుదల వివరాలు వెల్లడించారు. వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ. 3899.28 కోట్ల లక్ష్యానికి గాను 2138.26 కోట్లు, ఎంఎస్ ఎంఈ రంగంలో రూ. 847.80 కోట్ల లక్ష్యానికి రూ. 439.84 కోట్లు, విద్యా రుణాల్లో 6.96 కోట్లు, హౌసింగ్ లోన్లలో 10.84 కోట్లు, ఇతర రంగాల్లో 35.09 కోట్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ వివరించారు. మొత్తం లక్ష్యాల్లో 53.33 శాతం సాధించినట్లు తెలిపారు. రైతుల

రుణ రేన్యూవల్‌పై అవగాహన కల్పించి, వ్యవసాయ శాఖతో కలిసి బ్యాంకర్లు ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలు, లబ్ధిదారులు సకాలంలో బ్యాంకులకు చెల్లించే విధంగా శాఖలు పర్యవేక్షించాలన్నారు. జిల్లాలో మునగ సాగు విజయవంతంగా కొనసాగుతుందనీ, ఇప్పుడు రైతుల ఆర్థిక అభివృద్ధికి సమీకృత వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా తీసుకెళ్లే సమయం వచ్చిందన్నారు. ప్రత్యేకంగా చేపల పెంపకం యూనిట్ల స్థాపనపై ఆయన వివరించారు. సరైన పద్ధతుల్లో చేపల పెంపకం చేపడితే రైతులకు గణనీయమైన లాభాలు పొందే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా కౌజు పిట్టల పెంపకంద్వారా నెలకు రూ.10 వేలు ఆదాయం వస్తుందన్నారు. జిల్లా అభివృద్ధి దిశగా ముందుకు సాగేందుకు బ్యాంకులు ప్రభుత్వ యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. యూనిట్ల స్థాపనకు అనుమతి పొందిన దరఖాస్తులన్నీ మూడు రోజుల్లోగా మంజూరు చేయాలని బ్యాంకర్లను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ విద్యా చందన, రిజర్వ్ బ్యాంక్ అధికారి గౌతమి, ఎల్ డి ఎం రామిరెడ్డి, మెప్మా పీడీ రాజేష్, పశుసంవర్ధక శాఖ అధికారి వెంకటేశ్వర్లు, అన్ని బ్యాంక్ ల అధికారులు పాల్గొన్నారు.

హోంగార్డు ఆఫీసర్స్ పనితీరు ప్రశంసనీయం : ఎస్పీ

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : పోలీసు శాఖలో హోంగార్డు ఆఫీసర్స్ పనితీరు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. 63వ హెూంగార్డు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్పీ ముందుగా శాంతి కపోతాన్ని ఎగురవేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం జిల్లా పోలీస్ శాఖలో భాగంగా పనిచేస్తున్న హోంగార్డు ఆఫీసర్స్ నుండి గౌరవ వందనాన్ని స్వీకరించారు. సుందరంగా అలంకరించిన వాహనంలో పరేడ్‌లో 6 హోంగార్డు ప్లాటూన్స్ ను ఎస్పీ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖలో ఒక భాగమై, సమానంగా నిరంతరం విధులు నిర్వర్తిస్తూ హోంగార్డు ఆఫీసర్స్ అందిస్తున్న సేవలు మరువలేనిమన్నారు. ప్రకృతి వైపరీత్యాలు సదర్భంలో అంకితభావంతో సేవలందిస్తున్నారని కొనియాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో బాధ్యతాయుతమైన సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. నిత్యం క్రమశిక్షణతో మెలుగుతూ పోలీసుశాఖ ప్రతిష్టను మరింత పెంచేలా విధులు నిర్వర్తించాలని సూచించారు. హోంగార్డ్స్ ఆఫీసర్స్ సంక్షేమానికి అన్ని వేళలా ముందుంటామని భరోసా ఇచ్చారు.

రైజింగ్ డే సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ

కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ సత్యనారాయణ, కొత్తగూడెం డిఎస్పీ అబ్దుల్ రహమాన్, ఆర్ఐ నరసింహారావు, కొత్తగూడెం డిఎస్పీ రెహమాన్, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, టూటౌన్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్లు ప్రతాప్, కరుణాకర్, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, అసోసియేషన్ ప్రెసిడెంట్ సత్యనారాయణ,సిబ్బంది పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి అంబేద్కర్

విశాలాంధ్ర కారేపల్లి : బడుగు బలహీన వర్గాలకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశాజ్యోతిలా రాజ్యాంగాన్ని రాశారని దీంతో ప్రతి ఒక్కరూ సమాజంలో స్వేచ్ఛగా జీవించగలుగుతున్నారని పలువురు వక్తలు అన్నారు. శనివారం మండల కేంద్రమైన కారేపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ బడుగు బలహీన సబ్బండ వర్గాలకు రాజ్యాంగం ద్వారా ఫలాలను అందించిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు ఆదర్ల రాములు,సోమందల నాగరాజు,ఆదెర్ల రామారావు, జిలకర వెంకటాద్రి,కొమ్ము ఉపేందర్,తొగర శ్రీను, నందనూరి సురేష్,తడికమల్ల నరేష్,శంకర్ రావు,భోగిళ్ళ వెంకటేశ్వర్లు,ఆదేర్ల అంజయ్య చెవుల శ్రీనివాసరావు,పొక్కిలి యుగంధర్,సోమందుల రాములు,ఆదెర్ల వీరస్వామి, చెవుల చందు,నాగయ్య తలారి అనిల్,ఆదర్ల నాగరాజు మహిళా నాయకురాలు పప్పుల నిర్మల తొగర లింగమ్మ బొందల సుష్మ పాల్గొన్నారు.

సాయి ఆత్మహత్య బాధాకరం :నూతి

విశాలాంధ్ర ఖమ్మం : సంగారెడ్డి జిల్లాకు చెందిన బీసీ బిడ్డ సాయి ఈశ్వర్ ఆత్మహత్య బాధాకరం అని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ విచారం వ్యక్తం చేశారు. సాయి ఈశ్వర్ ది ఆత్మహత్య కాదని బిఆర్ఎస్ బిజెపిల ప్రేరణతో జరిగిన హత్య అని ఆయన ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ కోసం నూరు శాతం చిత్తశుద్ధితో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని దయచేసి ఆయా పార్టీల ప్రేరేపిత మోసాలకు మోసపోవద్దని సత్యనారాయణ సూచించారు. బీసీలకు 42% రిజర్వేషన్ ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నం చేసిందని కానీ బిజెపి బీర్ఎస్ కలిపి వాటిని భగ్నం చేశాయని విమర్శించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ రాష్ట్రపతి బిల్లును ఆమోదించకుండా అడ్డుపడిందని రాష్ట్రంలో ఉన్న బీర్ఎస్ కోర్టులో కేసులు వేసి రిజర్వేషన్లు అమలు కాకుండా అడ్డుపడిందని అన్నారు. 42 శాతం రిజర్వేషన్ లు అందుబాటులో కి వస్తె విద్య, ఉద్యోగం రాజకీయ రంగాల్లో తమ వాటా తమకు దక్కుతుందని ఎంతో ఆశగా ఉన్న బీసీ లకు బీజేపీ బీఆర్ఎస్ కుట్రపన్ని రిజర్వేషన్ అమలు కాకుండా చేయడం జరిగిందని తెలియజేశారు.

నూతన పీట్ కమిటీ కార్యదర్శిగా నరేష్

విశాలాంధ్ర - కొత్తగూడెం : కార్పొరేట్ ఏరియా సెంట్రల్ వర్క్‌షాప్‌లో నూతన పిట్ కమిటీనీ నియమించారు. ఈ మేరకు శనివారం నూతన కమిటీని జిఎం దామోదర్‌కు గుర్తింపు సంఘం ఎఐటియుసి సెంట్రల్ కార్యదర్శి వంగ వెంకట్, బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తిలు పరిచయం చేసారు. పిట్ కార్యదర్శిగా ఎ.నరేష్, అసిస్టెంట్ పిట్ కార్యదర్శులుగా నరసింహ, పల్నాటి ప్రశాంత్, రవి, అడ్వైసర్లుగా కే.రాజేశ్వరరావు, బి.రవీందర్, కొండలింగం, నీ ఎన్నుకున్నట్టు వంగ వెంకట్, రమణమూర్తి ఈ సందర్భంగా తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారంకోసం పిట్ కమిటీలు ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. ఉత్పత్తి ఉత్పాదక సజావుగా జరగడానికి కార్మిక సంఘనాయకులు ముఖ్యపాత్ర పోషిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎఐటియుసి పిట్ కార్యదర్శి ఎ.నరేష్ తోపాటూ నూతన కమిటీ నాయకులకు వర్క్ షాప్ కార్మికులు శుభాకాంక్షలు తెలిపారు. నరేష్ మాట్లాడుతూ సెంట్రల్ వర్క్ షాప్ లో గుర్తింపు సంఘం పిట్ కమిటీ ఆధ్వర్యంలో కార్మిక సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. తనపై నమ్మకంతో ఎన్నుకున్నందుకు ఎఐటియుసి నాయకులు, బ్రాంచ్ నాయకులకు పేరు పేరున కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు.

ఆదివాసి సంస్కృతి సంప్రదాయాలు గొప్పవి :ఏఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో,కొమరం భీం : ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు గొప్పవని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. మండలంలోని అర్జున్ లొద్ది గ్రామంలో కొలం గిరిజనులు ప్రతి యేటా నిర్వహించే భీమన్న, పాండవుల జాతరకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా గిరిజనులు సాంప్రదాయ బద్ధంగా వారిని ఆహ్వానించారు. ఈ సందరేగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలు దేశానికి శిరోమణిలాంటి వనరులని పేర్కొన్నారు. గిరిజనులు ప్రకృతితో అనుబంధాన్ని కాపాడుకుంటూ తరతరాలుగా కొనసాగిస్తున్న ఆచారాలు ఎంతో విలువైనవని చెప్పారు. ఆధునిక జీవనశైలిలోనూ తమ మూలాలను మరువకుండా సంస్కృతిని కాపాడుకోవాలని యువతను కోరారు. గిరిజన గ్రామాల అభివృద్ధి, భద్రత కోసం పోలీసులు ఎప్పుడూ తోడుంటారన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, చదువులో ముందుండాలని, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానస్పదంగా ఎవరైనా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన పేర్కొన్నారు.

సీపీఐ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి

విశాలాంధ్ర-బోనకల్ : ముష్టికుంట్ల గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో సిపిఐ బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యులను గెలిపించాలని సిపిఐ శ్రేణులు ఇంటింటి ప్రచారం శనివారం నిర్వహించారు. కాంగ్రెస్, టిడిపి, బిజెపి, వైఎస్సార్ సిపి, జనసేన పార్టీలు బలపరిచిన సిపిఐ 5వ వార్డు అభ్యర్థి షేక్ మీరాసాహెబ్ ఓటర్లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందరేగా సిపిఐ అభ్యర్థి మీరాసాహెబ్ మాట్లాడుతూ ఐదవ వార్డులో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, ప్రతి సమస్యను పరిష్కరించేందుకు తాను కృషి చేస్తానని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా వార్డులో మౌలిక వసతుల కల్పన చేస్తానని వారు ఓటర్లకు హామీ ఇచ్చారు. ప్రతి కుటుంబంలోని సభ్యుడుగా ఉంటూ అన్ని వేళలా వార్డు అభివృద్ధి కి పనిచేస్తానని తెలిపాడు. వార్డు ప్రజలు తనను ఆశీర్వదించాలని, సిపిఐ అభ్యర్థిగా తాను ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుటానని, కావునా వార్డు ప్రజలు గ్యాస్పోయి గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు

ఆకెన పవన్, శాఖ కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశ్వర్లు, ఏఐకెఎస్ మండల అధ్యక్షులు కొంగర భాస్కరరావు, సీనియర్ నాయకులు బోయినపల్లి బసవయ్య, కాంగ్రెస్ నాయకులు చిట్టెంశెట్టి మురళి, షేక్ జానీ, కొమ్మినేని రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వరాచారి కుటుంబానికి రూ. కోటి ఎక్స్ గ్రేషియా చెల్లించాలి

విశాలాంధ్ర బ్యూరో -పెద్దపల్లి: బీసీ రిజర్వేషన్ల కోసం హైదరాబాద్‌లో ఆత్మాతి చేసుకున్న ఈశ్వరాచారి కుటుంబానికి ప్రభుత్వం రూ. 1కోటి ఎక్స్ గ్రేషియా చెల్లించాలని బీసీ జేఏసీ పెద్దపల్లి జిల్లా చైర్‌పర్సన్ దాసరి ఉషా డిమాండ్ చేశారు. శనివారం పెద్దపల్లి జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ కోయ శ్రీహర్షను కలిసి బీసీల పట్ల

జరుగుతున్న సామాజిక దాడులను వెంటనే నిలిపివేయాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఇటీవల నల్గొండ జిల్లా కేంద్రంలో జనరల్ స్థానంలో పోటీకి నామినేషన్ వేసిన బీసీ అభ్యర్థి భర్త పట్ల జరిగిన అనాగరిక సంఘటన సభ్య సమాజానికి సిగ్గుచేటు అన్నారు. అంతే కాకుండా బీసీ రిజర్వేషన్లను కోరుతూ ఈశ్వరాచారి ఆత్మబలిదానం తీవ్రంగా కలచి వేసిందన్నారు. ఇది ముమ్మాటికి ఆత్మహత్య కాదు.. ప్రభుత్వం చేసిన హత్యేనని ఆమె ఆరోపించారు. ప్రభుత్వం ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ ఈశ్వరాచారి కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్ గ్రేషియాతో పాటుగా వారి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలన్నారు. వారి పిల్లలకు పీజీ వరకూ ప్రభుత్వ ఖర్చులతో విద్యాభ్యాసం చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ రిజర్వేషన్ల పేరిట కల్లబొల్లి కబుర్లు చెబుతూ కాలం వెళ్లదీస్తున్నారని మండిపడ్డారు. బీసీ బిడ్డలు ప్రాణాలను తీసుకొని బొందలో పడటం కాదని, ఆ పార్టీలనే బొంద పెట్టాలని పిలుపునిచ్చారు. బీసీలను సంఘటితం చేస్తూ ఒక్కతాటిపైకి తీసుకువచ్చి బీసీ రిజర్వేషన్లు సాధిస్తామని పేర్కొన్నారు. బీసీ బిడ్డలు ఇంటికొకరు ఉద్యమబాట పట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ వైస్ చైర్మన్ కొండి సతీష్, జిల్లా కన్వీనర్లు సలేంద్ర కొమురయ్య, సిరవేని స్వప్న, మిట్టపల్లి శ్రీనివాస్, కలవేని రవి, విశ్వకర్మ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్ళ నమ్మి మోసపోవద్దు : ఏసీపీ

విశాలాంధ్ర సత్తుపల్లి : డిజిటల్‌గా అరెస్ట్ చేస్తామనే సైబర్ నేరగాళ్ళ మాటలు నమ్మి మోసపోవద్దని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ అన్నారు. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో ప్రారం భమైన 'ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్' పేరుతో నిర్వహిస్తున్న సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంలో భాగంగా వైరా ఆర్టీసీ బస్టాండ్ లో ప్రయాణికులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ..మీ వ్యక్తిగత సమాచారాన్ని, ముఖ్యంగా పాస్‌వర్డ్‌లు, బ్యాంక్ వివరాలలను ఎవరితోనూ పంచుకోవద్దని అన్నారు.అపరిచిత లింక్‌లపై క్లిక్ చేయవద్దని, ఫోన్ ద్వారా వచ్చిన అటాచ్‌మెంట్‌లను తెరవవద్దని సూచించారు. డబ్బును బదిలీ చేయమని, నగదు తీసుకుని ఇవ్వమని కోరే ఎటువంటి అభ్యర్థనలను విశ్వసించవద్దని పేర్కొన్నారు. మీరు ఏదైనా మోసానికి గురైనట్లు భావిస్తే, వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నికల భద్రత కట్టుదిట్టం : ఎస్పీ

విశాలాంధ్ర బ్యూరో,కొమరం భీం : కాగజ్ నగర్ రానున్న పంచాయతీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా పూర్తయ్యేలా భద్రతా ఏర్పాట్లను బలోపేతం చేశామని జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. ఎన్నికల వాతావరణాన్ని నిశితంగా పర్యవేక్షించేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఎస్పీ ఆధ్వర్యంలో కాగజ్ నగర్ పట్టణంలోని రాజీవ్ చౌరస్తా నుంచి ప్రధాన మార్కెట్ వరకు భారీగా పోలీసు సిబ్బందితో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్‌మార్చ్‌లో డీఎస్పీ వహీదుద్దీన్, టౌన్ ఎస్‌హెచ్ఓ ప్రేమ్‌కుమార్, రూరల్ సీఐ కుమారస్వామి, ఎస్సై సుధాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగం వల్లే సమాజంలో మౌలిక మార్పులు: సీపీఐ

విశాలాంధ్ర- వనపర్తి : రాజ్యాంగంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఇచ్చిన హక్కులు అవకాశాల వల్లే దేశంలోని పేద ప్రజల జీవితాల్లో మౌలిక మార్పులు వస్తున్నాయని సీపీఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ అన్నారు. వనపర్తి పట్టణం అంబేద్కర్ చౌక్ లో అంబేద్కర్ 69వ వర్ధంతిని సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసమానతలు,అస్పృశ్యత కుల మతాల తారతమ్యం లేని సమాజం అంబేద్కర్ ఆశయం. ఆ ఆశయ సాధనకై ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. రాజ్యాంగం అన్ని వర్గాలకు సమానం గా అవకాశాలు,హక్కులు కల్పించారన్నారు.సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కళావతమ్మ, శ్రీరామ్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్న కురుమన్న, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, సురేష్, భారత జాతీయ మహిళా సమాఖ్య వనపర్తి పట్టణ కన్వీనర్ జయమ్మ, కో కన్వీనర్ శిరీష,శ్రీదేవి,జ్యోతి,సుప్రియ, కాంతమ్మ, పానగల్ మండల కార్యదర్శి డంగు కురుమయ్య,మాజీ సహాయ కార్యదర్శి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ వర్ధంతి

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలోని ఆర్ కె పి సి హెచ్‌పిలో సింగరేణి కాలరీస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రిజి. నెం 1630/1982 మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ కళ్లేపల్లి హరి రామ కృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మందమర్రి ఏరియా ఎస్సీ లైసన్ ఆఫీసర్ చంద్రమౌళి, అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ దామెర ప్రవీణ్ కుమార్ హాజరై, అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ దామెర ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ బాబాసాహెబ్ సేవలను కొనియాడారు. అంబేద్కర్ తన జీవితాంతం అంటరానితనం, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడారని, దళితులు, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి విశేష కృషి చేశారని గుర్తుచేశారు. దేశానికి అత్యంత బలమైన రాజ్యాంగాన్ని అందించి, ప్రతి పౌరుడికి ప్రాథమిక హక్కులను కల్పించారని, చట్టం ముందు అందరూ సమానమేనని చాటిచెప్పారని తెలిపారు. చదువు, పోరాడు, సమీకరించు అనే నినాదంతో ప్రజల్లో చైతన్యం నింపారని, విద్య ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని అంబేద్కర్ బలంగా నమ్మారని అన్నారు. కేవలం విగ్రహాలకు పూలమాలలు వేయడమే కాకుండా, ఆయన చూపిన బాటలో నడుస్తూ, కులమతాలకు అతీతంగా మానవత్వంతో జీవించడమే ఆయనకు మనం అర్పించే నిజమైన నివాళి అని ఆధునిక భారతదేశ నిర్మాణంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ యొక్క కార్యక్రమంలో సి హెచ్ పి అసోసియేషన్ సభ్యులు శనిగారపు రాములు, బి చంద్రు, తుంగ కిరణ్, సిరాజుద్దీన్, కె శ్రీనివాస్, బి రవళి, అనసూయ, మానస, తదితరులు పాల్గొన్నారు. హో

హోంగార్డ్‌ల పనితీరు ప్రశంసనీయం :సీపీ

విశాలాంధ్ర ప్రతినిధి- పెద్దపల్లి,సింగరేణి: విధినిర్వహణలో హోంగార్డ్‌ల పనితీరు ప్రశంసనీయమని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ లో శనివారం 63వ హెూంగార్డు రైసింగ్ డే వేడుకలు నిర్వహించారు.ఈ పరేడ్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించి తరువాత సిబ్బంది ప్రదర్శనని పరిశీలించారు. ఈ సందరేగా ఆయన మాట్లాడుతూ హెూంగార్డుల పనితీరు ప్రశంసనీయమని శాంతిభద్రతలు, ట్రాఫిక్, క్రైమ్ నివారణ, కమ్యూని టీ పోలీసింగ్, విపత్తు నిర్వహణ వంటి విభాగాల్లో అత్యుత్తమ పనితీరును కనబరుస్తు అత్యవసర పరిస్థితుల్లో వారు చూపే అంకితభావం ప్రశంసనీయమన్నారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హోంగార్డులకు ప్రశంస పత్రాలను అందజేశారు. అనంతరం కమిషనరేట్ పరేడ్ గ్రౌండ్ లో పోలీస్ అధికారులతో కలిసి ఆయన సీపీ పోలీస్ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్ , స్పెషల్ బ్రాంచ్ ఏసిపి నాగేంద్ర గౌడ్, ఏ ఆర్ ఏ సి పి ప్రతాప్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ భీమేష్, ఆర్ ఐ లు దామోదర్ శ్రీనివాస్, శేఖర్, మల్లేశం, సంపత్, ఆర్ఎస్ఐలు హెూంగార్డ్ సిబ్బంది ఏఆర్ సిబ్బంది స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు

విశాలాంధ్ర-సూర్యాపేట బ్యూరో : మూడో విడత గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్‌ను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రకాల ముందస్తు ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజాస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు.శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయంలోని వీడియో కానారేన్స్ హాల్‌లో జిల్లాలోని ఆర్డీవోలు, తాసిల్దార్లు, ఎంపీడీవోలు, ఎలక్షన్ ప్రత్యేక అధికారులు తదితరులతో కలెక్టర్ వెబ్‌ఎక్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియ పూర్తయ్యాక పోలింగ్ రోజున ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో త్రాగునీరు, విద్యుత్, ఫర్నిచర్, ఇతర మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అలాగే ఫెసిలిటేషన్ సెంటర్లు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, పోలింగ్ సామగ్రి పంపిణీ, వాహనాల ఏర్పాటు వంటి అంశాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. పోస్టల్ బ్యాలెట్ల విషయంలో స్టేజ్-1 ఆర్వోలు ఫారం-37ఏ రిజిస్టర్‌లో సర్వీస్ ఓటర్ల వివరాలు నమోదు చేయాలని, స్టేజ్-2 ఆర్వోలు ఫారం-37సీ రిజిస్టర్‌లో ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగుల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కె. సీతారామారావు, డీపీవో యాదగిరి, డీఆర్‌డీఏ పీడీ వీవీ అప్పారావు, డివిజనల్ పీవో నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ పటిష్టంగా అమలు...

విశాలాంధ్ర బ్యూరో ఖమ్మం : ఖమ్మం జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలు మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యేంతవరకు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికల ప్రవర్తన నియమావళి (ఎంసిసి) అమలులో ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి దశ పోలింగ్ తో పాటు, రెండవ దశ పోలింగ్ పూర్తయిన తరువాత కూడా సంబంధిత గ్రామాలు, మండలాల్లో ఎన్నికల కోడ్ అమల్లోనే ఉంటుందని, మూడవ దశ ఎన్నికల ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి తొలగిపోతుందని తెలిపారు. మొదటి, రెండవ దశలో ఎన్నికైన అభ్యర్థులు, ఇతరులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించరాదని కలెక్టర్ తెలిపారు. ఏకగ్రీవమైన గ్రామపంచాయతీలలో సైతం ఎన్నికల కోడ్ అమలులోనే ఉంటుందని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం నిబంధనలు అతిక్రమించిన వారిపై ఎన్నికలకు దూరమయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆ ప్రకటనలో హెచ్చరించారు.

సంపాదకీయం

ఆకాశంలో అల్ల కల్లోలం

ఇండిగో సంక్షోభంలో విమానయాన సంస్థల లాభార్జన శవాలపై చల్లిన మర్మరాలు ఏరుకున్నట్టు ఉంది. ఇండిగో విమానాలు అయిదు రోజులుగా వందల సంఖ్యలో రద్దయినాయి. లక్షలాది మంది ప్రయాణికులు కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఉన్న విమానాశ్రయాల్లో దిగబడి పోయారు. విమానాశ్రయాలు రద్దీగా ఉండే రైల్వే స్టేషన్లకన్నా హీనంగా కనిపించాయి. ఎక్కడ చూసినా సూట్ కేసులే. జనసమ్మర్దమే. విమానాలు అందని ప్రయాణీకులు ఇండిగో సిబ్బందిపై విరుచుకుపడ్డారు. హవాయ్ చెప్పులు వేసుకు తిరిగేవారిని విమానం ఎక్కిస్తామని మోదీ ఎన్నో గొప్పలు చెప్పుకున్నారు. కానీ విమానాశ్రయంలో జనం చెప్పులు విసరడం మాత్రం సర్వత్రా కనిపించింది. కొందరు పెళ్లిళ్లకు హాజరుకాలేక పోయారు. మరి కొందరికి పెళ్లి చేసుకోవడానికి పెట్టుకున్న ముహూర్తాలు ఎత్తి పోయాయి. ఇంకొందరికి ఇంటర్వ్యూలకు వెళ్లడం కుదరలేదు. అంత్యక్రియలకు హాజరుకాలేని వారూ ఉన్నారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలో శుక్రవారం ఎంపీలు, మంత్రులు తమ సొంతూళ్లకు వెళ్లి సోమవారం దిల్లీ చేరుకుంటూ ఉంటారు. వీరందరూ ఎక్కడికక్కడ దిగబడి పోయారు. ఇంత అస్తవ్యస్తతకు కారణమైన ఇండిగో విమానాయాన సంస్థపై కేంద్ర ప్రభుత్వం చర్య తీసుకుంటుందట. ఆ సంస్థ ప్రధాన కార్యనిర్వహణాధికారిని ఉద్యోగం లోంచి తొలగించేట్టు చేస్తుందట. కానీ ఇండిగో సంస్థ యాజమాన్యాన్ని దుయ్యబట్టే వారు మాత్రం కనిపించడం లేదు. పౌర విమానయాన శాఖ మంత్రి రాంమోహన్ నాయుడు ఈ గొడవ జరుగుతున్న సమయంలో నోరు విప్పకపోవడమే కాదు, అతా పతా లేరు. మన దేశంలో అతి పెద్ద విమానయాన సంస్థ ఇండిగోనే. ఒకే ఒక్క సంస్థ పౌర విమానయాన సంస్థకు ప్రభుత్వం గుత్తపెత్తనం అప్పగించడం వెనక ఏమేం జరిగిందో! ఇండిగో విమానాలు వందల సంఖ్యలో రద్దయినందు వల్ల ఇతర విమానయాన సంస్థలు టికెట్ల ధరలను అయిదేసి పదేసి రెట్లు పెంచేశాయి. ఆ సంస్థలకు ప్రయాణీకుల ఇబ్బందులతో పని లేదు. తమ ఖజానా నిండితే చాలు. నాలుగు రోజుల తరవాత గానీ విమాన చార్జీల ధరలు అనూహ్యంగా పెరగడాన్ని నిరోధించాలన్న ఆలోచన ప్రభుత్వానికి రానేలేదు. అసలు లోపం ఎక్కడుందో దుర్భిణి వేసి కనిపెట్టడానికి మోదీ ప్రభుత్వం దర్యాప్తు కమిటీ ఏర్పాటు చేసింది. మరో మూడు నాలుగు రోజులకు కానీ పరిస్థితి మామూలు స్థితికి రాదంటున్నారు. ఈ సంక్షోభం కారణంగా ఇండిగో సంస్థకు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆ సంస్థ షేర్ల ధరలు కుప్పకూలాయి. అయినా విమానాలు రద్దైనందువల్ల ప్రయాణీకులకు జరిగిన వర్ణనాతీతమైన నష్టంతో పోలిస్తే ఇదెంత! ముందు సాంకేతిక కారణాలవల్ల ఇండిగో విమానాలకు ఆటంకం ఏర్పడిందన్నారు. ఆ తరవాత పైలెట్ల కొరత అన్నారు. ప్రయాణీకుల ప్రాణాలకు బాధ్యత వహించవలసిన పైలెట్లకు, ఇతర సిబ్బందికి తగినంత విశ్రాంతి ఉండాలి. కానీ కక్కుర్తి కొద్దీ తక్కువ మంది పైలెట్లతో ఎక్కువ గంటలు పని చేయించడంవల్ల మొదటికే మోసం వచ్చింది. విమానాలు రద్దు అయినందువల్ల ప్రయాణీకుల టికెట్టు డబ్బులు వెనక్కి ఇచ్చేస్తామని ఇండిగో యాజమాన్యం ప్రకటించింది. అప్పటికి అదే మహోపకారం చేసినట్టు. ఆదివారం సాయంత్రానికల్లా ఈ డబ్బు చెల్లించేయాలని ప్రభుత్వం గుడ్లురుముతోంది. ఈ గందరగోళంలో పౌర విమానయాన డైరెక్టర్ జనరల్‌వ్యవస్థ కూడా తన అసమర్థతను సంపూర్ణంగా ప్రదర్శించింది. ఆ సంస్థ నియంత్రణా బాధ్యతను ఎప్పుడో వదిలేసింది. దాసుని తప్పు దండంతోసరి అన్నట్టు ఇండిగో ప్రధాన కార్యనిర్వహణాధికారి పీటర్ ఎల్బర్స్ క్షమాపణచెప్పి తన పని అయి పోయిందని పించారు. ఇదేదో క్షమాపణతో సరిపోయే అంశం అయినట్టు. క్షమాపణతో ప్రయాణీకులకు అదనంగా కలిగించే ప్రయోజనం ఏముంటుంది గనక.

విమానయాన వ్యాపారం దాదాపు లక్షన్నర కోట్ల వ్యవహారం. మరో మూడేళ్లలో ఈ వ్యాపారం మూడు లక్షల కోట్లకు చేరుతుందంటున్నారు. కానీ ఈ రంగాన్ని వీలైనంత తక్కువ ఖర్చుతో నిర్వహించి లాభాలు నొల్లుకునే దిశలో నడిపిస్తున్నారు. ఈ పాపంలో ప్రభుత్వ పాత్ర చిన్నదేమీ కాదు. సకలమూ ప్రైవేటు అన్న మంత్రజపం జనం ప్రాణాల మీద కొస్తోంది. ఒక విమానయాన సంస్థను ప్రోత్సహించడానికి ఇతర విమానయాన సంస్థలను దెబ్బతీసే విధానం ఎప్పటి నుంచో కొనసాగుతోంది. ఇండిగో విమానాయన సంస్థను మోదీ మిత్రుడు అదానీ స్వాధీనం చేసుకోనున్నారు అన్న గుసగుసలూ వినిపిస్తున్నాయి. గతానుభవాలుచూస్తే ఇవి నిజమే కాబోలు అనుకోవాల్సిందే. ప్రైవేటీకరణ మోజులో ప్రభుత్వం సకలరంగాల నుంచి తప్పించు కుంటోంది. ప్రైవేటీకరణను ఆపే అవకాశం ఇప్పుడు లేకపోవచ్చు. కానీ కేవలం ప్రైవేటీకరణను దాటి ఒకటి రెండు సంస్థలకు గుత్త వ్యాపారానికి కావాల్సిన ఏర్పాట్లను ప్రభుత్వమే ప్రోత్సహిస్తోంది. వ్యాపారంలో పోటీ అత్యవసరం. కానీ గుత్త వ్యాపారం ఆవరిస్తే పోటీకి అవకాశమే ఉండదు. ఇప్పటికే ఎయిర్‌ఇండియాను ప్రభుత్వం టాటాలకు తెగనమ్మేసింది. అప్పటి నుంచే ఎయిర్‌ఇండియా విమానాలకు కూడా తరచుగా ఏవో ఆటంకాలు ఏర్పడుతున్నాయి. దీనికి మాత్రం ప్రభుత్వం బాధ్యత వహించదు. రక్షణ ఉత్పత్తులు ప్రైవేటుకు అప్పగించడం ఇప్పటికే మొదలైంది. అణుశక్తి రంగాన్ని సైతం ప్రైవేటీకరిస్తామని ప్రధానమంత్రి మోదీ స్వయంగా ప్రకటించారు. ప్రైవేటు రంగానికి లాభార్జన మీదే దృష్టి ఉంటుంది. దేశ రక్షణతో నిమిత్తంఉండదు. మరి దేశరక్షణ గురించి అనునిత్యం అంగలార్చే మోదీ ప్రభుత్వం ఆ నియమానికి తిలోదకాలివ్వడానికి సిద్ధ పడినట్టే కదా! ప్రభుత్వానికి కావాల్సింది పరిపాలన కాదు. తమను నిలబెడుతున్న బడా పెట్టుబడిదార్లకు లాభాలార్జించే మార్గాలు సులభతరం చేయడమే పని. జూన్‌లో అహమదాబాద్ నుంచి లండన్ వెళ్లాల్సిన విమానం ప్రమాదానికి గురై 171మంది ప్రయాణీకులు మరణించినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్టైనా లేదు. ఆ తరవాత కొన్ని నియమాలను ప్రభుత్వం నిర్దేశించిన మాట నిజమే. కానీ నియమాలు రూపొందించగానే సరిపోదు. వాటిని అమలుచేసే బాధ్యత కూడా ప్రభుత్వానిదే. దీన్ని మోదీ ప్రభుత్వం వాటంగా విస్మరిస్తోంది అని ఇండిగో సంక్షోభం రుజువు చేసింది. విమాన యానంలో ఇండిగో సంస్థకు దాదాపు 70శాతం వాటాఉంది. అంటే ప్రభుత్వం అన్నిగుడ్లనూ ఒక బుట్టలో పెట్టేసింది. ఇండిగో విమానయానసంస్థ ఆదాయం ఏటా 84,000కోట్లు ఉంది. అంతర్జాతీయ విమానాలను కూడా నడుపుతుంది. 37,000 మంది ఉద్యోగులున్నారు. నిర్వహణా ఖర్చులు మొదలైనవి పోను ఇండిగో ఏటా7,258కోట్ల లాభంసంపాదిస్తోంది. మరిన్ని లాభాలు సంపాదించడానికి తక్కువ మందితో ఎక్కువ పని చేయించి ప్రజల ప్రాణాలతో చెలగాట మాడుతోంది. మోదీప్రభుత్వం ఎన్నికలు జరగవలసి ఉన్న రాష్ట్రాలలో విమానాశ్రయాలు ఏర్పాటు చేస్తామన్న హామీ పడేస్తుంది. అలాంటి చోట్ల నుంచి నడిచే విమానాలు ఒకటో రెండో మాత్రమే. అవి ఇండిగోనడిపేవి అయితే ఈ నాల్గురోజులుగా ఆ విమానా శ్రయాల పరిస్థితి ఏమైఉంటుందో! మొత్తం మీద ఆకాశంలో అంతా అల్లకల్లోలమే.

భ్రమల్లో అమిత్‌షా

ముప్పాళ్ళ భార్గవశ్రీ

ఇటీవల మావోయిస్టు పార్టీ నాయకులు పదుల సంఖ్యలో వరుసగా లొంగిపోవడం, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా 2026 మార్చి కల్లా దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తామని పదే పదే చేస్తున్న ప్రకటనలు చూస్తుంటే నిజమేననే భ్రమ కలుగుతోంది. కానీ వాస్తవాలు పరిశీలిస్తే ఈ భ్రమ తొలగిపోతుంది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాళ్ల కేశవరావు తదితరుల బూటకపు ఎన్‌కౌంటర్ల తర్వాత, మావోయిస్టు పార్టీ ముఖ్యనేతలు సోను, సతీష్ పదుల సంఖ్యలో తమ అనుచరులతో ప్రభుత్వ అధికారుల ముందు లొంగిపోయిన తర్వాత అమిత్‌షా మరింత ఉత్సాహంతో ప్రకటనలు చేస్తున్నారు. ఈమధ్య ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమల్లి, రంపచోడవరం అటవీ ప్రాంతంలో మావోయిస్టు పార్టీ ముఖ్య నాయకులు హిద్మా, టెక్ శంకర్‌లతో పాటు వారి అనుచరులను బూటకపు ఎన్‌కౌంటర్లో కాల్చి చంపిన తర్వాత ఏపీ పోలీస్ అధికారులు అమిత్‌షా ఇచ్చిన ప్రోత్సాహంతో నక్సలైట్లు లేని ఆంధ్రప్రదేశ్‌ను చూపిస్తామని గర్వంగా ప్రకటిస్తున్నారు.

నక్సలైట్లు లేని భారత్‌ను, దానితోపాటు ఆంధ్రప్రదేశ్‌ను వీరు ఏ విధంగా నిర్మిస్తారు! ఈ దేశంలో నక్సలిజం పుట్టటానికి మూల కారణాలైన పేదరికం లేక దారిద్ర్యం, ఈ దేశంలో అపారంగా ఉన్న అడవులలో బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా అమానవీయ జీవితాలు గడుపుతున్న అడవి బిడ్డలు, నానాటికీ పేదవాళ్లు మరింత పేదలుగా, ధనవంతులు అపర కుబేరులుగా పెరిగిపోతున్న స్థితిలో, చదువులు అంగడి సరుకుగా మారిపోయి నిరుద్యోగ మహమ్మారి వికృతంగా నాట్యం చేస్తుంటే, అవినీతి అచ్చోసిన ఆంబోతులా కరాళ నృత్యం చేస్తుంటే, భూమినే నమ్ముకున్న రైతులు అప్పుల బాధ తాళలేక నిత్యం ఆత్మహత్యలకు పాల్పడుతుంటే, భరతమాత అంగాంగాన్ని తాకట్టు పెట్టి పైశాచిక ఆనందం పొందుతున్న భారత దళారీ పాలకులు... ఈ దేశంలో ఉన్నంతకాలం నక్సలిజాన్ని నిర్మూలించటం అంటే నక్సలైట్లు లేని భారతాన్ని నిర్మించటం సాధ్యమా!

పోలీసులు చేసిన ఎన్‌కౌంటర్లన్నీ పోలీసు హత్యలేనని, ఈ బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయవిచారణ జరిపించాలని పౌర హక్కుల సంఘాలు ఈనాడు కాదు ఏనాటి నుంచో డిమాండ్ చేస్తున్నాయి. అసలు ఎన్‌కౌంటర్ అంటే నక్సలైట్లు పోలీసులు ఎదురు బొదురు కాల్పులు జరుపుకోవటం. దశాబ్దాలుగా జరుగుతున్న ఎన్‌కౌంటర్లలో ఒకటో అరో తప్పితే మొత్తం బూటకపు ఎన్‌కౌంటర్లే అన్నది బహిరంగ రహస్యం. అంటే ఎక్కడో ఒకచోట పట్టుకుని ఈమధ్య మారేడుమల్లి, రంపచోడవరంలలో మావోయిస్టులను తీసుకొని వెళ్లి కాల్చి చంపినట్లు చంపటమే ఇంతకాలం పోలీసులు సాగించిన ఎన్‌కౌంటర్ల చరిత్ర. 1948లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం విధించిన తర్వాత బూటకపు ఎన్‌కౌంటర్ల పర్వానికి ఆనాటి ప్రభుత్వాలు తెరతీశాయి.

ఆనాడు కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఫలితంగా రహస్య జీవితం గడుపుతున్న కృష్ణాజిల్లా నాయకులైన చల్లపల్లి నారాయణరావు, గోగినేని తాతయ్యను తలగడదీవి కొత్తపాలెం తీసుకు వెళ్లి చెట్టుకు కట్టేసి పోలీసులు దారుణంగా కాల్చి చంపారు. ఆనాడు రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన వందలాది బూటకపు ఎన్‌కౌంటర్లకు ఇది ఒక ఉదాహరణ మాత్రమే. ఆ తర్వాత జలగం వెంగళరావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రికార్డ్ స్థాయిలో శ్రీకాకుళం జిల్లాలో విప్లవకారులను బూటకపు ఎన్‌కౌంటర్లు జరిపి ప్రాణాలు బలిగొని చరిత్ర ప్రసిద్ధి చెందారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు అధికారం చెలాయిస్తున్న పాలకవర్గాలు తాము ప్రమాణం చేసిన రాజ్యాంగం సాక్షిగా బూటకపు ఎన్‌కౌంటర్లను యధేచ్ఛగా కొనసాగిస్తూనే ఉన్నారు. అయితే ఎంతో కాలంగా రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ బూటకపు ఎన్‌కౌంటర్లు సాగిస్తున్న పోలీసులకు గాని, వారిని నడిపిస్తున్న పాలకులకు గానీ శిక్షలు పడ్డాయా!

అలాంటి పాలకులు నీతి నియమాలకు నిలువెత్తు పాతర వేస్తారని మావోయిస్టులు ప్రభుత్వంతో చర్చలకు సిద్ధమని ప్రకటించిన సందర్భంగా వెల్లడయ్యింది. మావోయిస్టు పార్టీ కేంద్ర నాయకులు ప్రభుత్వంతో చర్చించటానికి సిద్ధమని ప్రకటిస్తే, పౌర హక్కుల సంఘాల నాయకులు కూడా వారికి మద్దతుగా నిలబడితే, హోంమంత్రి అమిత్‌షా చర్చలు జరిపే ప్రసక్తే లేదు, మావోయిస్టులను 2026 మార్చి నాటికి తుడిచేస్తామని ప్రకటించి చర్చలు ప్రతిపాదించిన మావోయిస్టులను పదుల సంఖ్యలో బూటకపు ఎన్‌కౌంటర్లలో కాల్చి చంపుతున్నారు.

యుద్ధ నీతి అనే కనీస ధర్మాన్ని పాటించకుండా కాల్చి చంపటం నీతి బాహ్య చర్య కాదా! అలానే తేదీలు ప్రకటించి నక్సలైట్లను నిర్మూలిస్తానని హోంమంత్రి బాహాటంగా ప్రకటించటం చూస్తే అసలు మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా అన్న సందేహం ఎవరికైనా వస్తుంది! ఇటువంటి స్థితిలో రాజ్యాంగంలో పొందుపరచిన ప్రాథమిక హక్కులను కాపాడుకోవడం నేడు ప్రజాస్వామ్యవాదులకు ప్రథమ కర్తవ్యంగా ముందుకు వచ్చింది. నేడు సమాజంలో నానాటికి పెరుగుతున్న అసమానతలు రూపుమాపకుండా నక్సలిజాన్ని ఫలాన తేదీ లోపల నిర్మూలించటం సాధ్యం కాదని కూడా ప్రజలు ఎలుగెత్తి చాటి చెప్పాల్సి వస్తుంది.

సెల్ నెం: 9848120105

రూపాయి క్షీణతపై లోతైన పరిశీలన అవశ్యం

అంజన్ రాయ్

అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి విలువ రోజు రోజుకు అగాథంలోకి పడిపోతున్నది. దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా శనివారం డాలర్‌తో పోల్చితే రూ.90 దాటేసి రూ.90.70 వద్ద సరికొత్త జీవన కాలం కనిష్ఠానికి పడిపోయింది మందగమన భయాలు, అధికంగా ఉన్న చమురు ధరలు, అంతర్జాతీయ ప్రతికూల అంశాలు, భారతీయ రిజర్వ్ బ్యాంకు (ఆర్‌బీఐ) వద్ద మారకం నిల్వలు తగ్గిపోవడం తదితర అంశాలు రూపాయిని కుదేలు చేస్తున్నాయి. భారత రూపాయి నిరంతరం తరుగుదలకు గురవుతున్నట్లు కనిపిస్తోంది. కొంతమంది వ్యాపారులు, ఆర్థిక మార్కెట్ల నిర్వాహకులు ఆర్థిక పత్రికలకు ఇలాంటి అభిప్రాయాలను తీవ్రంగా వ్యాప్తిచేస్తున్నారు. కానీ అత్యంత దారుణమైన సమయంలో, 1992 లో రూపాయి విలువ మొదటిసారి పడిపోయినా ఆశ్చర్యకరంగా ఆ తర్వాత బలాన్ని తిరిగి ప్రదర్శించింది. అయితే, 2014 లో దేశంలో మోదీ అధికారం చేపట్టిన తర్వాత రూపాయి విలువ బాగా క్షీణించింది, కానీ చాలా కాలం పాటు ప్రశాంతంగా ఉంది. మన దేశ చమురు అవసరాల్లో 85శాతం దిగుమతుల ద్వారానే తీరుస్తున్నందున దిగుమతుల కోసం ఎక్కువ డాలర్లు ఖర్చు చేయాల్సిరావడం, ముడిపదార్థాలు, వస్తువుల ధరలు విపరీతంగాపెరగడం, విదేశీ మారకనిల్వలు గణనీయంగా తగ్గిపోవడం రూపాయి విలువ క్షీణతకు కారణాలుగా చెప్పవచ్చు. రూపాయి మారకం విలువ తగ్గడం దేశ ఆర్థిక వ్యవస్థ, వ్యాపార సంస్థలతో పాటు అన్ని వర్గాల ప్రజలపైనా తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఫెడ్ వడ్డీ రేట్లను వేగంగా పెంచుతుందన్న అంచనాలతో డాలర్ మరింతగా బలపడుతుందని, బంగారంపై దిగుమతి సుంకం పెంచినందున రూపాయికి కొంతమేర మద్దతు లభించవచ్చనీ, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐలు) దేశీ స్టాక్ మార్కెట్లో ఎడతెరపి లేకుండా విక్రయాలు జరపడం కూడా రూపాయి విలువను దెబ్బతీస్తున్నదని విశ్లేషకులు అభిప్రాయం.

2014కు ముందు బీజేపీ అధికారంలోకి రాకముందు డాలర్‌తో రూపాయి విలువ 68 కి పడిపోతే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంపై నరేంద్రమోదీ తీవ్రంగా విరుచుకుపడ్డారు. రూపాయి ఐసీయూలో పడిపోయిందనీ, తాము అధికారంలోకి వస్తే దేశీయ కరెన్సీని ప్రపంచ మార్కెట్‌లో నిలదొక్కుకునేలా చేస్తామని అనేక గొప్పలు చెప్పారు. అయితే, అధికారంలోకి వచ్చాక అందుకు అనుగుణంగా తీసుకున్న చర్యలు మృగ్యం. ప్రస్తుతం అంతకంటే దారుణమైన స్థితిలోకి రూపాయి విలువ పడిపోతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కట్టడి చర్యలు శూన్యం. దేశీయగణాంకాలు బలహీనంగా చోటుచేసుకోవడానికి తోడు అంతర్జాతీయంగా డాలర్‌విలువ పెరగడం రూపాయిని ఒత్తిడికి గురిచేస్తోంది. మార్చి 1993లో, రూపాయిపూర్తిగా మార్కెట్ ఆధారితమైనప్పుడు అది డాలర్‌తో పోలిస్తే 31.52 గా ఉంది. ఒక దశాబ్దం తర్వాత, అది రూ.48.39 కి తగ్గింది, కానీ 2007-08 లో ప్రపంచ ఆర్థిక మాంద్యం ప్రారంభానికి ముందు అది రూ.40.28కి తిరిగి బలంగా పుంజుకుంది. ప్రపంచ ఆర్థిక మాంద్యం తర్వాత,

2009లో రూపాయి విలువ మళ్లీ 47.44 కి పడిపోయింది, ఒక సంవత్సరంలో కొంత వరకు కోలుకుంది. రూపాయి విలువ తగ్గుతున్నప్పటి నుంచి వచ్చిన తీవ్ర ఆందోళనల తర్వాత, రూపాయి విలువ తగ్గుదల తదుపరి దశ వచ్చింది.

ఒక పక్క భారత్ రూపాయి విలువ పడిపోతుంటే అందుకు విరుద్ధంగా, చైనా రెన్మిన్బి ఇప్పుడు చాలా కాలంగా అమెరికన్ డాలర్‌తో పోలిస్తే దృఢంగా ఉంది. ఎందుకు అలా ఉంది. రెండు ఆర్థిక వ్యవస్థల ప్రాథమిక అంశాలలో ఉన్న పదునైన తేడాలలో దీనికి సమాధానం దొరుకుతుంది. చైనా ఒక భారీ తయారీ పరిశ్రమను అభివృద్ధి చేసింది. ఈ మధ్య సంవత్సరాల్లో అది అపారంగా అభివృద్ధి చెందింది, ఇది దానిని మిగతా వాటి నుంచి భిన్నంగా ఉంచుతోంది. రూపాయి మారకపు రేటు హెచ్చుతగ్గులు ఆర్థిక వ్యవస్థ పనితీరు, అనేక అంశాలను ప్రతిబింబిస్తాయి. రూపాయి మారకపు రేటులో ప్రస్తుత హెచ్చు తగ్గులు ప్రపంచ మార్కెట్లు, ఆర్థిక వ్యవస్థలోని అనిశ్చితుల తుది ఫలితం; మరింత ప్రాథమికంగా, ఇవి దేశీయ ఆర్థిక వ్యవస్థ, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మధ్య వ్యత్యాసాలకు కూడా అద్దం పడుతుంది. అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం రేటులో ప్రస్తుత క్షీణత ఈ రెండు అంశాలను సూచిస్తుంది - ప్రపంచ సంక్షోభం, అనిశ్చితి రూపాయిపై ఒత్తిడి తెచ్చినప్పటికీ, భారతదేశం దాని ప్రధాన వాణిజ్య భాగస్వామి మధ్య ద్రవ్యోల్బణ వ్యత్యాసం కూడా ఒక పాత్ర పోషించింది. ఈ కారకాల ప్రతికూల ప్రభావం, నిరంతర తక్కువ కారకాల ఉత్పాదకత ద్వారా మరింత పెరిగింది.

వాస్తవ ఆర్థిక వ్యవస్థ లోపాలు ఇప్పుడు మారకపు మార్కెట్ ద్వారా ఆర్థిక మార్కెట్లు పతనంగా రూపాంతరం చెందుతున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గడం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న ఇబ్బందులను, భారత ఆర్థిక వ్యవస్థలోకి దాని ప్రసరణను ప్రతిబింబిస్తుంది. ఈసారి ప్రధాన కారణం విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు ఎఫ్‌ఐఐలు, నిధుల ఉపసంహరణలో గణనీయమైన పెరుగుదల. నవంబర్‌లోనే ఎఫ్‌ఐఐలు దాదాపు 1 బిలియన్ డాలర్లను వెనక్కి తీసుకున్నారు. ప్రస్తుతం ఉన్నట్లుగా ప్రపంచ ఆర్థిక పరిస్థితి అనిశ్చితంగా మారినప్పుడు, పెద్ద పెట్టుబడిదారులు తమ పెట్టుబడి స్థానాలను తిరిగి మార్చుకుంటారు. సాధారణంగా, వారు డాలర్ విలువ కలిగిన ఆస్తులకు గణనీయమైన ప్రాధాన్యతనిస్తారు. ఎందుకంటే డాలర్ ఏకైక అతి ముఖ్యమైన కరెన్సీగా మిగిలిపోయింది. ఇతర కరెన్సీలతో పోలిస్తే దాని విలువ తగ్గే అవకాశం చాలా తక్కువ. విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారత స్టాక్, రుణ మార్కెట్ల నుంచి తమ నిధులను ఉపసంహరించుకుంటున్నారు. అదే సమయంలో వారి డబ్బును భారతదేశం నుంచి తీసుకుంటున్నారు. వారు తమ అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బును అమెరికా డాలర్‌లో మార్చుకునేటప్పుడు, రూపాయి ఒత్తిడికి గురై విలువ తగ్గుతుంది. ప్రపంచ మార్కెట్లు, అవకాశాలపై అవాంతరాలు ఏర్పడిన ప్రతిసారీ కనిపించే సంబంధం ఇదే. 2008-09 లో ప్రపంచ ఆర్థిక మాంద్యం సమయంలో భారత రూపాయి విలువ గణనీయంగా పడిపోయింది. ఆ అస్థిరత కారణంగా రూపాయి విలువ దాదాపు రూ.40 నుంచి డాలర్‌కు రూ.50 వరకు చాలా తక్కువ స్థాయికి పడిపోయింది.

ఆ తరువాత, యూఎస్ ఫెడరల్ రిజర్వ్, యూఎస్ డాలర్‌ను ప్రోత్సహించడానికి పెద్ద మొత్తంలో నిధులను సమకూర్చుకోవాలనే దాని ద్రవ్య విధాన వైఖరిని తిప్పికొట్టడానికి, తరువాత పెద్ద నిధుల ఏర్పాటును తగ్గించడానికి కృషి చేస్తున్నందున "టేపర్ టాంట్రమ్స్" అని పిలిచే సంవత్సరాలలో రూపాయి ఒత్తిడికి గురైంది. ఇప్పుడు మరోసారి భారత ఆర్థిక వ్యవస్థ అనిశ్చితిని ఎదుర్కొంటోంది. భారత వస్తువుల ఎగుమతులపై అమెరికా అధిక సుంకాలను విధించింది. ఈ సుంకాలు ఇతర దేశాల ఎగుమతుల కంటే భారతీయ ఎగుమతులను ఖరీదైనవిగా చేయడం ద్వారా అమెరికా మార్కెట్ల నుంచి భారతీయ ఎగుమతులను తరిమివేస్తాయి. ఈ అంశాలన్నీ కలిసి రూపాయి విలువను తగ్గిస్తున్నాయి, కానీ ప్రస్తుతానికి, రూపాయి విలువ అకస్మాత్తుగా తగ్గడానికి ప్రధాన కారణం భారతీయ స్టాక్ మార్కెట్లలో ఎఫ్ఐఐల అమ్మకాలు పెరగడం, భారతదేశం నుంచి అమెరికాలోని వారి లాభదాయక మార్కెట్లకు చెల్లింపులు జరగడం.

రూపాయితో పోలిస్తే అమెరికా డాలర్ విలువ గణనీయంగా పెరగడంతో మన దేశ విద్యార్థులకు విదేశీ చదువు కూడా తీవ్ర భారంగా మారుతుంది. ఉన్నత విద్య కోసం మన దేశం నుంచి అత్యధికులు అమెరికాకే వెళతారు. డాలర్ విలువ విపరీతంగా పెరగడంతో కాలేజీ ఖర్చుల కోసం రూపాయలలో చాలా ఎక్కువగా చెల్లించాల్సి వస్తోంది. రూపాయి పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశంలో దిగుమతి ఆధారిత అనేక ఉత్పత్తుల ధరలు భారీగా పెరగనున్నాయి. చమురు ధరలు మరింత మండనున్నాయి. ఇప్పటికే చుక్కలనంటుతున్న ధరలతో నానా అగచాట్లు పడుతున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలు మరిన్ని అగచాట్లు పడతారు. వారి జీవనం అస్తవ్యస్తమవుతుంది. విదేశీ రుణాలు తలకు మించిన భారం కానున్నాయి. ఈ పరిస్థితులను అవకాశంగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం ప్రజలపై మరింత పన్నుల భారాన్ని మోపేందుకు ఏమాత్రం వెనుకాడదు. ఇప్పటికే భారీగా పెరిగిన ద్రవ్యోల్బణం మరింత పెరగటంతో పాటు వృద్ధి రేటుపై ప్రతికూల ప్రభావం పడనుంది.

వ్యక్తిగత సమాచారం భద్రమేనా?



ప్రొఫెసర్ పీటాబాబీవర్ధన్

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరగడం, కృత్రిమ మేధ వంటి సరికొత్త సాంకేతికత అందుబాటులోకి రావడం, డిజిటలీకరణ అన్ని వ్యవస్థల్లోకి చేరడం, ఆటోమేషన్ సర్వత్రా వినియోగించడం, డీప్‌ఫేక్, క్లౌడ్ కంప్యూటింగ్ పద్ధతుల్ని ఇబ్బడి ముబ్బడిగా అవలంబించడం వల్ల సమాచార వ్యవస్థ ప్రమాదంలో పడనుందా? ఈ పరిణామాల నేపథ్యంలో వ్యక్తిగత వివరాల సమాచారానికి భద్రత లేకుండా పోతోందా? మన ప్రమేయం లేకుండానే మన వ్యక్తిగత సమాచారం చోరీకి గురైతే అడ్డుకట్ట వేసేందుకు ఏవైనా అవకాశాలు ఉన్నాయా? ఏయే మార్గాల ద్వారా సైబర్ నేరగాళ్లు సమాచారాన్ని దొంగిలిస్తున్నారు? ఇలాంటి ప్రశ్నలకు సమాధానాలు అన్వేషించే ప్రయత్నమే ఈ వ్యాసం లక్ష్యం. బ్యాంకు ఖాతాల నిర్వహణ కోసం మన వ్యక్తిగత వివరాలు అందిస్తాం. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు అవసరమైన సమాచారం పొందుపరుస్తాం. మొబైల్ సేవలు పొందడానికి సైతం వివరాలు ఇవ్వాల్సిందే. విద్యార్థులు విద్యాలయాల్లో ప్రవేశాలు పొందడానికి వ్యక్తిగత వివరాలు ఇవ్వాలి. పరీక్షలు రాసేందుకు సమర్పించే దరఖాస్తుల్లో కూడా వివరాలు రాయాల్సిందే. ఇళ్ల స్థలం కొనుగోలు చేసినా, ఇంటి ప్లానుకు ఆమోదం కావాలన్నా వ్యక్తిగత వివరాలు ఇవ్వాల్సిందే. ఇక ఇల్లు కట్టాక నీటి కుళాయి కావాలన్నా, విద్యుత్ సరఫరా పొందాలన్నా అవసరమైన సమాచారం సమర్పించాల్సిందే. ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలు ఇతరత్రా సమాచారం అందించాల్సిందే. పొలాలు కొనాలన్నా, విక్రయించాలన్నా సమాచారం అందించడం తప్పనిసరి. క్రెడిట్ కార్డులు పొందాలన్నా, పాస్‌పోర్ట్ కావాలన్నా వ్యక్తిగత వివరాలు పొందుపరచడం తప్పనిసరి. ఫేస్‌బుక్‌లో ప్రొఫైళ్లు, గుగుల్స్ కాలర్లో వివరాలు, వివిధ యాప్స్‌ని వినియోగించాలన్నా, మెయిల్ ఐడీ క్రియేట్ చేయాలన్నా వ్యక్తిగత వివరాలు సమర్పించడం తప్పనిసరి. ఆన్‌లైనులో రుణాలు పొందాలన్నా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, బిగ్‌బాస్కెట్, బ్లింకి ట్వంటి వాణిజ్య యాప్స్‌లో సామాన్లు కొనుగోలు చేయాలన్నా తప్పనిసరిగా వ్యక్తిగత సమాచారాన్ని అందించాల్సిన అవసరం ఉంది. ఆఖరికి డాక్యుమెంట్లను కలర్ కాపీలు తీయాలన్నా, ఇంటి తాళానికి డూప్లికేట్ కీ చేయించాలన్నా ఈ మధ్య కాలంలో ఆధార్, పాన్‌కార్డు వివరాలు అడుగుతున్నారు. రైలుటిక్కెట్లు, విమానం టిక్కెట్లు ఆన్‌లైన్‌లో బుక్ చేయాలన్నా వివరాలన్నీ సమర్పించాలి. ఉద్యోగులు జీతాలు తీసుకోవాలన్నా, రిటైర్డ్ ఉద్యోగులు పెన్షన్లు పొందాలన్నా వ్యక్తిగత వివరాలు పొందుపరచడం ముఖ్యమైన విషయం. అంతా ఆటోమేషన్. టెక్నాలజీ రెవల్యూషన్. అంతా బానే వుంది... కానీ...???

సైబర్ చోరగాళ్ల సవాళ్లు: సాంకేతిక పరిజ్ఞానం ఎంత పెరిగినా, ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ఈ మధ్య కాలంలో 'సమాచార చౌర్యం' బెడద ఎక్కువ అయింది. సైబర్ నేరగాళ్లు మన వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించి అనేక అరాచకాలకు తెగబడుతున్నారు. అడ్డదారుల్లో ధనార్జనే ధ్యేయంగా బరి తెగిస్తున్నారు. కోట్లు కొల్లగొడుతున్న సంఘటనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. ఇంటా బయట పోరు అన్నట్టు దేశీయంగాను, అంతర్జాతీయ స్థాయిలోను సైబర్ ముఠాలు చెలరేగిపోతున్నాయి. వ్యాపార లావాదేవీల్లో చొరబడి కైంకర్యం చేస్తున్నారు. మనకు తెలియకుండానే క్రెడిట్ కార్డుల నుంచి ఆర్డర్లు చేసి చిన్న ఓటీపీతో భారీ మొత్తంలో కొనుగోళ్లుచేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న 'ముద్ర' వంటి పథకాన్ని సైతం దుర్వినియోగం చేస్తున్నారు. మన పేరుతో నకిలీ దరఖాస్తు సృష్టించి రుణాన్ని కాజేస్తున్నారు. అన్ని వివరాలు పొందుపరచడం, ఒక్కసారి సరిచూసుకోండని మెయిల్ పంపుతారు. పొరబాటున మనం క్లిక్ చేశామా... ఇక అంతే. ఆ సొమ్ము వాళ్ల ఖాతాల్లోకి...డెబిట్ వివరాలు మన ఖాతాలోకి వెళ్లినట్టు సమాచారం మన మెయిల్‌కి చేరుతుంది. మాల్వేర్ సృష్టించి మన వ్యక్తిగత సమాచారం మొత్తం దొంగిలిస్తారు. డిజిటల్ అరెస్టు పేరుతో బ్లాక్‌మెయిల్ చేసి డబ్బు గుంజుతున్నారని అనేకమంది బాధితులు వాపోతున్నారు. మన ఫోన్‌నంబర్‌కి పెద్ద లాటరీ తగిలిందని, విడిపించేందుకు కొంత సొమ్ము చెల్లించాలని నమ్మబలుకుతారు. అందినకాడికి దోచేస్తారు. ఈ బెడద వ్యక్తులకేకాదు...పెద్దపెద్ద సంస్థలకూ తప్పడం లేదు. సంస్థల అధికారిక వెబ్‌సైట్లలోకి దూరిపోయి సమాచారాన్ని చోరీచేసి, పోటీదారులకు విక్రయించే ముఠాలు కూడా ఉన్నాయంటే ఆశ్చర్యం కలిగిస్తుంది. అంతర్జాతీయ నకిలీ కాల్స్ చేసి పాస్‌వర్డ్ అడుగుతారు. ఏమరుపాటులో ఉన్న మనం చెప్పేస్తాం. మన అకౌంట్ ఖాళీ అయిపోతుంది. మోసపూరిత లింక్స్ పంపడం ద్వారా కూడా వ్యక్తిగత వివరాలు లాగేస్తున్నారు. లింక్ క్లిక్ చేయగానే మన ఖాతా వివరాలు నేరగాళ్లకు చేరిపోతాయి.

పటిష్ఠత లేని గోప్యత...

వ్యక్తిగత వివరాలు చోరీకి గురికావడానికిప్రధాన కారణం పటిష్ఠమైన భద్రతా వ్యవస్థ లేకపోవడం. చాలా సందర్భాల్లో ఆటోమేషన్ వ్యవస్థనిర్వహణలో వుండే అజాగ్రత్తే అనర్థాలకు దారితీస్తుంది. పెద్దపెద్ద కంపెనీలు, సంస్థల్లో కంప్యూటర్ల నిర్వహణ అధ్వానంగా ఉంటుంది. ఎప్పటికప్పుడు పరిశీలనతో పాటు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయించడం కూడా మరువకూడదు. కేంద్రీకృతమైన నియంత్రణ కొన్ని సందర్భాల్లో సత్ఫలితాలు ఇవ్వకపోవొచ్చు. అందుకే వివిధ అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయడం ఉత్తమం. పాస్‌వర్డ్ ఎప్పటికప్పుడు మారుస్తుండాలి. సున్నితమైన సమాచారాన్ని అందరికీ అందుబాటులో ఉంచడం ప్రమాదమని భావించాలి. సైబర్ నేరగాళ్లు బరితెగించి పోవడానికి మనమే అవకాశం కల్పిస్తున్నాం.

కొన్ని సందర్భాల్లో 'కొందరు' ఉద్యోగుల నుంచి కూడా సమాచారం చోరులకు చేరే అవకాశం ఉంటుంది. సరైన జీతాలు లేకపోవడం, పని చేసేచోట సరిపడా వసతులు లేకపోవడం, అభద్రతాభావం వంటి కారణాల వల్ల ఉద్యోగులు సంస్థ మీద అక్కసు పెంచు కుంటారు. అందుకే అవకాశం దొరికినప్పుడుకాసులకు 'కక్కుర్తి'పడి శత్రువులకు, పోటీదారులకు డేటా అమ్మే స్తుంటారు. ఇంటర్నెట్‌కు సంబంధించిన లోపాలవల్ల కూడా సమాచారం లీకయ్యే అవకాశం ఉంటుంది. కొత్తగా వచ్చిన కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత సాంకేతికతవల్ల కూడా డేటా భద్రతకు ముప్పు వాటిల్లుతుందని చెబుతున్నారు. కాలం చెల్లిన యాంటీ వైరస్ వాడకం మొత్తం కంప్యూటర్ వ్యవస్థనే నాశనం చేస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చౌకబారుసాఫ్ట్‌వేర్ వినియోగం కూడా డేటా సులభంగా దొంగిలించడానికి దోహదం చేస్తోందనీ రుజువయింది.

అడ్డదారి ఆగడాలను ఆపేదెలా?

ఈ మధ్యనే సినిమా పైరసీ దందా నడిపి, ఐ -బొమ్మ, బప్పం సైట్ల ద్వారా కోట్లు గడించిన టెక్నోక్రాట్ ఇమ్మడి రవి అరెస్టు తీవ్ర సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సినిమాల పైరసీ ఒక ఎత్తుకాగా, తన దగ్గర ఎనభైఐదు లక్షల మంది వ్యక్తిగత సమాచారం ఉందన్న వార్త భయాందోళనలు కల్గిస్తోంది. ఒక్క వ్యక్తి దగ్గరే ఇంత భారీ స్థాయిలో వ్యక్తిగత సమాచారం ఉన్నదంటే, ప్రపంచ వ్యాప్తంగా ఇంకెందరు డేటా చోరీ చేశారో తలచుకుంటే భయంకాక మరేంటి? వ్యక్తులు, సంస్థల సమాచారం కాకుండా ఏకంగా దేశభద్రతకు సంబంధించిన రహస్య సమాచారం మరెవరైనా దుండగుల చేతికిచిక్కితే పరిస్థితిఏంకాను? మరి అడ్డగోలుగా నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ 'డేటాచౌర్యం' దందాను అరికట్టలేమా? అంటే అవుననే అంటున్నారు నిపుణులు. కొన్నిజాగ్రత్తలు తీసుకోవడంద్వారా దుండగుల ఆట కట్టించడం సులువే అంటున్నారు. అనధికారసమాచారాన్ని అంగీకరించ కూడదు. తెలియనిలింకులను క్లిక్ చేయ కూడదు. బహుళ అంచెల రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. ఎందుకంటే కేంద్రీకృత రక్షణ వ్యవస్థ ఎప్పటికీ ప్రమాదమే అంటున్నారు. తరచూ పర్యవేక్షణ అవసరం. ఎప్పటికప్పుడు సిస్టమ్ అప్‌గ్రేడ్ చేస్తుండాలి. సిబ్బందికి నిపుణులచేత శిక్షణ ఇప్పిస్తూ ఉండాలి. నైపుణ్యాలను మెరుగుపడేలా శిక్షణ ఉండాలి. తరచూ సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించాలి. దీనివల్ల బలహీనతలు బయటపడతాయి. వాటిని అధిగమించడానికి వీలవుతుంది. నకిలీ, పైరేటెడ్ సాఫ్ట్‌వేర్‌ని వినియోగించవద్దు. బయటి వ్యక్తులకు కంప్యూటర్, ల్యాప్టాప్, ట్యాబ్లు ఇవ్వొద్దు. పెన్‌డ్రైవ్‌లకు యాక్సిస్ ఇవ్వొద్దు. అవి బోలెడంత వైరస్‌ను అంటిస్తాయి.

జర్నలిజం పూర్వపు విభాగాధిపతి
ఆంధ్ర విశ్వవిద్యాలయం, 9393100566

నెహ్రూ ఇంటి పేరు ఎందుకు పెట్టుకోలేదు: బీజేపీ

న్యూఢిల్లీ: దేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూను దూషించడమే కేంద్రంలోని అధికారపక్షం ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ ఆరోపించారు. నెహ్రూ ఘనతలను తుడిచేయడమే కాకుండా ఆయనకు సంబంధించిన సామాజిక, రాజకీయ పునాదులను నాశనం చేయాలని చూస్తోందన్నారు. అయితే ఆమె ఆరోపణలను బీజేపీ వ్యతిరేకించింది. అంత గౌరవమే ఉంటే... నెహ్రూ ఇంటి పేరును ఆమె ఎందుకు పెట్టుకోలేదని ప్రశ్నించింది. 'ఇలాంటి విమర్శలు ఆపాల్సిన సమయం వచ్చింది. ఆమెకు అంత గౌరవం ఉంటే... తన పేరులో నెహ్రూ ఇంటి పేరును చేర్చుకునేవారు. ఆయన సేవలను తక్కువ చేసి చూసే వ్యక్తులు వారే. ఇందులో బీజేపీకి కానీ, ప్రభుత్వానికి కానీ ఎలాంటి ప్రమేయం లేదు' అని బీజేపీ అధికార ప్రతినిధి టామ్ వడక్కన్ అన్నారు.

మతతత్వ శక్తుల నుండి దేశాన్ని కాపాడతాం: కనిమొళి

చెన్నై: భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ 70వ వర్థంతి సందర్భంగా భారతదేశాన్ని మతతత్వ శక్తుల నుండి డీఎంకే, దాని మిత్రపక్షాలు కాపాడుతూనే ఉంటాయని డీఎంకే ఎంపీ కనిమొళి అన్నారు. మన ప్రజలను పుట్టుకతో విభజించే కుల నిర్మాణాన్ని బద్దలుకొట్టి... ఈ దేశం గొప్ప చార్టర్‌ను మనకు అందించిందని, మన హక్కుల గురించి తెలియజెప్పిందని, అందరూ సమానమే అనే సూత్రాన్ని మనల్ని స్వీకరించేలా చేసిన రాజ్యాంగ విప్లవకారుడు డాక్టర్ అంబేద్కర్ అని కనిమొళి నివాళి అర్పించారు. అసమానతను శాశ్వతం చేసే కులతత్వాన్ని తాము వ్యతిరేకిస్తామని, దానికి వ్యతిరేకంగా పోరాడతామని స్పష్టంచేశారు. అంబేద్కర్ తన జీవితాంతం వీటికి వ్యతిరేకంగా పోరాడారని, ఈ సందర్భంగా తాము కూడా వైవిధ్యభరితమైన భారతదేశాన్ని మతతత్వశక్తుల బారి నుండి కాపాడతామని కనిమొళి సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు.

ప్రమాదంలో రాజ్యాంగం: రాహుల్

న్యూఢిల్లీ: ప్రతి భారతీయుడి రాజ్యాంగం ప్రమాదంలో ఉందని లోక్‌సభ ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ 70వ వర్థంతి సందర్భంగా కేంద్రం మహాపరినిర్వాణ్ దివాస్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించింది. ఈ సందర్భంగా పార్లమెంటులో అంబేద్కర్ విగ్రహానికి రాహుల్‌గాంధీ నివాళులర్పించారు. అంబేద్కర్ ఆలోచనల్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించడం ఉమ్మడి జాతీయ బాధ్యత అని రాహుల్ పునరుద్ఘాటించారు. అనంతరం రాహుల్ మీడియాతో మాట్లాడుతూ 'బాబాసాహెబ్ అంబేద్కర్ ఒక మహోన్నత జాతీయ వ్యక్తి. ఆయన ఆలోచనలు భారతదేశ ప్రజాస్వామ్య, సామాజిక చట్రాన్ని మార్గనిర్దేశం చేస్తూనే ఉన్నాయి. అంబేద్కర్ ఒక ఆదర్శం. ఆయన దేశం మొత్తానికి ఒక మార్గాన్ని చూపించారు. ఆయన మనకు రాజ్యాంగాన్ని ఇచ్చారు. అందుకే ఆయనను మనం ఇప్పటికీ స్మరించుకుంటున్నాము. ఆయన ఆలోచనలను, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి. ఇప్పుడు ప్రతి భారతీయుడి రాజ్యాంగం ప్రమాదంలో ఉంది. మేము దాన్ని రక్షిస్తాం. పౌరులు దానిని రక్షిస్తారు' అని అన్నారు.

ఇండిగో ప్రహసనమే!

ఐదవ రోజూ 400కు పైగా విమానాల రద్దు

- విమానాశ్రయాల్లో సహనం కోల్పోతున్న ప్రయాణికులు
- కనీసం లగేజీ సంగతీ చెప్పడం లేదని ఆగ్రహం
- ఇండిగో తీరుపై కేంద్రం అసహనం
- నేటి రాత్రికల్లా టికెట్ల రుసుం వాపసుకు ఆదేశం
- చార్జీలు పెంచవద్దని ఇతర సంస్థలకూ సూచన

న్యూఢిల్లీ: దేశంలో ఇండిగో విమాన సర్వీసుల రద్దు సంక్షోభం కొనసాగుతోంది. వరుసగా ఐదవ రోజూ వందలాది విమానాలు రద్దవడంతో ప్రయాణికులు సహనం కోల్పోతున్నారు. నాలుగు ప్రధాన విమానాశ్రయాలలో శనివారం 400 కి పైగా విమానాలు రద్దయ్యాయి. దీంతో వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారు దీర్ఘకాలిక జాప్యం, పెరుగుతున్న ప్రయాణ ఖర్చుల గురించి తీవ్ర ఆందోళన చెందుతున్నారు. విమానాశ్రయాలలో నిలిచిపోయిన తమకు కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ లగేజీలు ఎక్కడున్నాయో చెప్పే దిక్కు కూడా లేదని ఆవేదన చెందుతున్నారు. మరోవైపు ఇదే అదునుగా ఇతర విమానయాన సంస్థలు భారీగా చార్జీలు పెంచేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇండిగో సహా ఇతర విమానయాన సంస్థలపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే శనివారం ఇండిగో సర్వీసుల రద్దు ప్రభావం మరింత పెరిగింది. కోర్టు ఆదేశించిన కొత్త పైలట్ విధి, విశ్రాంతి నియమాల నుంచి తాత్కాలిక ఉపశమనం పొందిన తర్వాత కూడా నాలుగు ప్రధాన విమానాశ్రయాలలో 400 కి పైగా విమానాలను విమానయాన సంస్థ రద్దు చేసినట్లు ఆ వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ వార్తా సంస్థ పేర్కొంది. శనివారం రెండు ప్రధాన నగరాలు ఢిల్లీ, ముంబై నుంచే 200 కి పైగా విమానాలు రద్దయ్యాయి. ఇండిగో రద్దు చేసిన విమాన సర్వీసులలో బెంగళూరు విమానాశ్రయం నుంచి 124 విమానాలు... 63 నిష్క్రమణలు, 61 రాకపోకలు, ముంబై 109 విమానాలు... వీటిలో 51 నిష్క్రమణలు, 58 రాకపోకలు ఢిల్లీ విమానాశ్రయంలో 106 రద్దయిన విమానాలలో 54 నిష్క్రమణలు, 52 రాకపోకలు ప్రభావితమయ్యాయి. ఇక హైదరాబాద్‌లో ఇండిగో 66 విమానాలను రద్దు చేసినట్లు పీటీఐ వర్గాలు తెలిపాయి.

ప్రధాన నగరాల్లో భారీగా రద్దులు

శనివారం ఉదయం తిరువనంతపురం విమానాశ్రయంలో ఇండిగో విమాన సర్వీసులు 6 రద్దవగా, అహ్మదాబాద్‌లో 7 రాకపోకలు, 12 నిష్క్రమణ సర్వీసులు రద్దయ్యాయి. ఇక ముంబై విమానాశ్రయంలో ఇండిగో కార్యకలాపాలను స్థిరీకరించడానికి ఇబ్బంది పడుతుండటంతో ప్రయాణికులు చిక్కుకుపోయారు. చెన్నై విమానాశ్రయంలో కూడా పొడవైన క్యూలు కనిపించాయి. అక్కడ అనేక విమానాలు రద్దయ్యాయి. శనివారం పూణే విమానాశ్రయంలో 14 రాకపోకలు, 28 ఇండిగో నిష్క్రమణలు రద్దయ్యాయి. ఈ వారం ప్రారంభంలో ప్రారంభమైన అంతరాయాలు పైలట్-రోస్టరింగ్ సమస్యల కారణంగా కొనసాగాయి. ఇది దేశ వ్యాప్తంగా ఇండిగో విమానాల భారీ రద్దులకు దారితీసింది. ఇదిలాఉండగా శుక్రవారం ఇండిగో ఈ భారీ సంక్షోభానికి క్షమాపణలు చెప్పింది. రద్దు చేసిన అన్ని విమానాలకు టికెట్ రుసుము తిరిగి చెల్లిస్తామని హామీ ఇచ్చింది. శుక్రవారం ఒక్క రోజే 1,000 విమానాలు నిలిచిపోయాయి. అంతకుముందు రోజు 550 కు పైగా రద్దయ్యాయి. ఫ్లైట్ డ్యూటీ టైమ్ లిమిటేషన్స్ (ఎఫ్‌డీటీఎల్) నిబంధనల 2వ దశలో ప్రణాళికా లోపాల వల్ల ఈ గందరగోళం ఏర్పడిందని ఇండిగో అంగీకరించింది. దీని కారణంగా ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది. కారణాలను గుర్తించి బాధ్యతాయుతమైన పార్టీలను జవాబుదారీగా ఉంచింది.

అధిక ధరలపై కేంద్రం ఆగ్రహం

కొన్ని విమానయాన సంస్థలు అసాధారణంగా అధిక విమాన చార్జీలను వసూలు చేస్తున్నాయనే ఆందోళనలను శనివారం పౌర విమానయాన మంత్రిత్వ శాఖ తీవ్రంగా పరిగణించింది. అవకాశవాద ధరల నుంచి ప్రయాణీకులను రక్షించడానికి, ప్రభావితమైన అన్ని మార్గాలలో న్యాయమైన, సహేతుకమైన ఛార్జీలను నిర్ధారించడానికి మంత్రిత్వ శాఖ తన నియంత్రణ అధికారాలను ఉపయోగించుకుంది. ఇప్పుడు సూచించిన చార్జీల పరిమితులను కచ్చితంగా పాటించాలని అన్ని విమానయాన సంస్థలకు అధికారిక ఆదేశం జారీ చేసింది. పరిస్థితి పూర్తిగా స్థిరపడే వరకు ఈ పరిమితులు అమలులో ఉంటాయి. విమాన ఛార్జీలపై గందరగోళం మధ్య డిసెంబరు 4 నుంచి తమ విమానాలకు చార్జీలను గణనీయంగా తగ్గించినట్లు ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ స్పష్టం చేశాయి.

పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రయాణీకుల వాపసులను ఆలస్యం లేకుండా వాపసు చేయాలని పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఇండిగోను ఆదేశించింది. రద్దు చేయబడిన లేదా అంతరాయం కలిగించిన అన్ని విమానాల వాపసు ప్రక్రియను 7వ తేదీ ఆదివారం రాత్రి 8:00 గంటలలోపు పూర్తిగా వాపసు ఇవ్వాలని మంత్రిత్వ శాఖ ఆదేశించింది. రద్దుల వల్ల ప్రయాణ ప్రణాళికలు ప్రభావితమైన ప్రయాణీకులకు ఎటువంటి రీషెడ్యూలింగ్ చార్జీలు విధించవద్దని కూడా విమానయాన సంస్థలకు సూచించింది. వాపసు ప్రక్రియలో ఆలస్యం లేదా పాటించకపోవడం తక్షణ నియంత్రణ చర్యలకు దారితీస్తుందని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.

ఈ పరిణామాలను నిర్వహించడానికి ప్రత్యేక ప్రయాణీకుల మద్దతు, వాపసు సౌకర్యాల సెల్‌లను ఏర్పాటు చేయాలని మంత్రిత్వ శాఖ ఇండిగోను ఆదేశించింది. అలాగే అదనంగా రాబోయే రెండు రోజుల్లో రద్దులు లేదా ఆలస్యం కారణంగా ప్రయాణీకుల నుంచి వేరు చేయబడిన అన్ని సామాన్లు గుర్తించి తిరిగి ఇవ్వాలని మంత్రిత్వ శాఖ విమానయాన సంస్థను ఆదేశించింది.

ఇండిగోపై కఠిన చర్యలకు కేంద్రం యోచన?

సీఈఓ పీటర్‌పై వేటుకు అవకాశం

న్యూఢిల్లీ : పైలట్ల విశ్రాంతి సమయాలకు సంబంధించిన కొత్త నిబంధనలను ఇండిగో విమానయాన సంస్థ అస్తవ్యస్తంగా నిర్వహించడం వల్ల దేశ వ్యాప్తంగా ఆ సంస్థ విమాన సర్వీసులు భారీగా రద్దయ్యాయి. దీంతో వేలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయిన తర్వాత, ప్రభుత్వం ఇండిగో సీఈఓ పీటర్ ఎల్బర్స్‌ను తొలగించాలని కోరే అవకాశం ఉందని ఆ వర్గాలు తెలిపాయి. శనివారం సాయంత్రం దేశ విమానయాన మంత్రిత్వ శాఖ ఇండిగో అధికారులను పిలిపించి... ఆ విమానయాన సంస్థపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు వారు పేర్కొన్నారు. దేశీయ మార్కెట్ వాటాలో దాదాపు మూడింట రెండు వంతుల వాటా కలిగిన బడ్జెట్ విమాన రవాణా సంస్థపై భారీ ఆర్థిక జరిమానా కూడా విధించవచ్చని కూడా భావిస్తున్నారు. ఇండిగో విమాన సర్వీసుల సామూహిక రద్దులు దేశ వ్యాప్తంగా గందరగోళానికి దారితీస్తున్నందున, ఇండిగో నడపడానికి అనుమతించబడిన విమానాల సంఖ్యను తగ్గించే విషయమై కూడా పరిశీలిస్తున్నారని వివరించారు. ఇది భారతదేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థపై ఇప్పటివరకు అత్యంత కఠినమైన చర్యను సూచిస్తుందని ఆ వర్గాలు తెలిపాయి.

ఇండిగో సిబ్బందిని గౌరవించండి: సోనూసూద్

ముంబై: దేశీయ విమానయాన సంస్థ ఇండిగో సేవల్లో తీవ్ర అంతరాయం కారణంగా ప్రయాణికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. విమానాశ్రయాల్లో సిబ్బందిపై తీవ్ర అసహనం వ్యక్తంచేస్తోన్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీనిపై ప్రముఖ నటుడు సోనూసూద్ శనివారం స్పందించారు. దయచేసి ఇండిగో సిబ్బందిని గౌరవించాలని ప్రయాణికులను కోరారు. ఈమేరకు ఎక్స్ వేదికగా వీడియో సందేశాన్ని షేర్ చేశారు. 'గత రెండు, మూడు రోజులుగా ఇండిగో సర్వీసుల్లో అంతరాయం వల్ల అసౌకర్యం కలుగుతోంది. నా కుటుంబం కూడా దాదాపు ఐదు గంటల పాటు వేచి ఉండాల్సి వచ్చింది. చివరకు విమానం బయల్దేరడంతో వారు గమ్యస్థానానికి చేరుకున్నారు. కానీ చాలా విమానాలు అలా బయల్దేరలేదు. చాలావరకు రద్దయ్యాయి. ప్రజలు వివాహాలకు హాజరు కాలేకపోయారు. సమావేశాలకు వెళ్లలేకపోయారు. విమానాల ఆలస్యం నిరాశ కలిగిస్తోంది. విమానాశ్రయాల్లో ప్రజలు తమపై అరుస్తున్నప్పుడు ఎలా స్పందించాలో అర్థంకాక గ్రౌండ్ స్టాఫ్ ఎదుర్కొంటున్న పరిస్థితి బాధిస్తోంది. నిరాశ, బాధతో ప్రయాణికులు తమ కోపాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఆ సమయంలో మిమ్మల్ని వారి స్థానంలో ఊహించుకోండి. వారు నిస్సహాయస్థితిలో ఉన్నారు. వారికి కూడా విమానాలు బయల్దేరతాయో... లేదో తెలియదు. పైనుంచి వచ్చే సందేశాలను మాత్రమే వారు మనకు తెలియజేస్తున్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్న వారిని గుర్తుచేసుకోండి. దయచేసి వారితో గౌరవంగా ఉండండి. ఈ రద్దు ప్రభావం వారిపై కూడా ఉంది. వారికి మద్దతుగా నిలవండి' అని తన పోస్టులో సోనూసూద్ పేర్కొన్నారు.

ఇంకా 'లార్డ్' పదం అవసరమా?: ఎంపీ అసంతృప్తి

న్యూఢిల్లీ: బ్రిటీష్ వలసపాలకులు ప్రవేశపెట్టిన లార్డ్ పదం ఇప్పటికీ భారత్‌లో ఉనికిలో ఉండటంపై బీజేపీ ఎంపీ సుజిత్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు. స్కూలు పుస్తకాలు, ఎన్‌సీఈఆర్‌టీ ప్రచురణలు మొదలు ప్రభుత్వ దస్త్రాలు, అధికారిక వెబ్‌సైట్‌లలో కూడా ఇంకా ఈ పదం కనిపిస్తుండటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచిపోయినా ఇంకా బ్రిటన్ వైస్రాయ్‌లు, గవర్నర్ల పేర్ల ముందు లార్డ్ పదం కొనసాగుతుండటంపై మండిపడ్డారు. వీటిని తొలగించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లార్డ్ పదాన్ని కొనసాగించడం వలసవాద భావజాలాన్ని కొనసాగించడమేనని ఆయన అన్నారు. సాంస్కృతిక శాఖ, పీఐబీ, పురావస్తు శాఖ వెబ్‌సైట్స్, బీహార్ రాజ్‌భవన్ (లోక్ భవన్) కూడా ఈ వలసపాలన బిరుదు కనిపిస్తోందని అన్నారు. 'బ్రిటీష్ పాలనలో వలసపాలకులు తమ విస్తరణవాద, ఆధిపత్య భావజాలానికి చిహ్నంగా ఈ బిరుదును తమకు తామే ఇచ్చుకున్నారు. తమని తాము భగవంతుడితో సమానమని గర్వపడ్డారు. కానీ దేశ ప్రజలపై దారుణాలకు ఒడిగట్టారు. ఇలాంటప్పుడు లార్డ్ పదాన్ని ఇంకా కొనసాగించడం సబబు కాదు. మరోవైపు, స్వాతంత్ర్య సమరయోధులకు ఇలాంటి గౌరవపదాలు ఏమీ లేవు. అతిపెద్ద అతిపురాతన ప్రజాస్వామిక దేశమైన భారత్‌లో ఇంకా ఈ పదాలను ఉంచడం వలసపాలన భావజాలాన్ని కొనసాగించడమే' అని ఆయన అన్నారు.

ఇండిగో విమానాల రద్దుతో ప్రత్యేక రైళ్లు సిద్ధం

న్యూఢిల్లీ: ఇండిగో విమానాల రద్దుతో సతమతమవుతున్న ప్రయాణికులను ఆదుకునేందుకు రైల్వే శాఖ రంగంలోకి దిగింది. విమాన ప్రయాణికుల కోసం శనివారం రైల్వే శాఖ పలుమార్గాల్లో ప్రత్యేక రైళ్లను ప్రవేశపెట్టింది. ఇప్పటికే అందుబాటులో ఉన్న రైళ్లకు అదనపు బోగీలు జత చేసింది. ప్రత్యామ్నాయ రవాణా మార్గాలు తగినన్ని లేక అవస్థలు పడుతున్న విమానయాన ప్రయాణికుల కోసం రైల్వే ఈ చర్య తీసుకుంది. రానున్న రోజుల్లో అవసరాన్ని బట్టి మరిన్ని సర్వీసులు అందుబాటులోకి తేనుంది. సెంట్రల్, వెస్టర్న్, నార్త్ వెస్టర్న్, ఈస్టర్న్ రైల్వే పరిధిలో పలు ప్రత్యేక రైళ్లు అందుబాటులోకి వచ్చాయని రైల్వే అధికారులు తెలిపారు. రద్దీ ఎక్కువగా ఉండే పూణె-బెంగళూరు, పూణె-ఢిల్లీ, ముంబై-న్యూఢిల్లీ, ముంబై-గోవా, లక్నో-ముంబై, నాగపూర్-ముంబై, గోరఖ్‌పూర్-ముంబై మార్గాలలో ప్రత్యేక రైళ్లు అందుబాటులోకి వచ్చాయి. డిసెంబర్ 6న బయలుదేరి డిసెంబర్ 8న తిరుగు ప్రయాణమయ్యేలా తూర్పు రైల్వే హౌరా-న్యూఢిల్లీ రూట్‌లో ప్రత్యేక రైలును ప్రవేశపెట్టింది. పశ్చిమతీరం వెంబడి ముంబై-మడ్గావ్ రూట్‌లో డిసెంబర్ 7న మరో ప్రత్యేక రైలు అందుబాటులోకి రానుంది. హాలిడే, వారాంతాల రద్దీని దృష్టిలో పెట్టుకుని దీన్ని ప్రవేశపెట్టారు. ఎప్పటికప్పుడు డిమాండ్‌ను పరిశీలిస్తూ అదనపు రైళ్లు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. అదనపు రైళ్లతో పాటు ఇప్పటికే అందుబాటులో ఉన్న రైళ్ల సామర్థ్యం పెంచేలా రైల్వే శాఖ అదనపు కోచ్‌లను జోడించింది. రాష్ట్రాల మధ్య నడిచే బెంగళూరు- అగర్తల హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, మంగళూరు-తిరువనంతపురం ఎక్స్‌ప్రెస్, బెంగళూరు-చెన్నై ఎక్స్‌ప్రెస్‌లకు అదనపు ఏసీ బోగీలు జత చేసింది. వివిధ జోన్ల పరిధిలోని 37 రైళ్లకు మొత్తం 116 అదనపు బోగీలు జత చేశామని రైల్వే అధికారులు తెలిపారు. దీంతో, 114 ట్రిప్పుల్లో అదనపు ప్రయాణ సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. ప్రస్తుతం రోజుకు 35 వేల మంది అదనపు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నామని అధికారులు తెలిపారు. డిమాండ్ అధికంగా ఉన్న మార్గాలలో పూర్తిగా ఏసీ కోచ్‌లతో ప్రత్యేక రైళ్లు నిర్వహించే అంశాన్ని కూడా రైల్వే అధికారులు పరిశీలిస్తున్నారు. ఎయిర్ ట్రావెల్‌లో ఇబ్బందులు నెలకొన్న నేపథ్యంలో ప్రతి ప్యాసెంజర్‌కు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి తేవడమే తమ లక్ష్యమని అధికారులు తెలిపారు.

పుతిన్‌కు విందులో శశిథరూర్

కాంగ్రెస్ మండిపాటు

న్యూఢిల్లీ: భారత పర్యటనకు వచ్చిన రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన విందుకు ప్రతిపక్షంలోని రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గేను కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించలేదు. దీనికి బదులుగా ఆ పార్టీ ఎంపీ శశిథరూర్‌ను పిలవడంపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ఈ విందులో పాల్గొనేందుకు శశిథరూర్ అంగీకరించడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందని కాంగ్రెస్ నేత పవన్ ఖేడా శనివారం విమర్శించారు. 'మా నాయకులను ఆహ్వానించలేదు. వాళ్లు ఎందుకు మాతో ఆటాడుతున్నారని అడగాలనుకుంటున్నా. ఎవరో ఆడుతున్న ఆటలో మేము ఎందుకు భాగం కావాలి' అని పవన్ ఖేడా ప్రశ్నించారు. థరూర్‌ను విందుకు ఆహ్వానించడంతో పాటు... అందులో పాల్గొనేందుకు ఆయన అంగీకరించడం తనను ఆశ్చర్యానికి గురిచేసిందన్నారు. ప్రతిఒక్కరికీ మనస్సాక్షి ఉంటుందని వ్యాఖ్యానించారు. ఖేడా వ్యాఖ్యలపై ఎంపీ మనోజ్ తివారీ స్పందిస్తూ పుతిన్‌కు ఇచ్చే విందుకు థరూర్‌ను ఆహ్వానిస్తే... కాంగ్రెస్‌కు సమస్య ఏమిటని ప్రశ్నించారు. ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా విదేశాలకు వెళ్లిన దౌత్య బృందాల్లో ఇతర పార్టీలకు చెందిన ప్రతినిధులు కూడా ఉన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. 'భారత విదేశాంగ విధానాన్ని ప్రతిబింబించేలా ఇతర పార్టీల నాయకులను కేంద్ర ప్రభుత్వం ఆహ్వానించింది. వారిలో కాంగ్రెస్ ఎంపీ థరూర్ ఉన్నారు. ఆ పార్టీకి దీనివల్ల కలిగిన సమస్య ఏంటో నాకు అర్థం కావడం లేదు' అని మనోజ్ తివారీ అన్నారు. ఇటీవల కేంద్రానికి అనుకూలంగా థరూర్ వ్యాఖ్యలు చేస్తున్న సందర్భంగా ఈ విందుకు ఆహ్వానించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఏ ప్రాతిపదికన ఆహ్వానం అందిందనేది తనకు తెలియదని థరూర్ అంతకుముందు అన్నారు. ప్రతిపక్ష నాయకులను ఆహ్వానించకపోవడం సరైనది కాదన్నారు. కొన్ని రోజులుగా థరూర్‌పై సొంత పార్టీ నుంచే విమర్శలు వస్తున్నాయి. ప్రధాని మోదీపై ప్రశంసలు కురిపిస్తూ కేంద్రానికి అనుకూలంగా మాట్లాడటమే అందుకు కారణం. ఇటీవల మోదీ ఓ ప్రైవేటు కార్యక్రమంలో చేసిన ప్రసంగాన్ని మెచ్చుకుంటూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. అభివృద్ధి కోసం భారత్ ఎంత తపనపడాలో, బ్రిటిషు కాలం నాటి మనస్తత్వాన్ని ఎలా వీడాలో మోదీ చెప్పినట్లు వెల్లడించారు. ఎప్పుడూ ఎన్నికల మోడ్‌లో ఉంటానని తనను అందరూ ఆరోపిస్తుంటారని మోదీ చెప్పారని, కానీ ప్రజల సమస్యల విషయంలో ఆయన ఎప్పుడూ భావోద్వేగ భావంతో ఉంటారని రాసుకొచ్చారు. ఈ పోస్టుపై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. బీజేపీ సిద్ధాంతాలు నచ్చితే ఇంకా ఎందుకు కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నారని ఆ పార్టీ నేత, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి షీలా దీక్షిత్ కుమారుడు సందీప్ దీక్షిత్ ప్రశ్నించారు.

చెన్నైలో 15 లక్షల ఓట్ల తొలగింపు?

చెన్నై: చెన్నై జిల్లాలో సుమారు 15 లక్షల ఓట్లు తొలగించనున్నట్లు తెలుస్తోంది. చెన్నై జిల్లా పరిధిలోని 16 శాసనసభ నియోజకవర్గాల్లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) పనులు గత నెల 4వ తేదీన ప్రారంభించారు. 3,718 మంది పోలింగ్ స్టేషన్ అధికారులను నియోజకవర్గాల వారీగా ఇంచార్జి, పర్యవేక్షణ అధికారులుగా నియమించారు. లెక్కింపు ఫారాలు పొందే అంశంపై స్థానిక రిప్పన్ భవనంలో అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఎంకే, ఎండీఎంకే, బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం సహా 12 గుర్తింపు పొందిన పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో అధికారులు మాట్లాడుతూ... చెన్నై జిల్లాలోని 40.04 లక్షల ఓటర్లలో 39.59 మందికి లెక్కింపు ఫారాలు అందజేశామన్నారు. వారిలో 22.79 లక్షల మంది నుంచి ఫారాలు పొందామని తెలిపారు. వారిలో 2.23 లక్షల మంది రెండు ఓట్లు కలిగి ఉన్నట్లు గుర్తించామన్నారు. 1.49 లక్షల మంది మృతిచెందిన జాబితాలో ఉన్నారని తెలిపారు. 8.39 లక్షల మంది శాశ్వతంగా వేరే నియోజకవర్గానికి మారారని, 36,979 మంది స్పందించలేని పరిస్థితుల్లో ఉన్నారని తెలిపారు. ఈ గణాంకాల ప్రకారం 25.99 శాతం మంది ఫారాలు అందించలేదని తెలుస్తుందని, ఈ కారణంగా 10.40 లక్షల నుంచి 15 లక్షల మందిని ఓటర్ల జాబితాల నుంచి తొలగించే అవకాశముందని అధికారులు తెలిపారు.

రూపాయి పతనం లాభమే

మంత్రి నిర్మలా సీతారామన్ ఉవాచ

న్యూఢిల్లీ: భారత రూపాయి విలువ అమెరికా డాలర్‌తో పోలిస్తే గణనీయంగా తగ్గిపోతూ 90.70-91 మార్క్‌ను తాకుతుందని మార్కెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. దీనిపై కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ హిందుస్థాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్‌లో స్పందిస్తూ... రూపాయి విలువ తగ్గడం పూర్తిగా ప్రతికూల పరిణామం కాదని చెప్పుకొచ్చారు. ఈ విధమైన మార్పులు ప్రధానంగా ఎగుమతిదారులకు అనుకూలంగా ఉంటాయని ఆమె పేర్కొన్నారు. రూపాయి పతనం భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపించబోదని, ప్రస్తుతం ఆర్థిక వ్యవస్థ అనేక ప్రాథమిక అంశాలలో బలంగా ఉందని మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. 'రూపాయి కదలికలతో పాటు ఆర్థిక వ్యవస్థ బలాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. కరెన్సీ మార్పుల కారణంగా ఆర్థిక వ్యవస్థ పనితీరు మారదు' అని ఆమె అన్నారు. దేశంలో పొదుపు తగ్గడం, పెట్టుబడులు తగ్గుతున్నాయని వ్యక్తమవుతున్న ఆందోళనలను ఆమె తోసిపుచ్చారు. సంప్రదాయ పొదుపు మార్గాల్లో మార్పులు వస్తున్నా, వాస్తవంగా పొదుపు పెరుగుతూ ఉందని ఆమె చెప్పుకున్నారు. బ్యాంకు రుణాలు మరింత ప్రోత్సహించబడుతున్నాయనీ, ఆస్తులు పెరుగుతున్నాయనీ ఆమె తెలిపారు. అయితే ఈ నెల పొదువునా భారత్-అమెరికా వ్యాపార సంబంధాలు, విదేశీ పెట్టుబడులు, డాలర్ కొనుగోళ్లు వంటి అంశాలు రూపాయి విలువపై ఒత్తిడి తీసుకురావడం ప్రధాన కారణంగా ఉన్నాయని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

కస్టమ్స్‌లో మార్పులే లక్ష్యం

కస్టమ్స్‌ను సరళీకరించడం తమ ప్రభుత్వం ముందున్న తదుపరి ఎజెండా అని నిర్మలా సీతారామన్ అన్నారు. వినియోగాన్ని పెంచేందుకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయపు పన్ను రేట్ల రూపంలో ఊరట, వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) రేట్ల హేతుబద్ధీకరణ వంటి కీలక నిర్ణయాలను ప్రభుత్వం తీసుకుంది. తద్వారా పౌరుల చేతికి నగదు లభ్యతను పెంచింది. ఈసారి కస్టమ్స్ రూపంలో కీలక మార్పులకు శ్రీకారం చుట్టనున్నట్లు నిర్మలా సీతారామన్ వెల్లడించారు. 'కస్టమ్స్‌లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టాల్సిన అవసరం ఉంది. కస్టమ్స్ నిబంధనలు పాటించడం కష్టం కాదని ప్రజలు భావించేలా వాటిని సరళీకృతం చేయాల్సి ఉంది. దీన్ని మరింత పారదర్శకంగా మార్చాలి' అని నిర్మలా సీతారామన్ అన్నారు. కస్టమ్స్‌లో ప్రతిపాదిత సంస్కరణలు సమగ్రంగా ఉంటాయని, కస్టమ్స్ సుంకాల రేట్ల హేతుబద్ధీకరణ కూడా ఉంటుందని చెప్పారు. గడిచిన రెండేళ్లుగా కస్టమ్స్ డ్యూటీని తగ్గించుకుంటూ వస్తున్నామని, ఇంకా కొన్ని రేట్లు ఇంకా ఎగువ స్థాయిలో ఉన్నాయన్నారు. వాటిని తగ్గించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తదుపరి టార్గెట్ అదేనని తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏడు శాతానికి పైనే జీడీపీ వృద్ధిరేటు నమోదయ్యే అవకాశం ఉందని నిర్మలా సీతారామన్ ఆశాభావం వ్యక్తంచేశారు.

లోక్‌సభ ముందుకు డీప్‌ఫేక్ నియంత్రణ బిల్లు

న్యూఢిల్లీ: కృత్రిమమేధ యుగంలో చాలామంది ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యల్లో డీప్‌ఫేక్ ఒకటిగా ఉంది. ఈ డీప్‌ఫేక్ నియంత్రణకు సంబంధించిన బిల్లు లోక్‌సభ ముందుకువచ్చింది. ఇలాంటి కంటెంట్ కట్టడికి అవసరమైన చట్టపరమైన కార్యాచరణ రూపొందించేలా ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రతిపాదించారు. శివసేన ఎంపీ శ్రీకాంత్ షిందే ఈ డీప్‌ఫేక్ బిల్లును ప్రవేశపెట్టారు. ఇలాంటి కంటెంట్ రూపొందించేందుకు వ్యక్తుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరి చేయాలన్నారు. 'వేధింపులు, మోసం, తప్పుడు సమాచారం కోసం డీప్‌ఫేక్‌ను దుర్వినియోగం చేయడం పెరిగిపోయింది. దీని నియంత్రణకు సంబంధించి వెంటనే చర్యలు చేపట్టాలి' అని షిందే అన్నారు. దురుద్దేశంతో ఇలాంటి కంటెంట్‌ను సృష్టించినా లేదా ఫార్వర్డ్ చేసినా... అలాంటివారికి శిక్షలు పడాలన్నారు. వ్యక్తిగత గోప్యత, జాతీయ భద్రత గురించి ప్రస్తావించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో డీప్‌ఫేక్ టెక్నాలజీ సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకూ అందరినీ కలవరపెడుతోంది. ఈ డీప్‌ఫేక్‌ను ఉపయోగించి సైబర్ నేరగాళ్లు తేలికగా మోసాలకు పాల్పడుతున్నారు. ప్రధాని మోదీ కూడా దీనిపై ఆందోళన వ్యక్తంచేశారు. డీప్‌ఫేక్ వీడియోలు సమాజానికి ప్రమాదంగా మారుతున్నాయని వ్యాఖ్యానించారు.

విశాలాంధ్ర హైదరాబాద్

భారత రాజ్యాంగంపై పౌరులకు అవగాహన ఉండాలి : వీఎస్ బోస్

విశాలాంధ్ర , కాప్రా : భారత రాజ్యాంగం పట్ల దేశ పౌరులు అవగాహన పెంపొందించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్. బోస్ అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్. అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఈసీఐఎల్ లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు విఎస్. బోస్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంను అమలు చేయడంలో పాలక వర్గాలు విఫలం చెందారని వారు ధ్వజమెత్తారు. రాజ్యాంగంలో పొందు పరిచిన ఆదేశిక సూత్రాలను మార్చడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నదని, అది బీజేపీ దాని అనుబంధ సంస్థలు ఆర్ఎస్ఎస్ తరం కాదని అన్నారు. 140కోట్ల దేశ ప్రజలు ఆరాధించే గ్రంథం ఏదైనా ఉంది అంటే అది భారత రాజ్యాంగం అని, అటువంటి గ్రంథాన్ని మార్చే ప్రయత్నాలు చేస్తే కాలగర్భంలో బీజేపీ కలిసిపోతుందని వారు ధ్వజమెత్తారు. భారత రాజ్యాంగం కల్పించిన అన్ని హక్కులను ప్రజలకు సమానంగా పంచాలని వారు పాలకులను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్, ఉప్పల్ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు లక్ష్మీ నారాయణ, మిరియాల సాయిలు, ఏఐవైఎఫ్ నాయకులు రాజ్ కుమార్, అక్బర్, భరత్, ప్రతాప్, విజయ్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు అంబేద్కర్ : ఎమ్మెల్యే నవీన్ యాదవ్

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి, భారతరత్న, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, చీకటి బతుకులకు వెలుగులు నింపిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, వర్ధంతి సందర్భంగా నేడు నియోజకవర్గ లో ఉన్న వివిధ డివిజన్ లో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ పూలమాలతో నివాళులు అర్పించి వారిని స్మరించుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అంబేద్కర్ గారి ఆలోచనలు కేవలం దళితులకు మాత్రమే కాదు. ఆయన దేశ ప్రగతి మొత్తానికి పునాదులు వేశారని, పేద, ధనికా, కుల, మత, తేడా లేకుండా అందరికీ ఒకే ఓటు విలువ ఉండాలని పోరాడి సాధించిన మహనీయుడు అని కొనియాడారు. డిసెంబర్ తారీఖు నాడు ఆయన భౌతికంగా మనకు దూరమైన, ఆయన వేసిన రాజ్యాంగ బాటలో భారతదేశం ఎప్పుడు ముందుకు నడుస్తూనే ఉంటుందని ఎమ్మెల్యే నవీన్ యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సి.ఎన్ రెడ్డి, భవాని శంకర్, అంబేద్కర్ వాదులు, మహిళలు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని కస్తూర్బా నగర్‌లో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, కార్పొరేటర్ వై.ప్రేమ్ కుమార్ పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సామాజిక వివక్షగురించి బాగా తెలిసిన వ్యక్తిగా రాజ్యాంగంలో పౌరమక్కులకు మొదటి ప్రధాన్య ఇచ్చారని, వాటిని న్యాయ స్థానాల రక్షణ కల్పించారు. ప్రతి పౌరునికి భావప్రకటనా స్వేచ్ఛ ఇస్తూ ఆర్టికల్ 19 రూపొందించరన్నారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ప్రాథమిక హక్కులను పార్లమెంట్ ఉల్లంఘించే పరిస్థితి లేకుండా చేశారన్నారు. దేశంలో మత, కుల, లింగ వివక్ష లేకుండా అందరూ సమానంగా జీవించే స్వేచ్ఛనిస్తూ దాన్ని రాజ్యాంగబద్ధం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సత్యమూర్తి, బాబు సత్యనారాయణ సంపత్ రావు కిషోర్, వినోద్ యాదవ్ ,బ్రహ్మయ్య, రామక్రిష్ణ, శివాజీ,మంద భాస్కర్, మైమున బేగం, జన్ బి,షకీల్, తదితరులు పాల్గొన్నారు.

నిజాయితీకి నిలువుటద్దం రంగాచార్యులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : నీతి, నిజాయితీకి నిలువుటద్దం రంగాచార్యులు అని పలువురు వక్తలు కొనియాడారు. మరింగంటి రంగాచార్యులు సంస్మరణ సభ శనివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ జర్నలిస్టు హేమసుందర్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు మాట్లాడుతూ రంగాచార్యులు గొప్ప స్నేహశీలి అని, జర్నలిస్టులకు ఆత్మీయ బంధువని, రంగాచారిలేని లోటు తీర్చలేనిదన్నారు. తెలంగాణ రాష్ట్ర జర్నలిస్టు సంఘంతోను, హైదరాబాద్ జర్నలిస్ట్ యూనియన్, హైదరాబాద్ ప్రెస్ క్లబ్‌తోను ఎంతో అనుబంధం ఉందని వక్తలు తమ అభిప్రాయం వెలిబుచ్చారు. ఈ సంస్మరణ సభలో సీనియర్ పాత్రికేయులు ఆర్ వి రామారావు, టెక్ మహీంద్ర లా విశ్వవిద్యాలయం డీన్, సీనియర్ పాత్రికేయులు మాడభూషి శ్రీధర్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు విరాహత్ అలీ, చిన్న పత్రికల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ బాబు, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు విజయ్ కుమార్ రెడ్డి, కార్యదర్శి వరికుప్పల రమేష్, వెటరన్ జర్నలిస్ట్ సంఘం కోశాధికారి ఎన్ శ్రీనివాసరెడ్డి, సీనియర్ జర్నలిస్టులు రాంలాల్, ఎం మల్లయ్య, రమణరావు, వెలిజాల చంద్రశేఖర్, సీతారామ్, బుద్దా మురళి, శ్రీరాంజీ, మూర్తి, అబ్దుల్, అజీజ్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రంగచార్యులు కుటుంబ సభ్యులు కుమార్తె పల్లవి, కుమారుడు వంశీ మోహన్ మనుమలు పాల్గొన్నారు.

మహానుభావుడు అంబేద్కర్ : భట్టి విక్రమార్క

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఒక సామాన్యునికి బలమైన ఓటు హక్కు అనే ఆయుధం ఇచ్చి వారి భవిష్యత్తును వారే రాసుకునే విధంగా ఏర్పాటు చేసినటువంటి మహానుభావుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ప్రతి ఒక్కరూ కూడా ఓటు హక్కు ద్వారా వారికి కావలసిన వారిని ఎన్నుకొని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకునే వారి భవిష్యత్తును వారే రాసుకునే అవకాశం కల్పించిన మహానుభావుడు భారతదేశంలో పుట్టడం మనందరి అదృష్టంగా భావిస్తున్నాం అన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచనలు రాష్ట్ర ప్రభుత్వ పాలనకు మార్గదర్శకాలు భవిష్యత్తులో కూడా రాష్ట్రానికే కాదు దేశానికే ఆయన ఆలోచనలు మార్గదర్శకం అన్నారు వారి ఆలోచనల మేరకు నడవడమే ఈ దేశానికి గొప్ప భవిష్యత్తు అన్నారు. ప్రపంచంలోనే పెద్ద ప్రజాస్వామ్య దేశానికి అత్యంత బలమైన, అద్భుతమైన రాజ్యాంగాన్ని అందించిన మహానుభావుడు అంబేద్కర్ అన్నారు. అంబేద్కర్ ఆలోచనలు, ఆయన మార్గాన్ని తీసుకొని రేపటి భవిష్యత్తు కోసం ఈ దేశ ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడానికి అసమానతలు లేని సమాజం కోసం ఈ దేశ ఆర్థిక, సామాజిక, భౌతిక వనరులన్నిటిని సక్రమంగా సమానంగా ఈ దేశంలోని వారందరికీ పంచడం, మనం అందరం ఆయన మార్గంలో ప్రయాణం చేయడం వారికి అర్పించే ఘనమైన నివాళులన్నారు.

అంబేద్కర్ గుర్తులు లేకుండా చేసేందుకు కేంద్రం కుట్ర : ఏఐటీయూసీ

విశాలాంధ్ర - హైదరాబాద్ : కేంద్రంలోని ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం దేశంలో రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆనవాళ్లు లేకుండా చేసేందుకు కుట్రలు పన్నుతున్నదని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి పి.సురేష్ మండిపడ్డారు.డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా ఏఐటియుసి ఆధ్వర్యంలో మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని న్యూ బస్టాండ్ సమీపంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పి. సురేష్ మాట్లాడుతూ:- కేంద్ర ప్రభుత్వం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ని స్మరిస్తూనే మరోపక్క భారత రాజ్యాంగ వ్యవస్థను విధ్వంసం చేస్తూ సార్వభౌమాధికారాన్ని ప్రజాస్వామ్య మూలాలను అంతం చేసేందుకు యత్నిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలనరంగంలో మను ధర్మ సిద్ధాంతాన్ని చొప్పిస్తూ ప్రజల మత సామరస్యానికి విఘాతం కలిగిస్తూ మత ఘర్షణలను రేపుతుందని అన్నారు. అంబేద్కర్ స్ఫూర్తితో అసమానతలు లేని వ్యవస్థకు పోరాటం సాగిస్తామని అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం ఏఐటియుసి నేత గోపాల్ నాయక్ మాట్లాడుతూ కుల,మత ,ప్రాంత, లింగ బేధం లేకుండా అందరికీ సమాన హక్కులు కల్పించిన ఘనత అంబేద్కర్ దన్నారు. నేటి ఆధునిక కాలంలో అంటరానితనం అస్పృశ్యత దళితులపై గిరిజనులపై దాడులు దౌర్జన్యాలు కొనసాగడం ఇంతో విచారకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు బి.చెన్నయ్య, గోపాల్ నాయక్, ఖాదర్, యాదయ్య, భీమయ్య, చెన్నయ్య, గోపి, రంగయ్య, మేస్త్రి రామకృష్ణ పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

విశాలాంధ్ర, హైదరాబాద్ : డా.బి.ఆర్.అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా హైదరాబాద్ రాష్ట్ర పార్టీ కార్యాలయం ఎన్.టి.ఆర్ భవన్‌లో రాష్ట్ర పార్టీ నాయకులు డా. బి.ఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షులు పొలంపల్లి అశోక్, మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సంధ్య, పోగు రాజశేఖర్, మాజీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గుడెపు రాఘవులు, కల్వకుర్తి నాయకులు యాదిలాల్, టిఎన్‌టియుసి రాష్ట్ర నాయకులు జగదీష్, జూబ్లీహిల్స్ డివిజన్ నాయకులు నర్సింహులు, కల్వకుర్తి నియోజకవర్గ పార్టీ నాయకులు సత్యం, నరసింహ, రాష్ట్ర కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు సీపీఐ నేతల నివాళి

విశాలాంధ్ర, హైదరాబాద్ : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యాలయం మగ్దూంభవనలో ఆయన చిత్రపటానికి సిపిఐ జాతీయ కార్యదర్శి కే.రామకృష్ణ, సిపిఐ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఈటి నరసింహ, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఛాయాదేవి, తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్, సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, ఎస్.టి.యు.రాష్ట్ర అధ్యక్షుడు సదానంద గౌడ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.శ్రీకాంత్, ఏఐటియుసి నాయకులు బొడ్డుపల్లి కిషన్, వెంకటయ్య, ఆఫీస్ కార్యదర్శి గోవింద్, బోయ శ్రీరాములు, మన్నె రాజేందర్, శివకుమార్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ కె ఫౌండేషన్‌తో కలిసి సీఆర్ పాలీ క్లినిక్

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: బసీఆర్ హెూమ్ ఫర్ ది ఏజ్డ్ (వృద్ధాశ్రమం) లో నివసిస్తున్న సీనియర్ సిటిజన్ల కోసం ఒక ఆర్థోపెడిక్ వైద్య శిబిరాన్ని ఈరోజు నిర్వహించింది. కిమ్స్ హాస్పిటల్స్ ఆర్థో విభాగాధిపతి డాక్టర్ అన్నే సాయి లక్ష్మణ్ (రోబోటిక్ సర్జన్), డాక్టర్ టి మోహిత్ ఎంఎస్ (ఆర్థో) మరియు డాక్టర్ అనూషతో కలిసి ఆశ్రమవాసులకు వారి విలువైన సేవలను అందించారు. ఈ సందర్భంగా ఎముక సాంద్రత పరీక్షలు, జరిగాయి. దాదాపు 72 మంది ఆశ్రమవాసులు ఈ సేవలను పొందారు. సిఆర్ ఫౌండేషన్ గౌరవ ఛైర్మన్ డాక్టర్ కే. నారాయణ, డాక్టర్ అన్నే సాయి లక్ష్మణ్, డాక్టర్ టి మోహిత్, డాక్టర్ అనూష మరియు సిబ్బందికి సిఆర్ ఫౌండేషన్ ఆశ్రమవాసులకు అందించిన విలువైన సమయం మరియు సేవలకు కృతజ్ఞతలు తెలిపారు. నాగరాజు, క్రాంతి(బిడిఎం అసిస్టెంట్). స్వామి, ఫోటోగ్రాఫర్ శిబిరంలో పాల్గొన్నారు. సీఆర్ ఫౌండేషన్ గౌరవ ఛైర్మన్ డాక్టర్ కె నారాయణ, ట్రెజరర్, హెూమ్ డైరెక్టర్ వి చెన్నకేశవ రావు, హెల్త్ డైరెక్టర్ డాక్టర్ కె రజని ఈ శిబిరం విజయవంతం కావడానికి సహాయం చేసిన మొత్తం సిబ్బంది, వాలంటీర్లకు ధన్యవాదాలు తెలియజేశారు. వైద్య శిబిరాన్ని డాక్టర్ కె రజని (డైరెక్టర్ సిఆర్ పాలీ క్లినిక్) ప్రారంభించారు సిఒఒ కె. విజయ పర్యవేక్షించారు.

అంబేద్కర్‌కు నివాళి

విశాలాంధ్ర, మల్కాజిగిరి : మల్కాజిగిరి అసెంబ్లీ పరిధిలోని ఆనంద్‌బాగ్ చౌరస్తాలో అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం బీసీ రిజర్వేషన్ల కోసం ఆత్మబలిదానం చేసుకున్నసాయి ఈశ్వర చారికి బహుజన కులాల చైతన్య వేదిక నాయకులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వగ్గు చంద్రశేఖర్ రావు, పూలపల్లి సుందర్ యాదవ్, కరణం గోపి, జీడి నవీన్ గౌడ్, అప్పాల శ్రీనివాస్, కాసర్ల నాగరాజు, జోగు శ్రీనివాస్, పిట్టల భాస్కర్, గుంటి భీమ్ రాజ్, శ్రీకాంత్ యాదవ్, చుక్క సుధాకర్ పటేల్, లక్ష్మణ్, ఈశ్వర్, బాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెగా రీసో ఫాస్ట్ టెస్ట్‌ను రద్దు చేయాలి : ఏఐవైఎఫ్

విశాలాంధ్ర, హైదరాబాద్ : విద్యాశాఖ నిబంధనలకు విరుద్ధంగా డిసెంబర్ 14న జరగనున్న మెగా రీసో ఫాస్ట్(టాలెంట్ టెస్ట్) ను రద్దు చేయాలని, రీసోనెన్స్ విద్యాసంస్థపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) హైదరాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్ జిల్లా విద్యాశాకాధికారి(డీఈఓ) రోహిణికు ఏఐవైఎఫ్ బృందం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్ ఈజ్ మాట్లాడుతూ విద్యాహక్కు చట్టం ప్రకారం విద్యార్థులకు ఎటువంటి టాలెంట్, మెరిట్, స్కాలర్‌షిప్ టెస్టులను విద్యా వ్యాపారంగా నిర్వహించొద్దని ఆదేశాలు ఉన్నా, కేవలం వ్యాపారమే ధ్యేయంగా కార్పొరేట్ విద్యాసంస్థలు వ్యవహరిస్తున్నాయని ధ్వజమెత్తారు. 5-10వ తరగతి విద్యార్థులకు ఈ పరీక్షను నిర్వహిస్తున్నారని, అయితే ఈ పరీక్ష రాయడానికి రూ.300లు ఎంట్రన్స్ ఫీజు రూపంలో వసూళ్లు చేయడాన్ని వారు వ్యతిరేకించారు. డిసెంబర్ 14న ఈ పరీక్షను రీసోనెన్స్ జూనియర్ కళాశాలల్లో, గుర్తింపు లేని రీసోనెన్స్ పాఠశాలల్లో నిర్వహించనున్నారని, ఈ పరీక్షను ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో అడ్డుకుంటామని వారు హెచ్చరించారు. అదేవిధంగా రీసోనెన్స్ విద్యాసంస్థకు నిజంగా విద్యార్థులు వారి తల్లిదండ్రుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఉచితంగా నిర్వహించొచ్చుకదా అని ప్రశ్నించారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచించాలని రీసోనెన్స్ లాంటి మోసపూరిత విద్యాసంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రీసోనెన్స్ టాలెంట్ టెస్ట్ కు సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ జేడీ. లక్ష్మీ నారాయణ ప్రమోట్ చేయడం సిగ్గుచేటని, మరి ఈ విద్యాసంస్థల్లో పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు ఉచితంగా అభ్యసించడానికి లక్ష్మీ నారాయణ హామీ ఇవ్వగలడా అని వారు డిమాండ్ చేశారు. ఈ వినతి కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సత్య ప్రసాద్, నేతలు అనీల్ కుమార్, అరుణ్ పాల్గొన్నారు.

డీఈఓ వివరణ...

రీసోనెన్స్ విద్యాసంస్థ నిర్వహిస్తున్న టాలెంట్ టెస్ట్ కు ఎలాంటి అనుమతులు లేవని, తల్లిదండ్రులు మోసపోవద్దని వారు అన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ఎటువంటి టాలెంట్, మెరిట్, స్కాలర్ షిప్ టెస్టులు నిర్వహించొద్దని ఆదేశాలు ఉన్నాయని, వాటిని భేఖాతారు చేస్తే ఎటువంటి విద్యా సంస్థకైనా కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఈ అనధికార పరీక్ష నిర్వహిస్తున్న రీసోనెన్స్ విద్యాసంస్థకు నోటీసులు జారీ చేస్తామని అన్నారు.

క్రీడారంగం అభివృద్ధికి ప్రత్యేక కృషి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - హైదరాబాద్ : క్రీడా రంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రతిభావంతులైన యువ క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్నామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో వారణాసిలో జరిగిన అండర్-14, 69వ జాతీయ ఆర్చరీ చాంపియన్షిప్‌లో మహబూబ్ నగర్ జిల్లా యువ ఆర్చర్లు అద్భుత ప్రతిభ కనబరిచి, జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి, , బంగారు పతకాలు సాధించిన సందర్భంగా ఎమ్మెల్యే వారిని తన క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "మహబూబ్ నగర్ నుండి దేశ స్థాయిలో ప్రతిభ ప్రదర్శించినందుకు మాకు గర్వకారణంగా ఉందన్నారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు, ప్రోత్సాహం అందించేందుకు ప్రభుత్వం తరఫున నేను కృషి చేస్తాను" అని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే యువ క్రీడాకారులను ఆత్మీయంగా మాట్లాడి, వారి విజయాలకు శుభాకాంక్షలు తెలుపుతూ మరింత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, ఆర్చరీ కోచ్ జ్ఞానేశ్వర్, ఆర్చరీ క్రీడాకారులు జి. సమీక్ష , శార్వాణి, డి.సమీక్ష , ఇషా సిద్దిఖి, సాయి మనీశ్వర్, శ్రావణి, కృతిక్ శ్రీవాత్సవ, స్మృతి సన్నిబా తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు ఘన నివాళి

విశాలాంధ్ర, హైదరాబాద్ : ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా లోయర్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి సీపీఐ హైదరాబాద్ కౌన్సిల్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఈటి నరసింహ మాట్లాడుతూ డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కేవలం రాజ్యాంగ రచనకే పరిమితం చేయటం సముచితం కాదన్నారు. అనేక రంగాల్లో విస్తృతంగా కృషిచేసిన మేధావి బాబాసాహెబ్ అంబేద్కర్. స్వయంగా రెండు పత్రికలకు ఎడిటర్‌గా ఉంటూ జర్నలిస్టుగా కొనసాగాడు. అనేక పుస్తకాలు రాసిన రచయితగా, న్యాయవాదిగా, కళాశాల ప్రిన్సిపాల్ గా సేవలు అందించారు. బహుముఖ ప్రజ్ఞా శాలి. కార్మిక హక్కుల కోసం అనేక పోరాటాలను చేశాడు. స్వయంగా కార్మిక మంత్రిగా ఉన్నప్పుడు పరిశ్రమలలో 12 గంటల పని విధానం ఇక రద్దు అని 8 గంటల పని విధానాన్ని అమలు చేయిం చాడు. అదేవిధంగా కర్మాగారాలలో పని చేస్తున్న మహిళలకు ప్రసూతి సమయంలో వేతనంతో కూడిన సెలవులు ఇవ్వటం జరిగింది. పనిచేస్తున్న చోట వారి పిల్లలకు సౌకర్యాలు కల్పించాలని, సామాజిక భద్రత తో పాటు వేతనాల అమలు కోసం, కనీస వేతనాల కోసం కృషి చేశాడు. అనేక రంగాలలో హక్కులు సాధించడంలో క్రియాశీలకమైన పాత్ర పోషించటం జరిగింది. నేడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడులను తీసుకువచ్చి కార్మిక హక్కులను కాల రాస్తున్నది .కాలం చెల్లిన 12 గంటల విధానాన్ని తిరిగి తీసుకువస్తూ కార్మికులను యాజమాన్యాలు మరింత దోపిడీ చేసుకోవడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నది. అందులో భాగంగానే లేబర్ కోడ్ అమలుకు నోటిఫికేషన్ కూడా విడుదల చేయడం జరిగింది. కార్మికులు సమ్మెలు చేయటానికి వీలు లేకుండా ,సంఘాలు పెట్టడానికి అవకాశం లేకుండా కేంద్ర ప్రభుత్వం చట్టాలు తీసుకొచ్చింది. ఇలాంటి కార్మిక వ్యతిరేక విధానాల పైన దేశ ప్రజలు పోరాటాలను పదును పెట్టి ఉద్యమాలు కొనసాగించాలని పిలుపు నివ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు ఛాయాదేవి సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ జిల్లా కార్యవర్గ సభ్యులు నేర్లకంటి శ్రీకాంత్ కౌన్సిల్ సభ్యులు నరేష్ గ్యార, అనిల్ కుమార్, నాయకులు ఉప్పల ఉదయ్ కుమార్,రాజు ,అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయసాధనకు కృషి చేయాలి

విశాలాంధ్ర, హైదరాబాద్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాల్సిన అవసరం ఉందని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రామ్ యాదవ్ పేర్కొన్నారు. భారత నవనిర్మాణ పితామహుడు, భారత నవనిర్మాణ జాతిపిత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతిని పురస్కరించుకొని గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని ఇందిరా నెహ్రూ నగర్, జయగిరి లక్ష్మీనరసింహస్వామి నగర్, మల్లికార్జున నగర్, న్యూ వెంకటేశ్వర నగర్, మిర్జాలగూడ తదితర ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమంలో కార్పొరేటర్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, భైరు అనిల్, నాయకులు, కార్యకర్తలు, మహిళా నేతలు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎన్నికలకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర, హైదరాబాద్ : ఏపీ మహేష్ అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ల ఎన్నికలను సజావుగా, ప్రశాంతవాతావరణంలో నిర్వహిం చేందుకు అన్ని ఏర్పాటు పూర్తి చేశామని ఇంచార్జీ కలెక్టర్ మను చౌదరి తెలిపారు. శనివారం నాంపల్లిలోని కమలా నెహ్రూ పాలిటెక్నిక్, సరోజినీ నాయుడు వనిత మహా విద్యాలయలలో చేపట్టిన ఏర్పాట్లను, పోలింగ్ బూతులను, పోలింగ్ బ్యాక్సులను పోలింగ్ సామాగ్రిని పంపిణీ ప్రక్రియను, బ్యాలెట్ పత్రాలను క్షుణంగా జిల్లా రెవెన్యూ అధికారి ఈ . వెంకటాచారి, పోలీసు అధికారులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహేష్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ల కోసం నెల 7న ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సర్వం సిద్ధం చేశామని, ఎన్నికలు ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని అన్నారు. ఆయా ప్రాంతాల్లో సుమారు 37 వేల 142 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, మొత్తం 78 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇందులో భాగంగా హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, కమలా నెహ్రూ పాలిటెక్నిక్ , సరోజినీ నాయుడు వనిత మహా విద్యాలయలో 68 పోలింగ్ కేంద్రాలు, అలాగే మహారాష్ట్ర, రాజస్థాన్, ఆంధ్ర ప్రదేశ్ తో పాటు తెలంగాణలోని మూడు జిల్లాలలో కలుపుకొని 10 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికలు జరుగు నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలవద్ద అవసరమైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని కలెక్టర్ తెలిపారు. పోలింగ్ సామాగ్రీను పంపిణీ పూర్తి చేశామని, ఎన్నికలు సజావుగా, ప్రశాంత వాతవరణంలో సమర్థవంతంగా జరుపుటకు సరిపడా సిబ్బందిని నియమించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ ఆర్‌డిఓ సాయిరాం, సెంట్రల్ జోన్ అడిషనల్ డిసిపి ఆనంద్, ఎసిపి ప్రవీణ్ కుమార్, లా ఆఫీసర్ శ్రీధర్, స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజి స్ట్రేట్ జ్యోతి, డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ ఆఫీసర్ ప్రసన్న, తహసీల్దార్ నయీముద్దీన్, సిఐ భరత్ కుమార్, రెవెన్యూ అధికారులు తదితరలు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళి

విశాలాంధ్ర, జూబ్లీహిల్స్ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా బషీర్ బాగ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు నగేష్ ముదిరాజ్ వారికి ఘన నివాళు లర్పించారు.

కుటుంబ అభివృద్ధే లక్ష్యం :వెంకటేష్‌గౌడ్

విశాలాంధ్ర - మొయినాబాద్ : గ్రామాభివృద్ధి నా లక్ష్యం... మీరు ఒకసారి అవకాశం ఇవ్వండి పనిచేసి చూపిస్తానని బాకారం గ్రామ సర్పంచ్ అభ్యర్థి ఎల్గని వెంకటేష్ గౌడ్ అన్నారు. శనివారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను తనకు ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ప్రతీ కుటుంబం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. తాగునీరు, నాణ్యమైన వీధిలైట్లు, సిమెంట్ రోడ్లు, స్వచ్ఛగ్రామ పథకం అమలు, కాలువల మరమ్మత్తులు, చెత్త సేకరణ నిరంతర సేవలు, వృద్ధులు వికలాంగులకు సులభమైన ఫించన్ సేవలు, మహిళా సంఘాల బలోపేతం వంటివి తన ప్రాధాన్యతల జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించి ప్రతి కుటుంబం అభివృద్ధి చెందేలా పనిచేస్తానని హామీ ఇచ్చారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: గచ్చిబౌలి డివిజన్ నేతాజీ నగర్ కాలనీ అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్ విన్నపం మేరకు కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి జీహెచ్ఎంసి అధికారులు ఇంజనీరింగ్ డిపార్ట్మెంట్ సిబ్బంది ద్వారా కాలనీలో నెలకొన్న సమస్యలను పర్యవేక్షించి త్వరలోనే పూర్తి చేస్తామని, సీసీ రోడ్డు అండ్ డ్రైనేజీ త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. కాలనీలో నెలకొన్న సమస్యలకు మౌలిక వసతులకై కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డికి దగ్గరుండి కాలనీలో వీధి వీధి తిరుగుతూ అన్ని సమస్యలను విన్నవించిన కాలనీ అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్. ఈ సందర్భంగా అన్ని సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు రాయుడు, రవి నాయక్, తెలుగు సుభాష్ ముదిరాజ్, సాయిబాబా ఆలయ ప్రధాన అర్చకులు జోషి రాఘవేంద్ర శర్మ,, మహిళలు రాధా రాణిరెడ్డి, చిట్టెమ్మలాల్ రెడ్డి, బేరి శ్రీనివాస్ యాదవ్, రాజు, శంకరయ్య, జోసఫ్, నాగరాజు, జీహెచ్ఎంసి సూపర్వైజర్ లక్ష్మణ్, ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్ చరణ్ నాయక్, పాల్గొన్నారు.

కార్మికుడి ప్రాణాలు కాపాడిన అమోర్ ఆస్పత్రి వైద్యులు

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: నగరంలో నిర్మాణంలో ఉన్న ఒక భవనం మూడో అంతస్తు నుంచి నవీన్ కుమార్ అనే ఓ భవన నిర్మాణ కార్మికుడు ప్రమాదవశాత్తు పడిపోయాడు. అతడి ఊపిరితిత్తుల్లోకి ఇనుప రాడ్లు గుచ్చుకుపోయి, వాటికి రంధ్రం పడింది. అయినా సరే.. ఆ కార్మికుడికి అమోర్ ఆస్పత్రి వైద్యులు రికార్డు సమయంలో అత్యవసర శస్త్రచికిత్స చేసి, అతడి ప్రాణాలు నిలబెట్టారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. 42 ఏళ్ల వయసున్న నవీన్ కుమార్‌ను ఆస్పత్రికి తీసుకొచ్చేసరికి అతడి శరీరం నుంచి రెండు ఇనుప రాడ్లను తొలగించాల్సి ఉంది. అప్పటికే అతడు స్పృహ కోల్పోయాడు, అతడి రక్తపోటు కేవలం 50/30 మాత్రమే ఉంది. ఇక ఆక్సిజన్ శాచ్యురేషన్ అయితే కనీసం లెక్కలకు కూడా అందనంత తక్కువగా ఉంది. అతడి హృదయం వద్ద పెద్ద గాయం ఉండడం, అందులోంచి గుండె, ఊపిరితిత్తులు కూడా కనిపిస్తుండడం, దాదాపు 2-3 లీటర్ల వరకు రక్తం పోవడం, ఊపిరితిత్తులకు-ఛాతీ గోడకు మధ్య రక్తం గడ్డకట్టడం, ఊపిరితిత్తులకు రంధ్రం పడడం... ఇన్ని సమస్యలు అతడికి ఉన్నాయి. వైద్యులు అతడికి అత్యవసరంగా థొరకాటమీ శస్త్రచికిత్స చేశారు. అతడి ఎడమ ఊపిరితిత్తిలోని శ్వాసకోశం పూర్తిగా ధ్వంసమైపోయింది. దీంతో దాన్ని తొలగించాల్సి వచ్చింది. కానీ రక్తస్రావం చాలా ఎక్కువగా ఉండడంతో నవీన్ రక్తపోటు మరింతగా పడిపోసాగింది. ఫలితంగా రక్తం మరింత ఎక్కించారు. ఒక ఊపిరితిత్తి మాత్రమే పనిచేస్తుండడంతో దాన్ని రక్షించేందుకు వెంటిలేషన్ వ్యూహాలను అమలుచేశారు. అతడికి ఆక్సిజన్ ఏమాత్రం అందకపోతున్నా మెదడు, ఇతర కీలక అవయవాలు ఏవీ దెబ్బతినకుండా వైద్యబృందం చాలా కష్టపడింది. ఈ కేసు సంక్లిష్టత గురించి అమోఆర్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్, ఆర్థో ఆంకాలజీ సర్జన్ డాక్టర్ కిశోర్ బి. రెడ్డి మాట్లాడుతూ, 'మేం చికిత్స చేసిన వాటిలో ఇది అత్యంత సంక్లిష్టమైన, సమస్యాత్మకమైన ట్రామా కేసు. నవీన్‌కు తగిలిన గాయాలన్నీ ప్రాణాంతకమే. ప్రతి నిమిషం చాలా విలువైనది. దాంతో మా అత్యవసర, సర్జికల్, ఎనస్థీషియా, క్రిటికల్ కేర్ బృందాల్లోని వైద్యులందరూ అద్భుతమైన సమన్వయంతో పనిచేసి అతడి ప్రాణాలు కాపాడారు. ప్రపంచస్థాయి ట్రామాకేర్ సదుపాయాలు, సరైన సమయానికి చికిత్స అందించాం అనడానికి అతడి ప్రాణాలు నిలబడడమే నిదర్శనం. ఇప్పుడతడు కోలుకుని సాధారణ జీవితం గడపడం మాకెంతో ఆనందాన్నిస్తోందన్నారు.

భారతీయ ప్రాచీన వైద్య విధానాలకు పూర్వవైభవం తథ్యం: ఆలే శ్యామ్ కుమార్

విశాలాంధ్ర శేరిలింగంపల్లి: బభారత్ లో ప్రాచీన వైద్య విధానాలకు తిరిగి ఆదరణ లభిస్తుండటం శుభ సూచకమని అఖిల భారత ధర్మ జాగరణ సహ ప్రముఖ్ ఆలే శ్యామ్ కుమార్ పేర్కొన్నారు. కొండాపూర్ రాజరాజేశ్వర నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయుఃవృద్ధి హెూమియోపతిక్ అండ్ వెల్‌నెస్ క్లీనిక్‌ని ఆయన లాంఛనంగా ప్రారంభించి, సంస్థ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయుఃవృద్ధి వ్యవస్థాపకురాలు డాక్టర్ సింధు భైరవి, ఫైనాన్స్ డైరెక్టర్ మనోహరి, మ్యూజిక్ థెరపిస్ట్ వశిష్ట రామ్, సలహాదారులు చింతకింది గోవర్ధన్ గౌడ్ లను ఆలె శ్యామ్ కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. శేరిలింగంపల్లి ప్రాంత వాసులకు అధునాతన హెూమియోపతి సేవలతో పాటు న్యూట్రిషనల్, యోగ, మ్యూజిక్ థెరపిలను అందుబాటులోకి తీసుకురావడం ఆహ్వానించదగ్గ విషయమని అన్నారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఒకవేళ అనారోగ్యం బారిన పడ్డప్పుడు ప్రాథమిక దశలోనే ఆయుర్వేదం, హెూమియోపతి లాంటి సాంప్రదాయ వైద్యంను ఎంచుకోవాలని సూచించారు. భారతీయ జీవన విధానంలో ప్రాచీన వైద్య విధానాలు ఎన్నో అందుబాటులో ఉండేవని అందులో విశిష్టమైనది మ్యూజిక్ థెరపీ అని అన్నారు. రాగాలను ఉపయోగించి రోగాలను నయం చేసే ప్రాచీన పద్ధతి కాలక్రమంలో కనుమరుగైనప్పటికీ ఇటీవల మళ్లీ ప్రాధాన్యతను సంతరించుకోవడం గొప్ప విషయమన్నారు. కరోనా తర్వాత మన ప్రాచీన సాంప్రదాయ వైద్య విధానానికి తిరిగి ఆదరణ లభిస్తుండడం, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు దక్కడం మనకెంతో గర్వకారణమని అన్నారు. వెల్‌నెస్ సెంటర్ లోని వివిధ విభాగాలను అతిథులుగా విచ్చేసిన రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ నందకుమార్ యాదవ్, రిటైర్డ్ AGM బాల్ద అశోక్, యోగా శిక్షకులు, సీనియర్ జర్నలిస్ట్ పుట్ట వినయ్ కుమార్ గౌడ్, ప్రముఖ వ్యాపారవేత్త రాఘవేంద్రరావులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలు, ప్రజా, సంక్షేమ సంఘాల నాయకులు, స్థానికులు హెూమియో వైద్య ప్రియులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యూరోపియన్ యూనియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ప్రారంభం

విశాలాంధ్ర - హైదరాబాద్ : 30వ యూరోపియన్ యూనియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు హైదరాబాద్ వేదికగా శుభారంభం లభించింది. జెల్లె డి జోంగే దర్శకత్వంలో వచ్చిన డచ్ చిత్రం మెమరీ లేన్ తొలి ప్రదర్శనగానే ప్రేక్షకుల నుంచి ఉత్సాహభరిత స్పందన అందుకుంది. ఈసారి హైదరాబాద్ చాప్టర్‌లో, భారతదేశంలో యూరోపియన్ సినిమాల అతి పెద్దది, అత్యంత వైవిధ్యభరితమైన ఎంపికను ప్రదర్శిస్తున్నారు. పలు భాషల్లో రూపొందిన ఈ చిత్రాలు వ్యక్తిత్వం, కుటుంబం, ధైర్యం, మానవత్వం, ఆశ వంటి అంశాలను ఆవిష్కరిస్తాయి. హైదరాబాద్‌లో జరుగుతున్న ఈయూఎఫ్ ఎఫ్ 2025లో ఆస్ట్రియా, బెల్జియం, బల్గేరియా, క్రొయేషియా, సైప్రస్, డెన్మార్క్, ఫిన్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, హంగేరీ, ఐర్లాండ్, లాట్వియా, లిథువేనియా, లక్సెంబర్గ్, మాల్టా, నెదర్లాండ్స్, పోలాండ్, రొమేనియా, స్లోవాకియా, స్లోవేనియా, స్వీడన్, స్పెయిన్, ఉక్రెయిన్‌మొత్తం 23 దేశాల నుంచి వచ్చిన 23 చిత్రాలు ప్రదర్శించబడనున్నాయి. హైదరాబాద్‌లో ఫెస్టివల్‌కు లభించిన అద్భుత స్పందనపై యూరోపియన్ యూనియన్ భారత రాయబారి హెర్వే డెలిన్ మాట్లాడుతూ ఈ ఏడాది భారతదేశంలో జరిగిన ఈయూఎఫ్ ఎఫ్ నిజంగా అత్యంత విశేషమైన ఎడిషన్ అని పేర్కొన్నారు. యూరప్‌లోని ప్రాంతాలు, వర్గాలు, జీవన స్థితుల నుంచే వచ్చిన విభిన్న కథలను చెప్పే చిత్రాలను చూడటానికి ప్రతి నగరంలోనూ ప్రేక్షకులు క్యూలు కడుతున్నారు. భారత ప్రేక్షకులకు చేరువయ్యేలా ప్రతి చిత్రాన్ని ప్రత్యేకంగా ఎంపిక చేశామన్నారు. ఈసారి వచ్చిన అపార స్పందన మాకు మరింత ఉత్సాహాన్నిచ్చిందని తెలిపారు. వచ్చే ఏడాది ఇంకా పెద్దగా, మరింత ఆకర్షణీయమైన క్రమాన్ని తీసుకురావాలని నిర్ణయించుకున్నామన్నారు. కథల నగరం, కథకుల నగరం హైదరాబాద్. సినిమా అంటే కేవలం వినోదం మాత్రమే కాదు, సామూహిక అనుభవమని ఇక్కడి ప్రేక్షకులు చూపించారని, ఇక్కడ సినిమా థియేటర్లు నిండే ఉత్సాహం%ౌ% హైదరాబాద్ బిర్యానీ చర్చల్లాంటి ఆప్యాయతతో ఉంటుందన్నారు. ఇక్కడ మా పట్ల చూపిన ఆతిథ్యం మాకు ఎంతో స్ఫూర్తినిచ్చింది," అని తెలిపారు. ఈ యూరోపియన్ యూనియన్ భారత ప్రతినిధి బృందానికి చెందిన లొరెన్జో పారుల్లీ, శ్రీ సారథి స్టూడియోస్ చైర్మన్ ఎం.ఎస్.ఆర్.వి. ప్రసాద్, హైదరాబాద్ ఫిల్మ్ క్లబ్ అధ్యక్షుడు కె.వి.రావు, అలయన్స్ ఫ్రాంసేజ్ హైదరాబాద్ డైరెక్టర్ మాడ్ మిక్సా, తెలుగు ఫిల్మ్ డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరశంకర్, హైదరాబాద్ ఫిల్మ్ క్లబ్ వైస్--ప్రెసిడెంట్ శ్యాన్ జి.కే., ప్రముఖ దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలతో విద్యార్థులు విద్యను అభ్యసించాలి : ఎమ్మెల్యే

విశాలాంధ్ర, పటాన్ చెరువు : ఆసియా లోనే అతిపెద్ద పారిశ్రామికవాడగా పేరుందిన పటాన్ చెరువు నియోజకవర్గంలో విద్యార్థులకు పారిశ్రామిక రంగంలో ఉపాధి అవకాశాలు లభించాలన్న సమున్నత లక్ష్యంతో దశాబ్ద కాలం పాటు కృషిచేసి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేశామని పటాన్ చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం కళాశాలలో జెకె ఫెన్నార్ మరియు కిర్బీ పరిశ్రమల సౌజన్యంతో రూ.35 లక్షల తో ఏర్పాటు చేసిన నూతన కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు కోసం జీవో జారీ కాగా ప్రస్తుత ప్రభుత్వంలో కళాశాల ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కళాశాల ప్రారంభమైన మొదటి సంవత్సరంలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా డిగ్రీ కళాశాలలో క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేయడంతో పాటు కంప్యూటర్ ల్యాబ్ సైతం అందుబాటులోకి తీసుకొని రావడం జరిగిందన్నారు. తల్లిదండ్రుల ఆశలు వమ్ము చేయకుండా ఉన్నత లక్ష్యంతో విద్యను అభ్యసించి పటాన్ చెరువు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు రాష్ట్ర జాతీయ స్థాయిలో మంచి పేరు తీసుకుని రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత సమాజాన్ని పట్టిపీడిస్తున్న డ్రగ్స్‌ను తరిమికొట్టడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. కంప్యూటర్ ల్యాబ్ కోసం 35 లక్షల రూపాయల సిఎస్ఆర్ నిధులు కేటాయించిన జెకె ఫెన్నార్, కిర్బీ పరిశ్రమ యాజమాన్యాలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పలువురు విద్యార్థులు మాట్లాడుతూ అత్యంత నిరుపేద కుటుంబంలో నుండి వచ్చిన తమకు కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సౌకర్యాలు అందించడం పట్ల ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ వినాయక్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, జెకె విన్నర్ పరిశ్రమ సి ఎస్ ఆర్ ప్రతినిధి సర్వేష్ అమృత్, కిర్బీ హెచ్ఆర్ ప్రతినిధి నాగరాజు, కళాశాల ప్రిన్సిపల్ విజయ్ కుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

విశాలాంధ్ర - తుర్కయంజల్ : బాబా సాహెబ్ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ తుర్కయంజాల్ మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి మల్లెల రఘు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యక్షులు పట్నం రమేష్ కురుమ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ అంబేద్కర్ నిష్క్రమణ భారత దేశానికి తీరని లోటు భారత రాజ్యాంగం అమలులోకి రాకముందు చదువుకు అధికారానికి నోచుకోలేదో ఆ వర్గాల గొంతుక మూగ బోయినట్లయిందనీ అంబేద్కర్ తన జీవిత కాలం అంతయు తనకోసం తన కుటుంబాన్ని కూడా వదులు కొని బడుగు బలహీన వర్గాలే తన కుటుంబం గా భావించి వారి యొక్క హక్కుల కోసం పోరాటం చేసి భారత రాజ్యాంగం లోని ఓటు హక్కు ద్వారా వారిని రాజులుగా చేశాడనీ ఈ భూమి మీద మనుషులు బ్రతికే ఉన్నంత కాలం అంబేద్కర్ పేరు సజీవంగా ఉంటుందన్నారు. ఇప్పటి కైన బడుగు బలహీన వర్గాలు ఓటు హక్కును, భారత రాజ్యాంగాన్ని తెలుసుకొని బీఎస్పీ జెండా క్రింద అధికారం వైపు పయనించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు వద్దిగళ్ళ బాబు, ఉపాధ్యక్షులు లపంగి రాజు, సోషల్ మీడియా కన్వీనర్ ఏర్పుల రవి కుమార్, ఇంజాపూర్ వార్డు అధ్యక్షులు మీసాల రవి కుమార్, సీనియర్ నాయకులు భూతం రమణ, యడవల్లి శ్యామ్ కుమార్, కొమ్మని దర్శన్, గుడ్ల శ్రీనివాస్, గుర్రం మురళి, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇంజాపూర్ చౌరస్తా లో బాబా సాహెబ్ అంబేద్కర్-బాబు జగ్జీవన్ రామ్ ల ఉత్సవ కమిటీ అధ్యక్షులు మల్లెల ఉపేందర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు.

డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం

విశాలాంధ్ర, బషీర్ బాగ్: బీజేపీ కుల, మతాలతో ప్రజలను మభ్యపెడుతూ అన్ని విధాలుగా మోసం చేస్తుందని జనతా కాంగ్రెస్ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు దీపక్‌శర్మ ఆరోపించారు. శనివారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తెలంగాణ జనతా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి. సురేందర్, కన్వీనర్ రవీందర్ నాయక్, ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్లతో కలిసి ఆయన మాట్లాడుతూ ఈ నెల 11న న్యూ బోయినపల్లి లో జనతా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని పార్టీ జాతీయ అధ్యక్షుడు మహతా రాయ్ ప్రారంభిస్తారని, జనతా కాంగ్రెస్ పార్టీ ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కారించే విధంగా పోరాటాలు చేస్తుందని ఆయన తెలిపారు. రాబోయే అన్ని ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేస్తుందని, త్వరలో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేసి ప్రకటిస్తామన్నారు. పార్టీలో యువతకు, మహిళలకు ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని తుంగలో తొక్కిందని, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని ఆరోపించారు. డీలిమిటేషన్ చేస్తే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్రంగా అన్యాయం జరగబోతుందని ఇందులో కుట్ర దాగి ఉందని, డీ లిమిటేషన్ జరిగితే ఉత్తరాది రాష్ట్రాలదే పైచెయ్యి అవుతుందని దీన్ని అన్ని రాష్ట్రాలు గమనించాలని సూచించారు. ఉచిత పథకాలతో ప్రజలను మభ్య పెట్టి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందుతున్నాయని ఆరోపించారు. త్వరలోనే భవిష్యత్తు కార్యాచరణను ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఏబెల్, కార్యదర్శి శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు తన్వీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆదరించి గెలిపించండి ... అభివృద్ధి చేస్తా : మురళీధర్‌రెడ్డి

విశాలాంధ్ర - మొయినాబాద్: గ్రామ ప్రజలు ఓటర్లు ఈ స్థానిక సంస్థల సర్పంచ్ ఎన్నికల్లో ఆదరించి గెలిపించండి గ్రామ అభివృద్ధికి పాటు పడతానని కనకమామిడి గ్రామ సర్పంచ్ అభ్యర్థి దివ్య మురళీధర్ రెడ్డి. అన్నారు. శనివారం కనకమామిడి గ్రామంలో ఎన్నికల ప్రచారం ఇంటింటా నిర్వహించారు. ఈ సందర్భేగా సర్పంచ్ అభ్యర్థి దివ్య మురళీధర్ రెడ్డి మాట్లాడుతూ... గ్రామంలో ప్రజల సమస్యలు అభివృద్ధి సంక్షేమమే నా ధ్యేయంగా పనిచేస్తానని అన్నారు. ఈ సర్పంచ్ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా మీ ముందుకు వచ్చానని ఆదరించి ఓటర్లు గెలిపిస్తే అభివృద్ధి చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం అందుబాటులో ఉంటూ కృషి చేస్తానని ఆమె అన్నారు. ఈ ప్రచారంలో గ్రామస్తులు , నాయకులు, యువకులు పలువురు పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు నివాళి

విశాలంధ్ర, మేడిపల్లి: బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ గారి విగ్రహానికి డాక్టర్ బి. ఆర్ అంబేద్కర్ 60వ వర్ధంతి సందర్భంగా శనివారం ఉదయం నివాళులు అర్పించిన బీజేపీ రాష్ట్ర నాయకులు ఏనుగుల లక్ష్మయ్య, జిల్లా నాయకులు దాసరి మహేష్ యాదవ్, చెంచల శివకుమార్ మరియు ఉప్పరి అనిల్ తదితరులు పాల్గొని ఘన నివలర్పించారు.

ప్రపంచానికే గొప్ప దార్శానికుడు అంబేద్కర్

విశాలాంధ్ర, పటాన్ చెరువు : భారతదేశంలో అణగారిన వర్గాల అభివృద్ధితోనే నవ సమాజ స్థాపన జరుగుతుందని నొక్కి వక్కాణించిన గొప్ప ధార్శనికుడు భారతరత్న అంబేద్కర్ అని పటాన్చెరువు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు మాదిరి పృథ్వీరాజ్ లు స్పష్టం చేశారు. శనివారం భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని పటాన్ చెరువు పట్టణంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ బీఆర్ఎస్ నాయకులు మాదిరి పృథ్వీరాజ్‌లు సంయుక్తంగా మాట్లాడుతూ సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం, బడుగు బలహీన వర్గాల ఆర్థిక అభివృద్ధి, విద్యాభివృద్ధి, రాజకీయ అభివృద్ధి కోసం అంబేద్కర్ ప్రపంచంలోనే ఆదర్శవంతమైన రాజ్యాంగాన్ని భారతదేశ ప్రజలకు అందించారని కొనియాడారు. అంబేద్కర్ ఆశయ సాధనకు దేశంలోని ప్రతి పౌరులు కట్టుబడి ఉండాలని సమ సమాజ స్థాపన ఆయన వేసిన బాటలో నే మనమందరం నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాయికాడ విజయ్ కుమార్, నాయకులు రుద్రారం శంకర్, కుమ్మరగూడెం వెంకటేష్, ధనరాజ్ గౌడ్, ఆదిత్య రెడ్డి తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

9 ఆర్డీఏ కార్యాలయం ఎదుట ధర్నా

విశాలాంధ్ర, బషీర్ బాగ్: ఆటో డ్రైవర్ల డిమాండ్ల సాధన కోసం ఈనెల 9న ఖైరతాబాద్, రాష్ట్ర రవాణా శాఖ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్స్ జెఏసి తెలిపింది. శనివారం, నారాయణగూడాలోని ఐ ఎన్ టియుసి రాష్ట్ర కార్యాలయంలో జేఏసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు బి వెంకటేశం, మల్లేష్ గౌడ్,షాబాంకర్ దయానంద్, మారయ్య, ఎం ఏ సలీం, సత్తిరెడ్డి, రామకిషన్,ఎండి మహబూబ్ తదితరులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆటో డైవర్లకు ప్రతి ఏటా రూ.12 వేలు, ప్రమాద బీమా, సంక్షేమ బోర్డు ఏర్పాటు తదితర డిమాండ్లను అమలు చేయాలని, ప్రమాద బీమాను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని, 50 ఏళ్లు నిండిన ఆటో డ్రైవర్లకు పెన్షన్ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడి 2 సంవత్సరాలు అయినా సందర్భేగా తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ పేరుతో ఘనంగా సంబురాలు చేసుకుంటున్నారని, ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు చేస్తే ఆటో డ్రైవర్లు కూడా ప్రభుత్వంతో కలిసి సంబురాలు చేసుకుంటారని తెలిపారు. రాష్ట్రంలో ఓలా, ఉబర్, ర్యాపిడో సేవలను నిలిపివేసి, వాటి స్థానంలో ప్రభుత్వమే ఒక కొత్త యాప్ తీసుకురావాలని కోరారు. ఆర్థిక ఇబ్బందులతో మరణించిన ఆటో డ్రైవర్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

చిన్నారుల విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన

విశాలాంధ్ర , కాప్రా : మల్లాపూర్‌లోని ది ఆపిల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో వివిధ ఆకృతులను తయారు చేసి, ప్రదర్శించారు. ఈ గ్యాలరీ ఎగ్జిబిషన్ లో చిన్నారి నివృతి, యూకేజీ (ట్రాఫిక్ రూల్స్) మహెూన్నత్ ఒకటవ తరగతి (వాయువు గాలి) అనే అంశాలపై ఆకృతులను తయారుచేసి చూపరులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ది ఆపిల్ స్కూల్ డైరెక్టర్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు కవిత, సానియా, శర్లిన్, అమీనా తదితరులు పాల్గొన్నారు.

వివక్షలపై అలుపెరుగని పోరాట యోధుడు అంబేద్కర్

విశాలాంధ్ర , కాప్రా : నాచారం డివిజన్ ఎర్రకుంటలో అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని నాచారం డివిజన్ కంటెస్టెడ్ కార్పొరేటర్ మేడల మల్లికార్జున గౌడ్ బీఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి అంబేద్కర్ సంఘం నాయకులు జంగం అశోక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలతో ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మెడల మల్లికార్జున గౌడ్ మాట్లాడుతూ అంటరానితనం వివక్షలపై అలుపెరుగని పోరాటం చేసి అస్తిత్వ ఉద్యమాలకు దశ దిశలను చూపిన స్ఫూర్తి ప్రదాత ఆర్థికవేత్త న్యాయ కోవిదుడు రాజ నీతిజ్ఞుడు రాజ్యాంగ నిర్మాణంలో కీలక పాత్ర పోషించిన దళిత బహుజన వర్గాల అభ్యున్నతికి కృషిచేసిన మహనీయుడు భారతరత్న బిఆర్ అంబేద్కర్ ని కొనియాడారు ఈ కార్యక్రమంలో యుగేందర్. శంకర్ ఆశన్న వెంకటేశ్వర్లు. వాసు, ప్రభాకర్, క్రాంతి. నర్సింగ్. హరి. మహేష్. రవి, రాజు. సహదేవ. పాల్గొన్నారు.

ఖాసీంను పరామర్శించిన మాలోత్ కవిత

విశాలాంధ్ర -గూడూరు: గూడూరు మండలం మాజీ జెడ్పీటీసి ఖాసిం మాతృమూర్తి మరణించడంతో కుమారుడు ఖాసింను మాజీ ఎంపీ మాలోత్ కవిత శనివారం పరామర్శించారు. కవితను చూసి ఖాసిం కంటనీరు పెట్టుకున్నారు. ఖాసీంను ఓదార్చి కవిత ధైర్యం చెప్పారు. పరకాల శ్రీనివాస్ రెడ్డి, ముత్యం వెంకన్న గౌడ్,బారాస నాయకులు వున్నారు.

ఎస్టి సూపర్ సింగర్స్ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర, బషీర్ బాగ్ : అగర్వాల్ సమాజ్ తెలంగాణ నిర్వహించనున్న ఎఎస్‌టి సూపర్ సింగర్స్ పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ నెల 15 నుంచి 22వ తేదీ వరకు ఈ పోటీలు బషీర్ బాగ్ లోని భారతీయ విద్యా భవన్ లో జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుధ్ గుప్తా, ఉపాధ్యక్షుడు రూపేష్ అగర్వాల్, గౌరవ మంత్రి వికాష్ కుమార్ కేషన్, కార్యక్రమ చైర్మన్ డాక్టర్ దిలీప్ పసారి, నిర్వాహక కమిటీ సభ్యులు మహేంద్ర అగర్వాల్, దినేష్ చంద్ర అగర్వాల్, అశోక్ జిందాల్, పంకజ్ సంఘి, ముఖేష్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

నగరం వేదికగా మహా సాంస్కృతిక వేడుక



విశాలాంధ్ర శేరిలింగంపల్లి: భారతీయ సాంస్కృతిక వేడుకకు నగరం వేదిక కానుంది. ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సాంస్కృతిక వేడుకల్లో ఒకటైన హైడ్ ఆర్ట్ 2025 కళా ప్రదర్శనకు రంగం సిద్ధమైంది. ఈ మూడు రోజుల కళా, సాంస్కృతిక మహెూత్సవం ఈనెల 19 నుంచి 21 వరకు నానక్‌రామ్‌గూడ లోని ఈయాన్ హైదరాబాద్‌లో జరగనుంది. ఇది సృజనాత్మకతను ఆలోచనాత్మకంగా క్యూరేట్ చేయబడిన కళా అనుభవాన్ని ఒకచోటకు తీసుకు వస్తుంది. హైదరాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా ఉన్న 200 మందికి పైగా కళాకారులు తమ కళాఖండాలను ప్రదర్శించను న్నారు. ఈ షో మాస్టర్‌పీసులు, సమకాలీన కళ, యువ కళాకారుల కృతులు, జానపద సంప్రదాయాలు, క్యూరేటెడ్ గ్యాలరీలు, వర్క్‌షాప్‌లు, ఆర్ట్ సంభాషణల సమ్మేళనాన్ని అందిస్తుంది. ప్రఖ్యాత క్యూరేటర్ అన్నపూర్ణ మడిపడిగ... హసన్ సహకారంతో దీనిని క్యూరేట్ చేయగా నవనామి గ్రూప్ తమ ముఖ్యమైన ల్యాండ్‌మార్క్ ప్రాపర్టీ ఈయాన్ హైదరాబాద్‌లో వద్ద దీనిని అందిస్తున్నారు. చారిత్రక, సమకాలీన, ప్రయోగాత్మక కళా వ్యక్తీకరణలను పక్కపక్కనే ఉంచుతూ భారతీయ కళ బహుముఖ, సమృద్ధమైన కథనాన్ని నిర్మిస్తుంది. ఒక ప్రత్యేకమైన 'మాస్టర్స్ ఆఫ్ ఇండియా' గ్యాలరీలో ఎం ఎఫ్ హుస్సేన్, ఎస్ హెచ్. రజా వంటి ఆధునిక భారతీయ దిగ్గజాల అరుదైన, ముఖ్యమైన కళాకృతులు ప్రదర్శించబడతాయి. ఈ ప్రదర్శన హైదరాబాద్‌కు చెందిన 30 మంది ప్రముఖ సమకాలీన కళాకారులు, దేశవ్యాప్తంగా ఉన్న 30 మంది యువ కళాకారుల సృజనాత్మకతకు అద్దం పట్టనుంది. ఈ సందర్భంగా నవనామి ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ గద్దె వెంకట నవీన్ మాట్లాడుతూ నవనామి వద్ద గొప్ప నగరాలు కేవలం మౌలిక వసతులతోనే కాక, ఊహాశక్తితోనూ రూపుదిద్దుకుంటాయని చెప్పారు. ఈ ఆర్ట్ షోకు అందిస్తున్న మద్దతు హైదరాబాద్‌కు ఒక సాంస్కృతిక వారసత్వాన్ని అందించాలన్న మా సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. ఇక్కడ ఆర్కిటెక్చర్, వ్యాపారం, కళ కొత్త వ్యక్తీకరణకు స్ఫూర్తినిస్తాయని తెలిపారు.

కాంగ్రెస్ అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం

విశాలాంధ్ర, పటాన్ చెరువు : నందిగామ సమగ్ర గ్రామాభివృద్ధి సర్పంచ్ అభ్యర్థి విక్రమ్ గౌడ్ తోనే సాధ్యమని గ్రామ ప్రజలు అభివృద్ధికి పట్టం కట్టాలని సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం నందిగామ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి విక్రం గౌడ్‌కు మద్దతుగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాల్లో కాంగ్రెస్ సానుభూతిపరులైన సర్పంచ్ అభ్యర్థులకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని స్పష్టం చేశారు. రానున్న సర్పంచ్ ఎన్నికల్లో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ సానుభూతిపరులు సర్పంచులుగా గెలిచే అవకాశాలు ఉన్నాయని అన్నారు. నందిగామ గ్రామంలో పేదలందరికీ సముచిత న్యాయం జరగాలంటే విక్రమ్ గౌడ్ గెలుపు తప్పనిసరి అని ఓటర్లకు వివరించారు. గ్రామంలో సంక్షేమం కోసం సమర్థవంతమైన నాయకుడు అవసరమని బడుగు బలహీన వర్గాల అభ్యర్థి విక్రం గౌడ్ ను ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన ర్యాలీలో వందలాది మంది యువత పాల్గొన్నారు.

కార్పొరేట్ శక్తుల కోసమే రాజధానా?

- రాష్ట్ర విభజన కన్నా చంద్రబాబు విధానాలే ప్రమాదకరం
- రెండోవిడత భూ సమీకరణ ఆపండి
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

విశాలాంధ్ర-విజయవాడ(గాంధీనగర్): అమరావతి ప్రజా రాజధానిగా ఉండాలని, కార్పొరేట్ శక్తులకు అండగా ఉంటూ రైతాంగానికి, ప్రజలకు భారంగా ఉండకూడదని రాజకీయ, ప్రజాసంఘాల, అమరావతి రైతు నాయకులు రాష్ట్రప్రభుత్వానికి హితవు పలికారు. రాష్ట్ర విభజన కన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న భూ సమీకరణలు ఎక్కువ ప్రమాదరకంగా ఉన్నాయని విమర్శించారు. తక్షణం రెండవ విడత భూ సమీకరణ నిలిపి వేయాలని డిమాండ్ చేశారు. మొదటి విడతకు సంబంధించి భూ సమీకరణ సమయంలో రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసి... అవసరమతే అప్పుడు రెండవ విడత భూ సమీకరణ కోసం అఖిలపక్ష సమావేశం నిర్వహించి...వారి సూచనల ప్రకారం ముందుకు వెళ్లాలని సూచించారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో అమరావతి ల్యాండ్ పూలింగ్-2.0పై రౌండ్‌టేబుల్ సమావేశం అమరావతి రైతు బుచ్చి తిరుపతిరావు అధ్యక్షతన శనివారం జరిగింది. ఎస్‌కేఎం ఏపీ కన్వీనర్, మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ గతంలో భూములిచ్చిన రైతులకు ఇప్పటికీ న్యాయం జరగలేదన్నారు. అందువల్ల రెండో విడత భూ సమీకరణ పేరుతో భూములు తీసుకోవడం సరికాదన్నారు. అమరావతి రైతులపై బనాయించిన కేసులు ఇంకా ఎందుకు ఎత్తివేయలేదని సీఎం చంద్రబాబును ప్రశ్నించారు. చంద్రబాబు పగటి కలల కోసం కోట్లాది మంది ప్రజలను ఇబ్బంది పెట్టడం న్యాయం కాదన్నారు. '24 ప్లాట్‌ఫారాలతో రైల్వేస్టేషన్ కడతానంటున్నాడు. రెండు లక్షల జనాభా కూడా లేని అమరావతికి అంత పెద్ద రైల్వేస్టేషన్ అవసరమా. 5 వేల ఎకరాల్లో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రం నిర్మిస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారు. 2500 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ అంటున్నారు. ఇవన్నీ ఇప్పటికప్పుడు అవసరమా అని నిలదీశారు. అన్ని ప్రాంతాల ప్రజలకు న్యాయం చేయాల్సిన బాధ్యత చంద్రబాబుకు లేదా అని ప్రశ్నించారు.

రిటైర్డ్ ప్రొఫెసర్ డా.సి.రామచంద్రయ్య మాట్లాడుతూ విజయవాడ- గుంటూరు మధ్య నాగార్జున యూనివర్సిటీ దగ్గర పాలనాపరమైన రాజధాని నిర్మించుకుంటే తప్పేమిటని ప్రశ్నించారు. వైజాగ్, కడప, కర్నూలు, నెల్లూరు, తిరుపతి వంటి ప్రధాన నగరాలపై దృష్టి కేంద్రీకరించి...పరిశ్రమాలు ఏర్పాటు చేస్తే రాష్ట్ర సమగ్రాభివృద్ధి జరుగుతుందని సూచించారు. ప్రత్యేకించి వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు వస్తే రాష్ట్రాభివృద్ధి శరవేగమవుతుందన్నారు. ఇలా చేస్తే కేవలం పదేళ్లలోనే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో పరుగులు పెడుతుందని చెప్పారు. వేల కోట్ల రూపాయలు అమరావతిపై ఖర్చు పెడితే...ఆ ప్రయోజనాలు ఎప్పటికి ప్రజలకు చేరుతాయని ప్రశ్నించారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ విజయవాడ పరిసరాల్లోనే రాజధాని ఉండాలని సీపీఐ మొదటి నుంచి డిమాండ్ చేసిందని, అమరావతి రాజధానికి తాము వ్యతిరేకం కాదన్నారు. అయితే రాజధాని పేరుతో వేల ఎకరాలు తీసుకోవడం సరికాదన్నారు. జగన్ హయాంలో ముందుకు వచ్చిన మూడు రాజధానుల సిద్ధాంతాన్ని తాము వ్యతిరేకించామని, రైతులకు అండగా నిలిచామని గుర్తుచేశారు. ఇప్పటికే భూములిచ్చిన రైతులకు న్యాయం చేయలేదని, మళ్లీ 44 వేల ఎకరాలు తీసుకోవడం దారుణమన్నారు. రాజధాని భూములు పెద్దలకు కట్టబెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. అమరావతిలోనే మొత్తం ఖర్చు చేస్తూ మిగిలిన ప్రాంతాలను పట్టించుకొవటం లేదని రాయలసీమ ప్రాంతంలో ఇప్పటికే ప్రచారం కొనసాగుతుందన్నారు. ఇదే కొనసాగితే భవిష్యత్తులో అనేక సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని, అప్పుడు చంద్రబాబు దోషిగా నిలబడక తప్పదని హెచ్చరించారు.

కాంగ్రెస్ నాయకులు తులసిరెడ్డి మాట్లాడుతూ అమరావతి రాజధాని కార్పొరేట్ రాజధానిగా ఉండకూడదన్నారు. జగన్ మూడుముక్కలాటకు, చంద్రబాబు రియల్ ఎస్టేట్ వ్యాపారానికి తమ పార్టీ వ్యతిరేకమని స్పష్టంచేశారు. రాజధానికి సచివాలయం, హైకోర్టు, రాజభవన్ ప్రధానమన్నారు. తెలంగాణ రాష్ట్ర సచివాలయ నిర్మాణం కేవలం 28 ఎకరాలలో అద్భుతంగా నిర్మించారని గుర్తుచేశారు. ఇప్పటికి 9 ఏళ్లు గడిచినా అమరావతిలో చెప్పుకోదగిన నిర్మాణాలు లేవన్నారు. విభజన చట్టం ప్రకారం హైకోర్టు, సచివాలయం, అసెంబ్లీ నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించాలని, కానీ ఇప్పటివరకు కేంద్రం ఇచ్చినది రూ.1500 కోట్లు మాత్రమేనని తెలిపారు. అమరావతి సెల్ఫ్‌ఫైనాన్స్ ప్రాజెక్టు అని చెబుతూ...ప్రపంచబ్యాంకు నుంచి రూ.7500 కోట్లు, ఏసియన్ బ్యాంకు నుంచి రూ.7000 కోట్లు, ఇతర బ్యాంకుల నుంచి పెద్దమొత్తంలో అప్పులు తీసుకుంటున్నారని విమర్శించారు. ఈ భారం రాష్ట్ర ప్రజలపై పడుతుందని హెచ్చరించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు మాట్లాడుతూ కేవలం కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలకే చంద్రబాబు ప్రభుత్వం పెద్దఎత్తున భూములు సమీకరిస్తోందని విమర్శించారు. సమావేశంలో సామాజిక కార్యకర్త వసుంధర, వివిధ ప్రజాసంఘాల నేతలు మాట్లాడారు.

సీపీఐ రాష్ట్ర సమితికి
తూర్పుగోదావరి జిల్లా సమితి లక్ష విరాళం

విశాలాంధ్ర-రాజమండ్రి: సీపీఐ రాష్ట్ర సమితికి తూర్పుగోదావరి జిల్లా సమితి లక్ష రూపాయల విరాళం అందజేసింది. ఈ మొత్తాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్యకు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తాటిపాక మధుకు జిల్లా నాయకులు అందజేశారు. భవిష్యత్‌లోనూ రాష్ట్ర పార్టీకి తూర్పుగోదావరి జిల్లా సమితి అండగా ఉంటుందని సీపీఐ జిల్లా కార్యదర్శి రేఖ భాస్కరావు తెలిపారు. జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు, సహాయ కార్యదర్శి పి.లావణ్య తదితరులు ఉన్నారు.

విశాలాంధ్ర 60 సంవత్సర చందాల చేర్పింపు

ప్రజల పత్రిక విశాలాంధ్ర 60 సంవత్సర చందాలు చేర్పించారు. దీనిలో జట్ల లేబర్ యూనియన్ కీలకపాత్ర పోషించింది. దీనికి సంబంధించిన మొత్తం నగదును సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి ఈశ్వరయ్యకు అందజేశారు

విమానయాన రంగం బలహీనం

ఇండిగో సంక్షోభానికి కేంద్రమే కారణం: నారాయణ

విశాలాంధ్ర-విజయవాడ: ఇండిగో విమానాల సంక్షోభానికి కేంద్ర ప్రభుత్వమే కారణమని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. ఇది ప్రమాదవశాత్తు జరిగినది కాదని, పౌర విమానయాన సంస్థను కేంద్ర ప్రభుత్వం బలహీనపర్చిన పర్యవసానమని దుయ్యబట్టారు. నారాయణ శనివారం సామాజిక మాధ్యమం ద్వారా ఇండిగో సంక్షోభంపై ఆందోళన వ్యక్తంచేశారు. ప్రైవేటుకు వంతపాడే కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఖండించారు. ఎయిరిండియా, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వంటి సంస్థలు ప్రైవేటుపరం కావడంతో ప్రైవేటు ఎయిర్‌లైన్స్ పెత్తనం పెరిగిందని విమర్శించారు. విమానయాన రంగం ప్రభుత్వ పరిధిలో ఉండటమే లాభదాయకమని సూచించారు. పటిష్ఠ ప్రభుత్వ పౌర విమానయాన రంగాన్ని పునరుద్ధరించుకునేందుకు ఇదే సమయమని నారాయణ నొక్కిచెప్పారు. దేశ ప్రయోజనాలు, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం, సామాన్యులకు అందుబాటు ధరలకు ప్రయాణ సౌకర్యం కల్పించడం కోసం చర్యలు తీసుకోవడం తక్షణావశ్యమని పేర్కొన్నారు. విమానాల రద్దు, ఆలస్యం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, విమానాశ్రయాల్లో చిక్కుకుపోయారని నారాయణ ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజలను, ప్రభుత్వాన్ని ఇండిగో ఎయిర్ లైన్స్ బ్లాక్ మెయిల్ చేస్తోందని, ప్రయాణికులను దోచేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజాధనాన్ని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడుతుందని అన్నారు. ప్రైవేటు రంగంలో విమానయాన నిర్వహణలో బాధ్యతారాహిత్యానికి ఇండిగో సంక్షోభం నిదర్శనమన్నారు. ఇండిగో ఎయిర్‌లైన్స్‌ను కేంద్రం అధీనంలోకి తీసుకుని నిర్వహించాలని నారాయణ డిమాండ్ చేశారు.

గవర్నర్‌తో చంద్రబాబు భేటీ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో సీఎం చంద్రబాబు శనివారం లోక్‌భవన్‌లో భేటీ అయ్యారు. రాష్ట్రంలో జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సీఎం ఆయన దృష్టికి తీసుకువచ్చినట్లు తెల్సింది. ముఖ్యంగా అమరావతి రాజధాని అభివృద్ధి పనులు, ఇటీవల విశాఖ జరిగిన సీఐఐ సదస్సు ద్వారా పెద్ద ఎత్తున వచ్చిన పెట్టుబడులు, కేవలం 45 రోజుల్లోనే వాటిలో సగంపైగా అమలు దశకు చేరుకోవడం విశేషమని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు శ్రమిస్తున్న తీరును గవర్నర్ ప్రశంసించినట్లు తెలిసింది.

17న జగన్‌కు అపాయింట్‌మెంట్: రాష్ట్రంలో 10 కొత్త మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రజా ఉద్యమం, కోటి సంతకాల సేకరణపై గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు నివేదించేందుకు మాజీ ముఖ్యమంత్రి, ఆ పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి ఈనెల 17న కలువనున్నారు. ఆరోజు సాయంత్రం 4 గంటలకు పార్టీ ముఖ్యనేతలు, ప్రజా ప్రతినిధులతో గవర్నరును జగన్ కలుస్తారు. ఈ మేరకు అపాయింట్‌మెంట్‌ను ఖరారు చేస్తూ గవర్నర్ స్పెషల్ సీఎస్ నుంచి వైసీపీ కార్యాలయానికి లేఖ అందింది.

సమ సమాజమే అంబేద్కర్ జీవిత లక్ష్యం

సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా
రాజ్యాంగ నిర్మాతకు నివాళి

న్యూదిల్లీ: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సమ సమాజాన్ని కోరుకున్నారని, సామాజిక న్యాయం సాధించేందుకు నిర్విరామంగా పోరాడారని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా అన్నారు. అంబేద్కర్ 70వ వర్ధంతి సందర్భంగా దిల్లీలోని సీపీఐ కేంద్ర కార్యాలయం అజయ్ భవన్‌లో రాజ్యాంగ నిర్మాత చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. డి.రాజా మాట్లాడుతూ అంబేద్కర్ తన జీవితం మొత్తం సమ సమాజ స్థాపనకు కృషి చేశారన్నారు. కుల వ్యవస్థ నిర్మాన, సమానత్వం, సామాజిక న్యాయం కోసం నిర్విరామంగా పోరాడారని గుర్తుచేశారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయంపై ఆధారపడే లౌకిక-ప్రజాస్వామ్య గణతంత్ర దేశంగా భారత్ వర్ధిల్లేలా రాజ్యాంగాన్ని రూపొందించారని అంబేద్కర్‌ను డి.రాజా శ్లాఘించారు. ఆయన వర్ధంతిని పురస్కరించుకొని సీపీఐ శ్రేణులకు రాజ్యాంగ పీఠికను చదివి వినిపించారు. అంబేద్కర్ వారసత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యులు డాక్టర్ గిరీశ్, పి.సంతోశ్ కుమార్, కార్యవర్గ సభ్యులు గుల్జార్ గోరియా, రావుల వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం ప్రాణాధారం

దాని పరిరక్షణ అందరి బాధ్యత: ఈశ్వరయ్య

విశాలాంధ్ర-తిరుపతి: తాజా పరిస్థితులలో రాజ్యాంగమే మనకు ప్రాణాధారమని, దానిని కాపాడుకోవడం ప్రతిపౌరుడి బాధ్యతని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 70వ వర్ధంతి సందర్భంగా ఈశ్వరయ్య శనివారం తిరుపతిలోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగంలో పొందుపర్చిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి అంశాలకు భంగం కలుగుతుందని ఈశ్వరయ్య ఆందోళన వ్యక్తంచేశారు. రాజ్యాంగాన్ని మార్చాలని, దాని స్థానంలో మనువాద సిద్ధాంతాన్ని చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఓ వైపు అంబేద్కర్‌ను కొనియాడుతూ మరోవైపు ఆయన రూపొందించిన రాజ్యాంగానికి తూట్లు పొడిచే ప్రయత్నాలు పాలకుల ద్వంద్వ వైఖరిని నిదర్శనమని ఈశ్వరయ్య విమర్శించారు. ఆపరేషన్ కగార్ పేరుతో రాజ్యాంగం హామీనిచ్చిన స్వేచ్ఛను హరిస్తూ నిరంకుశత్వం కొనసాగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. దళితులపై, గిరిజనుల పై, మైనారిటీలపై, మహిళలపై దాడులు పెరగడం పాలకుల దురాహంకారానికి నిదర్శనమన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీకగా భారతదేశాన్ని నిలిపే విధంగా ఉన్నతమైన రాజ్యాంగాన్ని రూపొందించినాగానీ నూటికి 80 శాతం మంది రాజ్యాంగ లక్ష్యాలు అందుకోలేక పోతుండడం దౌర్భాగ్యమని ఈశ్వరయ్య అన్నారు. మనకు ప్రాణాధారమైన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అంబేద్కర్ సాక్షిగా ప్రమాణం చేద్దాం. ఆయన ఆశయాలు సాధిద్దాం అంటూ పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.హరినాధ రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగాన్ని తూట్లు పొడిచే విధంగా పాలకులు వ్యవహరిస్తున్నారని, లౌకిక రాజ్యాంగ వ్యవస్థను నాశనం చేస్తున్నారని విమర్శించారు. భావ ప్రకటన స్వేచ్ఛ లేకుండా చేస్తున్నారని, పత్రికా స్వేచ్ఛకు కళ్లెం వేస్తున్నారని అన్నారు. అంబేద్కర్ ఏ ఆశయాల కోసమైతే రాజ్యాంగాన్ని రూపొందించారో వాటిని కొనసాగించడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు లెనిన్, పి.మురళి, చిన్నం పెంచలయ్య, కె.రాధాకృష్ణ జె.విశ్వనాథ్, కత్తి రవి, శశి కుమార్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుమారస్వామి మనువాది
సిద్ధరామయ్య

బెంగళూరు: బీజేపీతో పొత్తు తర్వాత కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి 'మనువాది'గా మారారని కర్నాటక సీఎం సిద్ధరామయ్య విమర్శించారు. భగవద్గీతను పాఠ్యాంశంగా చేర్చాలంటూ ఇటీవల కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు కుమారస్వామి లేఖ రాయడంతో ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్య చేశారు. బీఆర్ అంబేద్కర్ 70వ వర్ధంతి సందర్భంగా ఆయనకు శనివారం ఘనంగా నివాళులర్పించిన అనంతరం సీఎం విలేకరులతో మాట్లాడారు. విద్యార్థుల పాఠ్యాంశంగా భగవద్గీతను చేర్చాలంటూ కుమారస్వామి ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఎన్నికల కోసం బీజేపీతో చేతులు కలిపిన తర్వాత ఆయన మనువాదిగా మారిపోయారని వ్యాఖ్యానించారు. అదే సమయంలో రాజ్యాంగ రూపకల్పన, సామాజిక న్యాయం కోసం పోరాటంలో అంబేద్కర్ కృషి ఎనలేనిదంటూ సిద్ధరామయ్య కొనియాడారు. హిందూ మతంలో సామాజిక, కుల వ్యవస్థలతో విసిగిపోయి, వాటిని సంస్కరరించలేక అంబేద్కర్ బౌద్ధమతం స్వీకరించారని తెలిపారు. హిందువుగా జన్మించిన హిందువుగా చనిపోలేదని, కుల వ్యవస్థను సంస్కరించేందుకు ఆయన ఎంతగా ప్రయత్నిం చారు కానీ ఫలితం దక్కలేదు. దీంతో విసిగిపోయి బౌద్ధమతాన్ని స్వీకరించారు' అని సీఎం సిద్ధరామయ్య అన్నారు.

బాబ్రీ మసీదు నిర్మాణానికి
తృణమూల్ ఎమ్మెల్యే శంకుస్థాపన

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే హుమయున్ కబీర్... శనివారం బాబ్రీ మసీదు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షీదాబాద్‌లో ఆ మసీదు నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. అయోధ్యలో గతంలో ఉన్న బాబ్రీ మసీదు తరహాలో ముర్షీదాబాద్‌లోనూ మసీదును నిర్మించనున్నారు. భారీ భద్రత మధ్య రెజినగర్‌లో ఆ కార్యక్రమాన్ని నిర్వహించారు. వేల సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. చాలా మంది మసీదు నిర్మాణం కోసం స్వచ్ఛందంగా ఇటుకలు మోశారు. భూమిపూజ సందర్భంగా ఎమ్మెల్యే తన అనుచరులతో కలిసి రిబ్బన్ కట్ చేశారు. నారా -ఈ-తక్‌బీర్, అల్లాహూ అక్బర్ అని అరిచారు. మతఘర్షణలకు దారి తీసే రీతిలో ప్రవర్తిస్తున్న ఎమ్మెల్యే కబీర్‌ను ఇటీవల తృణమూల్ కాంగ్రెస్ పార్టీ సస్పెండ్ చేసింది.

వైద్య విద్యపై అమ్మాయిల ఆసక్తి

ఎంబీబీఎస్‌లో 60.72 శాతం సీట్లు వారివే
కన్వీనర్, యాజమాన్య కోటాలోనూ వీరిదే హవా
గడిచిన రెండేళ్లతో పోల్చితే ఈ ఏడాది 3.66 శాతం అధికం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైద్య విద్యపై అమ్మాయిలు ఎక్కువగా ఆసక్తి కనబరుస్తున్నారు. గత మూడు సంవత్సరాలుగా రాష్ట్రంలో ఎంబీబీఎస్ ప్రవేశాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. మెడికల్ కోర్సుల ప్రవేశాల్లో ప్రతి ఏటా విద్యార్థినుల శాతం అధికంగా ఉంటోంది. ఈ ఏడాది ఆ వ్యత్యాసం మరింత పెరిగింది. ప్రస్తుత విద్యాసంవ్సతరం ఎంబీబీఎస్ ప్రవేశాల్లో 60.72 శాతం అమ్మాయిలే ఉన్నారు. గత రెండేళ్లతో పోల్చితే 2025-26 విద్యా సంవత్సరంలో 3.66 శాతం అమ్మాయిల ప్రవేశాలు అధికం. ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం అధ్వర్యంలో ఈ విద్యా సంవత్సరానికి ప్రభుత్వ, ప్రైవేటు వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్ ప్రవేశాలు ముగిశాయి. వీటి వివరాలను విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ రాధికారెడ్డి శనివారం ఆ శాఖా మంత్రి సత్యకుమార్‌కు నివేదించారు. 2023-24లో 57.06శాతం 2024-25లో 57.96శాతం ఉండగా, ఈ ఏడాది 60.72శాతం మంది అమ్మాయిలు ఎంబీబీఎస్ లో చేరినట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ఈ పరిణామం... అమ్మాయిల భవిష్యత్తు విషయంలో తల్లిదండ్రుల్లో వస్తున్న మార్పునకు సంకేతమని పేర్కొన్నారు. పాఠశాల విద్య నుంచే అమ్మాయిలు రాణిస్తూ, నీట్ లో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు పుస్తకాలతో మమేకమవుతున్నారని తెలిపారు. అలాగే కన్వీనర్ కోటాలోనే కాకుండా... యాజమాన్య కోటాలోనూ అమ్మాయిలే అధికంగా ఉండడం గమనార్హం. 2025-26 విద్యా సంవత్సరంలో మొత్తం ఎంబీబీఎస్ సీట్లు 6,435 ఉన్నాయి. ఇందులో కన్వీనర్ కోటా కింద అమ్మాయిలు 2,617, అబ్బాయిలు 1,638 సీట్లు దక్కించుకున్నారు. యాజమాన్య కోటాలో అమ్మాయిలు 1,287, అబ్బాయిలు 888 మంది ప్రవేశాలు పొందారు. దీని ప్రకారం కన్వీనర్ కోటాలో 61.50శాతం, మేనేజ్‌మెంట్ కోటాలో 59.17శాతం చొప్పున అమ్మాయిలు సీట్లు దక్కించుకున్నారు. 2023-24 విద్యాసంవత్సరంలో మొత్తం 6,028 సీట్లు ఉండగా అబ్బాయిలు 2,589 (42.94 శాతం), అమ్మాయిలు 3,439 (57.06 శాతం), 2024-25లో 6,030 సీట్లలో అబ్బాయిలు 2,537 (42.04 శాతం), అమ్మాయిలు 3,498 (57.96 శాతం), 2025-26లో మొత్తం సీట్లు 6,435 కాగా, అబ్బాయిలు 2,526 (39.28 శాతం), అమ్మాయిలు 3,904 (60.72 శాతం) మంది ప్రవేశం పొందారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

ఇండిగో విమానాల రద్దుపై సీపీఐ నేత డి.రాజా

న్యూదిల్లీ: ఇండిగో విమానాల రద్దు కారణంగా దేశ వ్యాప్తంగా వేలాది మంది ప్రయాణికులు చిక్కుకుపోయారని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా శనివారం విమర్శించారు. విమానయాన రంగంలో ఒక కంపెనీ ఆధిపత్యం చెలాయించడం వల్ల ప్రయాణికులకు సమస్యలు ఎలా వస్తాయో ఈ పరిస్థితి చూపిస్తుందని అన్నారు. 'గుత్తాధిపత్య కంపెనీలు ఉద్భవించడానికి మీరు అనుమతిస్తే, మేము అనుభవించేది ఇదేనని ప్రభుత్వానికి, ప్రజలకు ఇది ఒక పాఠం కావాలి. విమాన టికెట్ల ధరలు పెరుగుతున్నాయి. ప్రయాణికులు ఇలాంటి పరిస్థితిని ఎలా ఎదుర్కొంటారు? దేశంలో ఇలాంటి సంక్షోభానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి' అని తెలిపారు.

చర్యలేవి: సూలే: ఐదు రోజులుగా దేశవ్యాప్తంగా వందలాది విమానాల రద్దుకు ఇండిగో ఎయిర్‌లైన్‌పై చర్య తీసుకోవాలని ఎన్‌సీపీ (ఎస్‌పీ) లోక్‌సభ ఎంపీ సుప్రియా సూలే కోరారు. 'కేంద్ర ప్రభుత్వం ఇండిగోపై చర్య తీసుకోవాలి. గత రెండు రోజుల్లో వేలాది మంది ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మేము ఈ సమస్యను పార్లమెంటులో లేవనెత్తాము' అని సూలే అన్నారు. 'ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఇంత పెద్ద ఎత్తున అంతరాయం కలిగించడం వల్ల సమయం, కోట్లాది రూపాయల నష్టం వాటిల్లింది. ఇండిగో నుంచి మేము దీనిని ఊహించలేదు. కేంద్రం ఇండిగో వంటి మరో ఐదు కంపెనీలను సృష్టించాలి. ఇండిగో సేవ ఎందుకు కుప్పకూలిందో, పరిష్కారాలు ఏమిటో పార్లమెంటులో వివరాలను పంచుకోవాలి' అని సూలే అన్నారు.

డీజీసీఏపై కాంగ్రెస్ ఎంపీ మండిపాటు

విమానయాన రంగంలో గుత్తాధిపత్యాన్ని తయారు చేసి, ప్రస్తుత ఇండిగో సంక్షోభానికి కారణమయ్యారని కాంగ్రెస్ ఎంపీ శశికాంత్ సెంథిల్ శనివారం బీజేపీని విమర్శించారు. కొత్త పైలట్ల విశ్రాంతి నియమాలను రద్దు చేసినందుకు డీజీసీఏపై మండిపడుతూ, ఇది బాధ్యతారాహిత్యం మాత్రమే కాదు. దారుణం. పైలట్ అలసటను నివారించడానికి ప్రత్యేకంగా రూపొందించిన నియమాలను రద్దు చేయడం ద్వారా బీజేపీ ప్రభుత్వం ప్రయాణికుల భద్రతను ప్రమాదంలో పడేసి, కాక్‌పిట్ సిబ్బంది శ్రేయస్సును అనిశ్చితిలోకి నెట్టిందని ఆరోపించారు. 'జనవరి 2024లో విడుదల చేసిన, జులై 2025 నుంచి పాక్షికంగా, 2025 నవంబరు 1న పూర్తిగా అమలు చేయబడిన ఎఫ్‌డీటీఎల్ నిబంధనలను ఇండిగో పాటించేలా చేయడంలో డీజీసీఏ ఎందుకు విఫలమైంది? ప్రభుత్వం ఇండిగోకు హెచ్చరికలు లేదా సమ్మతి నోటీసులు జారీ చేసిందా లేదా విమానయాన సంస్థ అమలు నుండి పూర్తిగా రక్షించబడిందా?' అని ఆయన ప్రశ్నించారు.

ఆర్జీఎంలో అంతర్జాతీయ స్థాయి
ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియం ప్రారంభించిన చేతన్

విశాలాంధ్ర-పాణ్యం : నంద్యాల జిల్లా, పాణ్యం మండల పరిధిలో గల ఆర్జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిం చిన బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియంను ప్రఖ్యాత భారత బ్యాడ్మింటన్ క్రీడాకారుడు, అర్జున అవార్డు గ్రహీత, జాతీయ మాజీ ఛాంపియన్ బి.చేతన్ ఆనంద్ శనివారం ప్రారంభించారు. చేతన్ ఆనంద్ నాలుగు సార్లు జాతీయ ఛాంపియన్‌గా, మూడు సార్లు దక్షిణాసియా క్రీడల పురుషుల సింగిల్స్ ఛాంపియన్‌గా కెరీర్‌లో అత్యుత్తమ ప్రపంచ ర్యాంకింగ్ 10 సాధించి బ్యాడ్మింటన్‌లో భారతదేశ కీర్తిని చాటిచెప్పారు. ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్ షిప్‌లతో సహా అనేక అంతర్జాతీయ టోర్నమెంట్లలో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించారు. ఈ సందర్భంగా చేతన్ ఆనంద్ మాట్లాడుతూ ఆర్జీఎం విద్యాసంస్థలు ఎన్నో వ్యయప్రయాసలకోర్చి అంతర్జాతీయ స్థాయిలో ఇండోర్ బ్యాడ్మింటన్ స్టేడియం నిర్మించడం అభినందనీయమని అన్నారు. భవిష్యత్‌లో ఈ ప్రాంతం నుంచి జాతీయ స్థాయిలో బ్యాడ్మింటన్ క్రీడాకారులు పుట్టుకొస్తారన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో ఆర్జీఎం విద్యాసంస్థల ఎండీ ఎం.శివరామ్, డీన్ డాక్టర్ డి.వి.అశోక్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.జయ చంద్ర ప్రసాద్, శాంతి రాం ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.సుబ్రమణ్యం, శాంతి రాం ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్ సి.మధుసూధన చెట్టి, కళాశాల అధ్యాపకులు, జేఎన్‌టీయూ అనంతపూర్ స్థాయిలో బెస్ట్ ఫిజికల్ డైరెక్టర్ అవార్డు గ్రహీత పి.వెంకటేష్, శాంతిరామ్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ నుంచి ఫిజికల్ డైరెక్టర్లు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.

తాటిసుబ్బన్న గూడెంలో సర్పంచ్‌గా స్వాతి ఏకగ్రీవం

విశాలాంధ్ర, దమ్మపేట : బీఆర్ఎస్ పార్టీ మండలంలోని తాటిసుబ్బన్న గూడెంలో తన పట్టును మరోసారి చాటుకుంది. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా సర్పంచ్ పదవి ఏకగ్రీవం అయింది. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జ్ మెచ్చా నాగేశ్వరరావు స్వగ్రామమైన తాటి సుబ్బన్నగూడెంలో బీఆర్ఎస్ నాయకురాలు సవలం స్వాతి ని గ్రామ ప్రజలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మెచ్చా నాగేశ్వర రావు నాయకత్వంపై బీఆర్ఎస్ ప్రభుత్వం ద్వారా జరిగిన అభివృద్ధిపై తమకున్న విశ్వాసాన్ని చాటారు. గ్రామాభివృద్ధికి తొలి అడుగుగా ఈ ఏకగ్రీవ పాలనకు పట్టం కట్టినట్లు అయిందని నాయకులు వెల్లడించారు. ఐక్యతతో బీఆర్ఎస్ అభ్యర్థిని ఎన్నుకోవడంతో ఈ ప్రాంతంలో ఆ పార్టీకున్న బలమైన పట్టు మరోసారి పునరావృతమైందని బిఆర్ ఎస్ నాయకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గుండు ప్రదీప్ కుమార్‌కు పెరుగుతున్న జనాదరణ

విశాలాంధ్ర - భద్రాచలం : భద్రాచల మండలం మేజర్ గ్రామ పంచాయతీ లోని 10 వ వార్డ్ స్వాతంత్ర సర్పంచ్ అభ్యర్థిగా ప్రదీప్ కుమార్ పోటీ చేస్తున్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులకు పోటీగా ప్రచారం చేస్తూ గెలుపు కోసం తీవ్ర కృషి చేస్తున్నారు. ప్రచార నేపథ్యంలో ప్రదీప్ కుమార్ కు వార్డు ప్రజల్లో ఆదరణ పెరుగుతుంది. దీంతో ప్రత్యర్థి అభ్యర్థులను రైళ్ల పరిగెడుతున్నాయి. ప్రజల్లో మమేకమై స్థానికులను ఆకట్టుకుంటూ తనను గెలిపిస్తే చేసే అభివృద్ధిని చాలా స్పష్టంగా చెబుతూ ముందుకు వెళ్తున్నారు. ప్రస్తుతం నెలకొన్న సమస్యలను తెలుసుకుంటూ తనను గెలిపిస్తే పరిష్కారాలు ఎలా చేస్తాను వివరిస్తున్నారు. గత పాలకులు ప్రజల సమస్యలను నిర్లక్ష్యం చేశారని విమర్శిస్తున్నారు. సంప్రదాయ రాజకీయాలకు భిన్నంగా ప్రజానుకూల ప్రచారాన్ని కొనసాగిస్తున్న తీరు స్థానికులను ఆకట్టుకుంటుంది. 10 వ వార్డ్ అభివృద్ధి చెందాలంటే తన గ్యాస్ పొయ్యి గుర్తుపై అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు.

అవినీతి, అక్రమాలు లేని అభివృద్ధి చేయడమే లక్ష్యం

యువనేత కిషోర్ నాయక్

విశాలాంధ్ర - బూర్గంపాడు : మండలంలో సారపాక మేజర్ గ్రామం పంచాయితీ చాలా ప్రతిష్టగా మారింది. అందరి దృష్టి పారిశ్రామిక ప్రాంతమైన ఇక్కడే వుంది. టిడిపి తో పాటు ఇతర యూనియన్ల మద్దత్తు లభించిన కాంగ్రెస్ అభ్యర్థి కిషోర్ శివరాం నాయక్ గెలుపు ధీమాతో ముందుకు సాగుతున్నారు. శనివారం యువకుడైనా ఆయన ప్రచారం చేస్తూ స్థానికులను ఆకట్టుకునే భరోసా ఇస్తూ ప్రత్యర్థులను కంటికి కునుకు లేకుండా చేస్తున్నారు. గత పాలకులు అవినీతి మయంగా పంచాయతీని భ్రష్టు పట్టించారని విమర్శిస్తున్నారు. తనను గెలిపిస్తే ఎలాంటి అవినీతి అక్రమాలకు తావులేని పాలన అందిస్తానని భరోసా ఇస్తున్నారు. ప్రజల సహకారం మద్దతు చూస్తుంటే తన గెలుపును ఎవరు ఆపలేరని కిషోర్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కిషోర్ కు కలిసి వచ్చే అంశం మరొకటి ఉంది. అధికార కాంగ్రెస్ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఇటీవలే అభివృద్ధి కార్యక్రమాలకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేసి ప్రజల సమస్యలు తీర్చారు. దీనికి తోడు ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా కిషోర్ కు కలిసి అంశాలుగా మారాయి. అవినీతి లేని అభివృద్ధి ఎజండాతో బరిలో దిగిన తనను ప్రజాసేవలో కొనసాగటానికి గ్రామ ప్రజలు గెలిపించి సహకరించాలని అభ్యర్థిస్తున్నారు.

తనదైన శైలిలో ప్రచారంతో ఆకట్టుకుంటున్న భూక్య ప్రవీణ్

విశాలాంధ్ర- బూర్గంపాడు : మండలంలో ప్రతిష్టాత్మకమైన పంచాయతీగా ఉన్న సారపాక లో సర్పంచ్ అభ్యర్థిగా బరిలో దిగిన యువ నాయకుడు భూక్యా ప్రవీణ్ తనదైన శైలిలో ప్రచారం చేస్తూ ప్రజలను ఆకట్టుకుంటున్నారు. ఒక్క అవకాశం యువతకు ఇవ్వండి.. సమగ్ర అభివృద్ధి ఎలా ఉంటుందో చూపిస్తాం అంటూ స్థానికులను ఆకర్షిస్తున్నారు. సర్పంచ్ గా పనులు గెలిపిస్తే ప్రజల యజెండాని తన ఎజెండాగా పరిపాలన చేస్తానని భరోసా ఇస్తున్నారు. శనివారం 18 వ వార్డులో ఆయన ఇంటింటికి తిరిగి స్పష్టమైన హామీలు ఇస్తూ ఓటర్లను గెలిపించాల్సిందిగా అభ్యర్థిస్తున్నారు. ఇతని వెంట ముఖ్యంగా యువకులు అధిక సంఖ్యలో ప్రచారం చేస్తున్నారు. సారపాక పంచాయతీలో దశాబ్దాల తరబడి కీలకమైన సమస్యలు గూడుకట్టుకున్నాయని తనను గెలిపిస్తే పరిష్కారం ఎలా ఉంటుందో చూపిస్తానని ప్రవీణ్ ఓటర్లకు భరోసా కల్పిస్తున్నారు. 40 వేల పైచిలుకు జనాభా కలిగిన సారపాకలో స్మశాన వాటిక లేదని, డ్రైనేజీ వ్యవస్థ చిత్రంగా ఉందని తన గెలుపుతోనే ఇవన్నీ సాధ్యమవుతాయని స్పష్టం చేస్తున్నారు.

నిరుపేదకు అంత్యక్రియలు నిర్వహించిన గౌతమ్ బుద్ధ సంస్థ

విశాలాంధ్ర-దమ్మపేట : అనారోగ్యంతో మృతి చెందిన ఓ నిరుపేదకు గౌతమ్ బుద్ధ స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. దమ్మపేట మండలం మందలపల్లికి చెందిన సుంకెల్లి వెంకటేశ్వరరావు (50) శనివారం మృతిచెందారు. ఇతనికి సంస్థ వ్యవస్థాపకుడు పాలడుగు అబ్బులు ఆధ్వర్యంలో అంత్యక్రియలు చేపట్టారు. అంత్యక్రియల సామాగ్రి, ఫ్రీజర్ బాక్సును స్థానిక వ్యాపారి అజీమ్ తన షెడ్డులో ఉచితంగా ఆశ్రయం కల్పిం చారని అబ్బులు తెలిపారు. దాతలు దేవరపల్లి అజయ్‌కుమార్, ఆటో యూని యన్ సభ్యులు భోజన సౌకర్యం కల్పించడం విశేషం. కార్యక్రమంలో షేక్ అజీమ్, రొయ్యల కుమార్, గంగాధర శ్రీనివాస్, షేక్ బుడే తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా వ్యవహారిస్తే చర్యలు తప్పవు

చల్ల సముద్రం పంచాయతీలో నలుగురి సస్పెండ్

విశాలాంధ్ర-ఇల్లందు: పంచాయతీ ఎన్నికల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీకి, నాయకత్వానికి వ్యతిరేకంగా వ్యవహారిస్తే కఠిన చర్యలు తప్పవని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పులి సైదులు స్పష్టం చేసారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని చల్ల సముద్రం పంచాయతీ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన తాటి భిక్షంకు వ్యతిరేకంగా కూటమి అభ్యర్థికి మద్దతు ఇస్తున్న కొందరిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. తమ కందిన సమాచారం ప్రకారం ఎల్లంపల్లి బుచ్చయ్య, సట్ల శ్రీను, మోడెం కోటయ్య, కాటూరి సతీష్ లను ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాల మేరకు పార్టీ నుండి సస్పెండ్ చేయడం జరిగిందన్నారు.

గత పదేళ్ల లో టిఆర్ఎస్ పార్టీ చేయలేని పనులను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవ త్సరాలలో పూర్తి చేయడం జరిగిందన్నారు. ఈ విషయాలు స్థానిక ప్రజలందరికీ తెలిసినవి అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడం జరుగుతుందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ. 500 లకే గ్యాస్ సిలిండర్, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్యశ్రీ రూ. 10లక్షలకు పెంపు, రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం వంటి మరెన్నో పథకాలను కొనసాగిం చడం కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమన్నారు. మండలంలోని 29 గ్రామపంచాయతీలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్, వార్డు సభ్యులను గెలిపించాలని ప్రజలను కోరారు. జిల్లాలోని ఎమ్మెల్యే ఘోరం కనకయ్యను ఈ నియోజకవర్గ ప్రజలు అత్యధిక మెజారిటీతో గెలిపించాలని గుర్తు చేశారు. ఈ సమావేశంలో నాయకులు తాటి బిక్షం, దొంతు వెంకటేశ్వర్లు, యండి. సలీమ్, రమణ, నరాటి కోటి, నాగుల్ మీరా, మూతి బుచ్చయ్య, కుర్ర శ్రీనివాస్, కుర్ర అరుణ, మూతి చంద్రకళ, మూతి లక్ష్మయ్య, రాజారాం తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వ సేవలను పారదర్శకంగా అందించాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

విశాలాంధ్ర ప్రతినిధి - మంచిర్యాల జిల్లా: ప్రభుత్వం అందించే సంక్షేమ, అభివృద్ధి సేవలను పొందడం ప్రతి పౌరుడి హక్కు అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో అవినీతి నిరోధక శాఖ డి.ఎస్.పి. జి.మధు, ఇన్స్పెక్టర్ లు ఎం.స్వామి, ఎన్.కిరణ్ రెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి పిన్న రాజేశ్వర్ లతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం పురస్కరించుకొని ఈ నెల 3వ తేది నుంచి 9వ తేదీ వరకు జిల్లాలో అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ సేవలను పొందడం ప్రతి పౌరుడు హక్కు అని, దేశ పౌరులకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలను అందించేందుకు ప్రతి ఒక్కరూ సమన్వ యంతో కృషి చేయాలని తెలిపారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లంచం అడిగితే 1064 నంబర్ కు డయల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

చదవండి..చదివించండి..న్యూయేజ్

ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే వ్యక్తి అంబేద్కర్

సింగరేణి డైరెక్టర్లు సూర్య నారాయణ, వెంకటేశ్వర్లు

విశాలాంధ్ర - కొత్తగూడెం : భరతమాత ముద్దుబిడ్డ భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఈ భూమి ఉన్నంతవరకు ప్రపంచ ప్రజల గుండెల్లో ముఖ్యంగా భారతీయుల జీవితాల్లో దర్శనమిస్తూనే ఉంటారని సింగరేణి డైరెక్టర్లు ఎల్.వి. సూర్యనారాయణ కే. వెంకటేశ్వర్లు అన్నారు.

బాబా సాహెబ్ భీమ్రావు రాంజీ అంబేద్కర్ 69వ వర్ధంతి సందర్భంగా కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా లైసెన్ సేల్ ఆఫీసులో ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమం సింగరేణి ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జనరల్ సెక్రెటరీ అంతోటి నాగేశ్వరరావు సారథ్యంలో జరిగింది.
ఒదులో ముఖ్య అతిథులుగా డైరెక్టర్లు పాల్గొన్నారు.

ముందుగా అంబేద్కర్ ఫోటోకు పూలదండ వేసి ఘనంగా నివాళులర్పిస్తూ ఆయన ఆత్మ శాంతి చేకూర్చాలని శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రపంచంలోనే ఈ ప్రమాణాలతో ఎక్కడ లేదన్నారు.

ఈరోజు భారతదేశ ప్రజలు స్వేచ్ఛగా బతుకుతున్నారంటే అది అంబేద్కర్ రాసిన భారత రాజ్యాంగమే అన్నారు. అందుకు మన మందరం ఆచాణాత్మక ఘనమైన నివాళులు అంబేద్కర్ కు అర్పించాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ మన భారతదేశంలో ఉన్న పౌరులందరికి సమాన స్వేచ్ఛ, స్వతంత్ర జీవితం, సమన్యాయం కావాలని ఆకాంక్షించినట్లు చెప్పారు.

భారత రాజ్యాంగం ఏ ఒక్కరి కోసం కాకుండా అన్ని బాధ్యత వర్గాల కోసం సమాంతర కోణంలో రూపొందించారని కొనియాడారు.
భారత సమాజంలో ప్రతి సామాజిక వర్గానికి దామాషా ప్రకారం అభివృద్ధి హక్కులు రాజ్యాధికారం ఉండాలని అంబేద్కర్ కలలు కన్నట్లు వెల్లడించారు.

భారత రాజ్యాంగం ప్రకారం అన్ని వర్గాలకు సమదృష్టితో దామాషా ప్రకారం రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం జరిగినప్పుడే స్వాతంత్ర ఫలాలు అందినట్లని బాబాసాహెబ్ అంబేద్కర్ స్పష్టం చేశారని ఈ సందర్భంగా యూనియన్ నాయకులు అంతోటి నాగేశ్వరరావు గుర్తు చేశారు.

అన్ని వర్గాల సమాంతర అభివృద్ధి కోసం కలువలు కన్నా రాజ్యాంగ శిల్పి అంబేద్కర్ మాత్రమే అని కొనియాడారు. భారతదేశ ప్రజలందరికి సమానమైన ఓటు హక్కు కల్పిండం విప్లవాత్మక మార్పు కోసం నాంది పలికిందన్నారు. భారతదేశంలో ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నప్పుడే అంబేద్కర్ కలలు నిజమవుతాయని చెప్పారు.

ఆనాటి భారతదేశం పరిస్థితుల్లో వివక్ష ఎదుర్కొన్న అంబేద్కర్ 'నేను హిందువుగా పుట్టాను... కానీ హిందువుగా మరణించను అని స్పష్టంగా ప్రకటించి సంచలనం రేపారని గుర్తు చేశారు.

హిందూమతంలో ఉన్న కుల అంతరాలు, మూఢ నమ్మకాలను వ్యతిరేకించిన అంబేద్కర్ బుద్ధిజం ధర్మాన్ని స్వీకరించారని నాగేశ్వరరావు తెలిపారు. ఐదు లక్షల మందితో మహారాష్ట్ర లొ పెద్ద కార్యక్రమం నిర్వహించి బుద్ధిజంలో వెళ్లారని తెలిపారు.

అంబేద్కర్ కన్న కలలు నేటికీ నెరవేరలేదని దేశంలో కుల వివక్ష ఇంకా ఏలూరు కొనిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ బుద్ధ భగవానుని సన్నిధిలో ఆయన ఆత్మ శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో అధికారులు బొజ్జ రవి, హోథిరం, ముల్కల శ్రావణ్ కుమార్, డాక్టర్ మాలతి, జిమ్మిడి మల్లేష్, మైలా రాజేశ్వరరావు, చెరుపల్లి నాగరాజు, మనీష్ విక్టర్, మొగిలి పాక రవికుమార్, గుడివాడ రామరాజు, రాంబాబు, రాంసింగ్, వీరన్న, అంబేద్కర్ సంఘ నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

తన గెలుపును ఎవరూ ఆపలేరు: భూక్యా చందులాల్



విశాలాంధ్ర - అశ్వాపురం : మేజర్ పంచాయతీ అయినా మండల కేంద్రం అశ్వాపురం పంచాయతీ ఎన్నికలు అధికార ప్రతిపక్షాల మధ్య తీవ్ర ప్రతిష్టగా మారాయి. పరిశ్రమిక ప్రాణతమైన అశ్వ పురం పంచాయితీ సర్పంచ్ అంటే సగం ఎమ్మెల్యే పదవిలాంటిదని భావి స్తారు. దీంతో అధికార ప్రతిపక్ష అభ్యర్థుల మధ్య తీవ్రమైన పోటీ నెలకొంది. సర్పంచ్ పదవి కోసం టిఆర్ఎస్ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థి చందులాల్ ప్రచారంలో శనివారం గడపగడపకు వెళ్లి తనను గెలిపిస్తే అవినీతి రహితంగా పంచాయతీని అభివృద్ధి చేస్తానని హామీ ఇస్తున్నారు. మిత్ర ధర్మాన్ని కాంగ్రెస్ పార్టీ విస్మరించి నిర్లక్ష్యం చేయడంతో సిపిఐ పార్టీ తటస్తంగా వుంది. ప్రచార సందర్భంగా చందులల్ మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజల మద్దత్తు తనకు ఉందన్నారు. ఎన్నికుట్రలు పన్నీనా తన గెలుపును ఎవరు ఆపలేరని ధీమా వ్యక్తం చేసారు. యువతరం కూడా తన గెలుపు కోసం పనిచేస్తున్నారని తెలిపారు. మండలంలో ప్రజలు యువనాయకత్వాన్ని కోరుకుంటు న్నారని తెలిపారు. ఇతర పార్టీల అభ్యర్థులు సేద తీర్చుకోవలసిన వయసులో మాతో పోటీ పడుతున్నారని ఎద్దేవ చేసారు. ఆ అభ్యర్థులను ఇక విశ్రాంతి తీసుకోమని గ్రామంలో ఓటర్లైనా మహిళలు, యువకులు స్పష్టంగా చెప్తున్నారు అని వెల్లడించారు. ఈ ప్రచార కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు, యూత్ కార్యకర్తలు, మహిళలు అధికంగా పాల్గొన్నారు.

మా హాయంలో అవినీతి లేదు..

యువతను తప్పుదోవా పట్టించకండి : సిపిఐ నేత వెంకన్న

విశాలాంధ్ర - అశ్వాపురం : తమ హాయంలో ఎలాంటి అవినీతి అక్రమాలు జరగలే దని తమపై దుష్ప్రచారం చేసి ఎన్నికల్లో నెగ్గలేరని సిపిఐ పార్టీ జిల్లా నాయకులు కమటం వెంకన్న స్పష్టం చేశారు. శనివారం మొండికుంట లో జరిగిన విలేకర్ల సమావేశంలొ ఆయన మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న పంచాయితీ ఎన్నికల్లో సిపిఐ, టీ జేఏసీ బలపరుస్తున్న సర్పంచ్ అభ్యర్థి పగిడిపల్లి స్వరూప ను భారీ మెజారిటీతో గెలిపించాలని స్థానిక ప్రజలను కోరారు. తమపై దుష్ప్రచారాలు చేసి గెలవాలి అనుకోవడం మూర?త్వం అని స్పష్టం చేశారు. ఈ పంచాయితీలొ గత పాలకులు చాలా అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. అందుకే ఈ సారి తమకు అవకాశం ఇస్తే గ్రామంలో రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేయడంతో పాటు అన్యవర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఆడపడుచులు బతకమ్మలు ఆడెందుకు స్థలం లేక ఎన్నో ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్నారనీ తమ అభ్యర్థి గెలిస్తే ఈ సమస్యను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. గ్రామంలో యువత కోసం వ్యాయామాలు చేసుకోవడానికి జిమ్ ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా గ్రామంలో లైబ్రరీ, సమావేశం భవనం ఏర్పాటు చేపిస్తామన్నారు. జిల్లాలోని ఆదర్శ గ్రామ పంచాయతీగా నిలబెడతామని స్పష్టం చేశారు. ఓటర్లు ఆలోచించి మార్పు కోరుతూ సిపిఐ, టీ జేఏసీ బలపర్చిన తమ అభ్యర్థులను అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేద్దాం

ఎమ్మెల్యే మేఘారెడ్డి

విశాలాంధ్ర-వనపర్తి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్

అంబేద్కర్ గారి ఆశయాల సాధనకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా వనపర్తి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలోని ఆయన విగ్రహానికి ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదల అభ్యున్నతికి అంబేద్కర్ చేసిన కృషి ఎనలేనిదనిఅంబేద్కర్ ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల విజయ్ చందర్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు వాకిటి ఆదిత్య, పట్టణ మాజీ కౌన్సిలర్లు,కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై పోలీసుల ఉక్కుపాదం

మంచిర్యాల జిల్లా, విశాలాంధ్ర ప్రతినిధి: మంచిర్యాల జిల్లా దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ గుడుంబా తయారీపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. దేవాపూర్ ఎస్సై గంగారాం ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. దేవాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లంబాడీతండా (డి) గ్రామ శివారులో రహస్యంగా గుడుంబా తయారు చేస్తున్నారని అందిన సమాచారం మేరకు, ఎస్సై గంగారాం తన సిబ్బందితో కలిసి ఆకస్మిక దాడులు నిర్వహించారు. గుడుంబా తయారీకి సిద్ధం చేసిన సుమారు 1500 లీటర్ల బెల్లం పానకాన్ని, తయారీకి వినియోగిస్తున్న ఇతర సామగ్రిని పోలీసులు అక్కడికక్కడే ధ్వంసం చేశారు. దాడుల అనంతరం ఎస్సై గంగారాం గ్రామస్తులతో సమావేశమై గట్టి హెచ్చరికలు జారీ చేశారు.గ్రామంలో ఎవరైనా గుడుంబా తయారు చేసినా, లేదా విక్రయించినా వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.గ్రామ శివార్లపై మరియు అక్రమ కార్యకలాపాలపై పోలీసుల నిఘా నిరంతరం ఉంటుందని తెలిపారు.

కార్మికుల సంక్షేమానికి కృషి చేసిన కవిత : అంతోటి

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన హాయంలో కార్మికుల సంక్షేమం కోసం విశేషంగా కృషి చేశారని ఎస్సీ ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జనరల్ సెక్రెటరీ నాగేశ్వరరావు అన్నారు. జిల్లాలోని ఒక కార్యక్రమానికి వచ్చిన కవితను ఇల్లందు గెస్ట్ హౌస్ లో మర్యాదపూర్వకంగా కలిసి పూలబొకే అందించారు. ఈ సందర్భంగా ఆమెతోటి మాట్లాడుతూ కవితక్క తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం గౌరవ అధ్యక్షురాలిగా ఉన్న సమయంలో తమ సంఘం అభ్యర్థులు విని సానుకూలంగా స్పందించే వారిని గుర్తు చేశారు. కార్మిక గుర్తింపు సంఘం ఎలక్షన్లల్లో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘమునకు మద్దతిచ్చి అప్పట్లో గెలిపించడం జరిగినదన్నారు. తమ సంఘం అభ్యర్థన మేరకు సింగరేణి కాలరీసులో భారతరత్న బాబాసాహెబ్ బిఆర్ అంబేద్కర్ జయంతి ఏప్రిల్ 14 న సెలవు దినంగా ప్రకటించడం జరిగిందని గుర్తు చేశారు. కవితను కలిసిన వారిలో నాయకులు చెర్రిపల్లి నాగరాజు, కే. మనీస్ విక్టర్, వంగపండ్ల సుమన్, తదితరులున్నారు.

మృత విశ్వ విద్యాపీఠం ఇన్‌టేక్ కోసం ఫేజ్ 2 పిహెచ్‌డి అడ్మిషన్లు 15న ముగింపు

ముంబయి : అమృత విశ్వ విద్యాపీఠం డిసెంబర్ 2025 ఇన్‌టేక్ కోసం ఫేజ్ 2 పిహెచ్‌డి అడ్మిషన్లను డిసెంబర్ 15, 2025న ముగియనుంది. విశ్వవిద్యాలయం పిహెచ్‌డి స్కాలర్లకు నెలవారీ ఫెలోషిప్‌లను రూ.30,000 నుండి రూ.40,000 వరకు మూడు సంవత్సరాల పాటు అందిస్తుంది, ప్రచురణలు, సమావేశ ప్రయాణం, ట్యూషన్ మినహాయింపులు, ప్రయోగశాల, పరిశోధన సౌకర్యాలకు ప్రాప్యతతో పాటు. అమృత తన క్యాంపస్‌లలో డాక్టోరల్ పరిశోధనలకు మద్దతు ఇవ్వడానికి ఏటా నిధులను కేటాయిస్తుంది. ఇంజనీరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యూటింగ్, ఫిజికల్ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, మెడికల్ సైన్సెస్, సోషల్ అండ్ బిహేవియరల్ సైన్సెస్, హ్యూమానిటీస్, కామర్స్, అగ్రికల్చరల్ సైన్సెస్, ఆర్కిటెక్చర్, మేనేజ్‌మెంట్‌లలో పిహెచ్‌డి ప్రోగ్రామ్‌లను అందిస్తున్నారు. అమరావతి, అమృతపురి, బెంగళూరు, కోయంబత్తూర్, చెన్నై, ఫరీదాబాద్, కొచ్చి, మైసూరు, నాగర్‌కోయిల్ అనే తొమ్మిది క్యాంపస్‌లలో ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయి. దరఖాస్తుదారులు పోస్ట్ గ్రాడ్యుయేట్ చదువులలో కనీసం 60% మార్కులు కలిగి ఉండాలి. నెట్/గేట్/సీఎస్ఐఆర్- అర్హత పొందిన అభ్యర్థులు ప్రత్యక్ష ఇంటర్వ్యూకు హాజరు కావచ్చు, మరికొందరు రాత పరీక్ష తర్వాత ఇంటర్వ్యూకు హాజరు అవుతారు. మరిన్ని వివరాలు, దరఖాస్తులు అమృత.ఎడ్యు వెబ్‌సైట్ లేదా ఇమెయిల్ ద్వారా అందుబాటులో ఉన్నాయి.

ఏబీడీ మాస్ట్రో స్కాచ్, బోల్డ్ న్యూ ఫ్యూజన్ యెల్లో డిజైనర్ విస్కీ ఆవిష్కరణ



ముంబై: సూపర్-ప్రీమియం, లగ్జరీ స్పిరిట్స్ బ్రాండ్ కంపెనీ, అలైడ్ బ్లెండర్స్ అండ్ డిస్టిల్లర్స్ (ఏబీడీ) అనుబంధ సంస్థ అయిన ఏబీడీ మాస్ట్రో ప్రైవేట్ లిమిటెడ్, స్కాచ్ మాల్ట్‌లు, ఇండియన్ మాల్ట్ విస్కీల ప్రత్యేకమైన ఫ్యూజన్ అయిన యెల్లో డిజైనర్ విస్కీని ప్రారంభించినట్లు నేడు ప్రకటించింది. ఏబీడీ మాస్ట్రో సహ వ్యవస్థాపకుడు, సృజనాత్మక భాగస్వామి అయిన రణవీర్ సింగ్ రంగీలా వోడ్కాను ప్రారంభించిన తర్వాత, కంపెనీ యెల్లో డిజైనర్ విస్కీ, ఆధునిక భారతదేశం పల్స్‌ను ప్రతిబింబించే ఒక పురోగతి ప్యాకేజింగ్‌ను పరిచయం చేసింది. వ్యక్తీకరణ, యవ్వనమైన, ప్రత్యేకంగా నిలబడటానికి జన్మించినది. ఇది దాని రంగు, సొగసైన రేఖలు, 'విస్కీ విండో' కోసం స్పాట్‌లైట్‌ను ఆకర్షిస్తుంది. ఆడంబరమైన విస్కీ కోసం, యెల్లో స్పైసైడ్, హైలాండ్ స్కాచ్‌లలో ఉత్తమమైన వాటిని ఇండియన్ మాల్ట్‌ల గొప్పతనంతో మిళితం చేస్తుంది, ఇది ప్రపంచవ్యాప్తంగా వార్తల్లో నిలుస్తోంది. ఫలితంగా రెండు ప్రపంచాల విలక్షణమైన లక్షణాలను జతచేసే అసాధారణ స్ఫూర్తి లభిస్తుంది. ఎక్స్-బోర్బన్ ఓక్‌లో పరిణతి చెందిన స్కాచ్ మాల్ట్‌లు, యెల్లోను వెనిల్లా కారామెల్, సున్నితమైన ఓక్ నోట్స్‌తో నింపుతాయి. అయితే ఇండియన్ మాల్ట్‌లు వెచ్చదనం, గొప్పతనం, బోల్డ్, లాంగ్ ఫినిషింగ్‌ను జోడిస్తాయని ఏబీడీ మాస్ట్రో ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ బిక్రమ్ బసు చెప్పారు.